ANN తెలుగు


Follow: @ANNTELUGU

29-06-2026

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 176 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## ఉమ్మడి కుటుంబ వ్యవస్థలోనే పిల్లల భవిత

### ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు

**విజయవాడ, మహా :** నేటి సమాజంలో కనుమరుగవుతున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ప్రాముఖ్యతను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నొక్కి చెప్పారు. జాతీయ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా ఆదివారం నిర్వహించిన పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, చిన్నారులకు వ్యాక్సిన్ వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అక్కడకు వచ్చిన తల్లిదండ్రులతో ఆప్యాయంగా ముచ్చటించారు. పిల్లలను ఆత్మీయంగా ఎత్తుకుని ఆడించిన ముఖ్యమంత్రి, వారి ఆరోగ్య పరిస్థితుల గురించి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా అందుబాటులో ఉన్న టీకాలను నిర్ణీత సమయంలోనే తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా నేటి జీవనశైలి, ఉద్యోగ రీత్యా తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులపై ఆయన ఆరా తీశారు. ముఖ్యంగా పిల్లల పెంపకం కేవలం తల్లుల బాధ్యత మాత్రమే కాదని, అందులో తండ్రులు కూడా సమానంగా భాగస్వాములు కావాలని సీఎం స్పష్టం చేశారు. గత కాలపు మిగతా 2వ పేజీలో


**టాప్ న్యూస్**



### ఇకపై ఇరాన్ అనే దేశమే ఉండదు

- ట్రంప్ బిగ్ వార్నింగ్
- సైనిక చర్య జరిగితే ఇరాన్ ఉనికే ఉండదన్న ట్రంప్

02



### "నరకం చూపిస్తాం"

- అమెరికా, గల్ఫ్ దేశాలకు ఇరాన్ తీవ్ర హెచ్చరిక
- హర్మూజ్ జలసంధిపై తమ పట్టు తగ్గదని స్పష్టం


02



### ఇజ్రాయెల్ లెబనాన్ కీలక ఒప్పందం

- అమెరికాకు నెతన్యాహు థ్యాంక్స్
- ఇరాన్ కు కోలుకోలేని దెబ్బ అని వ్యాఖ్య

02




### ఏఐ రంగంలో గూగుల్ మెటా మధ్య చిచ్చు

**జెమినీ వినియోగంపై కఠిన పరిమితులు.**

**ఢిల్లీ, మహా :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో ఆధిపత్యం కోసం జరుగుతున్న పోరులో టెక్ దిగ్గజాల మధ్య కొత్త సవాళ్లు మొదలయ్యాయి. తన అత్యాధునిక 'జెమినీ' ఏఐ మోడళ్ల వినియోగంపై సోషల్ మీడియా దిగ్గజం మెటాకు గూగుల్ ఊహించని షాక్ ఇచ్చింది. గూగుల్ క్లౌడ్ సేవలను అత్యధికంగా వినియోగించుకుంటున్న 2వ పేజీలో

### అమరావతిలో పొలిటికల్ హీట్

- అంబటి రాంబాబు, పేర్ని నానిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు.
- టీడీపీ ఆఫీస్ దాడి నిందితుడి ఎంట్రీతో వెలుగులోకి సంచలన నిజాలు.
- రాజధానిలో వైసీపీ నేతల పర్యటనలో అడుగడుగునా హైటెన్షన్.
- పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన అంబటిపై సెక్షన్ 30 కేసు.



### ఇడుపు కాయితం అర్థం పవన్ కళ్యాణ్‌ను అడగండి

- తెలంగాణ భాషపై ట్రోలింగ్‌కు కవిత స్ట్రాంగ్ కౌంటర్.
- బీఆర్ఎస్‌లో ఉన్నది గుంటనక్కే .. కార్పొరేట్ శక్తులకు పాలుపోసి పెంచుతోంది ఆయనే.
- జులై 2న ఉప్పల్ భగాయత్‌లో మహా భూపోరాటం.
- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లపై తెలంగాణ రక్షణ సేన సమరశంఖం.
- లాఠీలు, రబ్బరు తూటాలు నన్ను దాటుకుని రావాలి.
- ఉప్పల్ గడ్డపై కల్వకుంట్ల కవిత గర్జన

03



బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై అసెంబ్లీ వేదికగా

# బహిరంగ చర్చకు సిద్ధమా?

### నల్లగొండ గడ్డపై సీఎం రేవంత్ రెడ్డి సవాల్

### నల్లగొండలో రూ. 13వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం



**నల్గొండ, మహా :** భారత్ రాష్ట్ర సమితి నిఘంటువులో త్యాగం అంటే కేవలం ఎలక్షన్, సెలక్షన్, కలెక్షనేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఆదివారం నల్లగొండ జిల్లా కనగల్, ఎన్‌జీ కళాశాల మైదానం వేదికగా సుమారు రూ.13 వేల కోట్ల విలువైన హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన సీఎం.. బహిరంగ సభలో బీఆర్ఎస్ లక్ష్యంగా నిప్పులు చెరిగారు. వందల మంది అమరవీరుల బలిదానాల పునాదులపై ఏర్పడిన తెలంగాణను, బీఆర్ఎస్ నేతలు తమ సొంత ఖాతాలో వేసుకోవాలని చూడటం నిస్సిగ్గు చర్య అని మండిపడ్డారు. కల్వకుంట్ల కుటుంబం పదేళ్ల పాలనలో వందేళ్లకు సరిపడే విధ్వంసం సృష్టించి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనకు, తమ ముప్పై నెలల కాంగ్రెస్ ప్రజా పాలనకు మధ్య మేనిఫెస్టోలపై అసెంబ్లీ వేదికగా అడిగినన్ని రోజులు ముఖాముఖి

మిగతా 2వ పేజీలో



## పశ్చిమ్‌బెంగాల్ స్ఫూర్తిగా తెలంగాణలోనూ పోరాడాలి

- బిజెపి జాతీయఅధ్యక్షుడు నితిన్ నబీన్
- ప్రజాపోరాటాలతో ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ శ్రేణులకు పిలుపు
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యమని స్పష్టం

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో విపక్షంలో ఉన్న బీజేపీ ప్రజాపోరాటాలు చేయాలని, పశ్చిమ్‌బెంగాల్ స్ఫూర్తిగా తెలంగాణలోనూ పోరాడాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌సిన్హా సూచించారు. రంగారెడ్డి గ్రామీణ జిల్లా బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాల బీజేపీ కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పోరాడాలన్నారు. ప్రజాసేవ, పోరాటాల ద్వారానే అధికారంలోకి రాగలుగుతామని వెల్లడించారు. పార్టీని అధికారంలోకి తెస్తానని ప్రతి కార్యకర్త సంకల్పం తీసుకోవాలని సూచించారు. పశ్చిమ్‌బెంగాల్‌లో మిగతా 2వ పేజీలో

## కొత్త సీఎస్ సంజయ్ జాజుకు మెగాస్టార్ అభినందనలు

- పాత జ్ఞాపకాలను పంచుకున్న చిరంజీవి.
- ఆయన నాకు స్నేహితుడే కాదు.. సొంత సోదరుడు.
- ఆ పదవికి అత్యంత యోగ్యుడు.
- ఆయన అనుభవం తెలంగాణ ప్రగతికి వరం.
- నూతన సీఎస్‌కు సోషల్ మీడియాలో చిరంజీవి ప్రత్యేక సందేశం.

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా (సీఎస్) అత్యున్నత బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజుకు టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆయన కేవలం తనకు స్నేహితుడు మాత్రమే కాదని, ఒక సొంత సోదరుడితో సమానం అంటూ చిరంజీవి భావోద్వేగభరితమైన సందేశాన్ని పంచుకున్నారు. సంజయ్ జాజు సమర్థత, నిజాయితీ, దార్శనికత, అపారమైన అనుభవం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా చిరంజీవి పోస్ట్ చేసిన ఈ ప్రత్యేక అభినందనల సందేశం ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది.

**సోషల్ మీడియాలో మెగాస్టార్ ప్రత్యేక సందేశం**

తెలంగాణ నూతన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన




సంజయ్ జాజు సమర్థత, నిబద్ధతలను ప్రశంసిస్తూ మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా ద్వారా ఒక ప్రత్యేక సందేశాన్ని అభిమానులతో పంచుకున్నారు. రాష్ట్ర అత్యున్నత అధికార బాధ్యతలు చేపట్టిన అధికారికి సినీ పరిశ్రమకు చెందిన అగ్ర కథానాయకుడు బహిరంగంగా శుభాకాంక్షలు తెలియజేయడం

మిగతా 3వ పేజీలో

## హిందూ మహాసముద్రంలో భారత్ నూతన వ్యూహం

### 'మహాసాగర్'తో సీషెల్స్‌తో బంధం మరింత బలోపేతం.

**విక్టోరియా, మహా :** హిందూ మహాసముద్ర ప్రాంత దేశాల మధ్య పరస్పర సహకారం, భద్రత, సుస్థిర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకమైన 'మహాసాగర్' సంకల్పాన్ని ఆవిష్కరించారు. సీషెల్స్ స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల వేడుకల వేళ, తన పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ తీసుకున్న ఈ నిర్ణయం అంతర్జాతీయ దౌత్యరంగంలో అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ చరిత్రాత్మక పర్యటన సందర్భంగా సీషెల్స్ ప్రభుత్వం ప్రధాని మోదీని తమ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్'తో ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, హిందూ మహాసముద్రం మనందరి ఇల్లని, ఈ ప్రాంతపు భద్రత, స్థిరత్వం కేవలం ఒక్క దేశానికే కాకుండా అందరికీ మిగతా 2వ పేజీలో



ఆనాడే.. విభజన జరిగితే

## ఏపీ, తెలంగాణ ఇంకా అభివృద్ధి చెందేవి

### వెంకయ్యనాయుడు సంచలన వ్యాఖ్యలు

**విజయవాడ, మహా :** ఏపీ, తెలంగాణ విభజనపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. విజయవాడలో జరిగిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను విద్యార్థిగా ఉన్న సమయంలోనే అనేక ఉద్యమాలు జరిగాయన్నారు. ముఖ్యమంత్రి చెన్నారెడ్డిని దింపాలని, ఆ తరవాత నరసింహారావును దింపేయాలని మరో ఉద్యమం జరిగిందన్నారు. ఏది ఏమైనా ఆనాడే రెండు రాష్ట్రల విభజన జరిగి ఉంటే ఇంకా అభివృద్ధి చెందేవని చెప్పారు. ఏపీ మరింత అభివృద్ధి చెందేదని అన్నారు. బీజేపీ కూడా ఒక ఓటు రెండు రాష్ట్రాలు అని పిలుపునిచ్చిందని చెప్పారు. వెంకయ్యనాయుడు ఏదో ఒకరకంగా అడ్డుకట్ట వేస్తారని అప్పుడు అనుకున్నారని, కానీ సోనియాగాంధీ తనను అడిగినప్పుడు విభజనకు ఓకే చెప్పానని తెలిపారు. సోనియా గాంధీ వచ్చి మీరు సీరియస్ గానే చెబుతున్నారా? అని అడగ్గా అవుననే సమాధానం ఇచ్చానని అన్నారు. ఆ తరవాత దిగ్విజయ్ సింగ్, మురళీదేవర తనవద్దకు వచ్చి బీజేపీ




తెలంగాణకు అనుకూలమేనా? మీరు ఏదో ఒక రకంగా అడ్డుకట్ట వేస్తారని అంతా అనుకుంటున్నారని చెప్పారన్నారు. తాను పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసే వ్యక్తినని రెండు రాష్ట్రాలు ఏర్పడాలనేదానికి తాను వ్యతిరేకం కాదని చెప్పినట్లు తెలిపారు. కానీ ఆంధ్ర ప్రదేశ్‌కు తగిన న్యాయం జరగాలని దాని కోసం పోరాడతానని చెప్పినట్టు వెల్లడించారు.ఆరోజు రాత్రి 2గంటల వరకు వాదోపవాదనలు జరిగాయన్నారు. తాను ఏపీకి తగిన న్యాయంకోసం ప్రభుత్వంతో గట్టిగా వాదించానని అన్నారు. దిగ్విజయ్ సింగ్, మురళీదేవర తనతో సుమారు మూడునాలుగు రోజులు సంప్రదింపులు జరిపారని చెప్పారు. ఒకవేళ మీరు విభజనను వ్యతిరేకిస్తే మీ మీద సాకుతో మేం కూడా విభజనను వ్యతిరేకించాలని అనుకుంటున్నాం అని తనతో చెప్పారన్నారు. కానీ తాను తెలంగాణ ఏర్పాటుకు సమర్థిస్తాననే చెప్పానని తెలిపారు. ఆ తరవాత ఏపీకి ఏ రాష్ట్రానికి లభించని నిధులు, ప్రాజెక్టులు వచ్చాయని అన్నారు. ఏదో ఒక సంస్థ వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చానని తెలిపారు.

### బంగ్లా రాజకీయాల్లో షేక్ హసీనా సంచలన ప్రకటన

**ఈ ఏడాదే స్వదేశానికి తిరుగు ప్రయాణం!**

03



### పుణె వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసు

### లోహగడ్ కోటలో క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్.

02



## ఇజ్రాయెల్ లెబనాన్ కీలక ఒప్పందం

**అమెరికాకు నెతన్యాహు థ్యాంక్స్**
**ఇరాన్ కు కోలుకోలేని దెబ్బ అని వ్యాఖ్య**

**మహా :** అమెరికా మధ్యవర్తిత్వంతో లెబనాన్‌తో కుదిరిన ఒప్పందం ఇరాన్, హెజ్‌బొల్లాకు కోలుకోలేని దెబ్బ అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. ఈ ఒప్పందం ఇరు దేశాల మధ్య శాంతి స్థాపనకు ఒక చరిత్రాత్మక మలుపు అని ఆయన అభివర్ణించారు. ఈ ఒప్పందాన్ని కుదర్చడంలో కీలక పాత్ర పోషించినందుకు గాను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, విదేశాంగ మంత్రి మార్కో రూబియోలకు నెతన్యాహు ధన్యవాదాలు తెలిపారు. అలాగే, చర్చలకు ముందుకు వచ్చిన లెబనాన్ ప్రభుత్వం, అక్కడి ప్రజల ధైర్యాన్ని ఆయన అభినందించారు.

**లెబనాన్ భద్రతలో ఇరాన్‌కు పాత్ర లేదు**
లెబనాన్ భద్రతలో ఇరాన్‌కు ఇకపై ఎలాంటి పాత్ర ఉండబోదని, ఈ ఒప్పందం స్పష్టం చేస్తోందని నెతన్యాహు తెలిపారు. అలాగే, లెబనాన్ సరిహద్దుల్లోని భద్రతా జోన్‌పై ఇజ్రాయెల్ పూర్తి నియంత్రణను కలిగి ఉంటుందన్నారు. హెజ్‌బొల్లాతో పాటు ఇతర ఉగ్రవాద సంస్థలు పూర్తిగా నిరాయుధులయ్యే వరకు ఇజ్రాయెల్ తన నియంత్రణను వదులుకోదని స్పష్టం చేశారు. 'యెల్లో లైన్' సమీపంలోని రెండు ప్రాంతాల్లో హెజ్‌బొల్లాను నిరాయుధులను చేసి, ఆ భూభాగాన్ని లెబనాన్ ఆర్మీకి అప్పగించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయని నెతన్యాహు తెలిపారు.

## పశ్చిమ్‌బెంగాల్ స్ఫూర్తిగా తెలంగాణలోనూ పోరాడాలి

**మొదటి పేజీ తరువాయి**

కార్యకర్తల సంకల్పం వల్లే ఘనవిజయం సాధించామని చెప్పారు. బెంగాల్ స్ఫూర్తిగా తెలంగాణలోనూ పోరాడాలని పార్టీ శ్రేణులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారు. త్వరలో తెలంగాణలోనూ కాషాయజెండా ఎగరాలి. డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే తెలంగాణ అభివృద్ధి జరుగుతుంది. లోక్‌సభలో 2 సీట్లతో ప్రారంభమైన బీజేపీ ఇప్పుడు అప్రతిహతంగా సాగుతోంది. తెలంగాణ ఏర్పాటు కోసం సుష్మాస్వరాజ్ ఎంతో పోరాడారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ వల్లే తెలంగాణ కల సాకారమైంది అని నితిన్ నబీన్ అన్నారు. బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్ రావు ఆయనను స్వాగతించగా, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీనేతలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**త్వరలో తెలంగాణలో వస్తాం: కిషన్ రెడ్డి**
త్వరలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. నాంపల్లిలో జరిగిన బీజేపీ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలేనని విమర్శించారు. హైదరాబాద్‌ను ఈ రెండు పార్టీలు మజ్లిస్‌కు దారాదత్తం చేశాయని మండిపడ్డారు. కాబట్టి హైదరాబాద్ ప్రజలు ఆలోచించాలని, బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

## హిందూ మహాసముద్రంలో భారత్ నూతన వ్యూహం

**( మొదటి పేజీ తరువాయి )**

బాధ్యతాయుతమైన అంశమని ఉద్ఘాటించారు. 'మహాసాగర్' చొరవ ద్వారా ఈ జలాలను కేవలం రవాణా మార్గాలే కాకుండా, అపార అవకాశాలకు నిలయంగా మార్చాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని ఆయన తెలిపారు. తనకు లభించిన అత్యున్నత పురస్కారాన్ని వాతావరణ మార్పుల ధాటికి ఎదురొడ్డుతున్న ప్రపంచ దేశాలకు ఆయన అంకితం చేశారు. సీషెల్స్ అధ్యక్షుడు డాక్టర్ ప్యాట్రిక్ హెర్మినీ ఈ పర్యటనను ఇరు దేశాల దౌత్య సంబంధాల్లో ఒక కీలక మైలురాయిగా అభివర్ణించడమే కాకుండా, సీషెల్స్ యువత నైపుణ్యాభివృద్ధికి భారత్ అందిస్తున్న సహకారాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. భారత్, సీషెల్స్ మధ్య స్నేహం, నమ్మకం పునాదులపై నిర్మితమైన ఈ బంధం, భవిష్యత్తులో ఈస్ట్ ఆఫ్రికా ప్రాంతంతో భారత్ సంబంధాలను మరింత దృఢతరం చేయగలదని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగా రెండు దేశాల మధ్య పలు కీలక రంగాల్లో అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యంగా డిజిటల్ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించే దిశగా భారత్‌కు చెందిన 'యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ఫేస్'ని సీషెల్స్‌లో ప్రవేశపెట్టేందుకు నిర్ణయించారు. ఇది రెండు దేశాల మధ్య ఆర్థిక లావాదేవీలను వేగవంతం చేయడమే కాకుండా పర్యాటక రంగానికి ఊతాన్నివ్వనుంది.

దీంతో పాటు, సీషెల్స్ యువతకు అంతర్జాతీయ ప్రమాణాలతో వృత్తి విద్యా శిక్షణ అందించేందుకు భారత్ సహకారంతో 'ప్రొఫెషనల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సెంటర్'ను ఏర్పాటు చేశారు. ఈ పర్యటనలో భాగంగా విదేశీ సేవలు, డిజిటల్ బ్యాంకింగ్, ఆరోగ్యం, వ్యవసాయం వంటి సామాజిక రంగాలతో పాటు, సముద్ర గర్భ పరిశోధనలు, అంతరిక్ష విజ్ఞానం వంటి అత్యాధునిక రంగాల్లో కూడా కలిసి పనిచేయాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. అలాగే, సీషెల్స్‌లో కొత్త జాతీయ ఆసుపత్రి నిర్మాణానికి కూడా భారత్ తన సహకారాన్ని ప్రకటించింది. రెండు దేశాల మధ్య కుదిరిన ఈ బహుముఖ ఒప్పందాలు, భవిష్యత్తులో హిందూ మహాసముద్ర ప్రాంత అభివృద్ధిలో భారత్ పోషించబోయే కీలక పాత్రకు అద్దం పడుతున్నాయి.

## ఏఐ రంగంలో గూగుల్ మెటా మధ్య చిచ్చు

**( మొదటి పేజీ తరువాయి )**

మెటాకు, తమ ఏఐ మోడళ్లను వాడుకునే విషయంలో గూగుల్ కఠినమైన పరిమితులు విధించింది.

**కారణం అదేనా?**
ప్రధానంగా ఏఐ ప్రాజెక్టుల కోసం మెటా అడిగిన భారీ స్థాయిలో కంప్యూటింగ్ సామర్థ్యాన్ని అందించడంలో గూగుల్ విఫలం కావడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈ ఏడాది మార్చి నుంచే ఈ పరిమితులు అమల్లోకి వచ్చాయని ఫైనాన్షియల్ టైమ్స్ కథనం పేర్కొంది. గూగుల్ ఏఐ సేవలను అత్యధికంగా వాడే కస్టమర్లలో మెటా ముందు వరుసలో ఉంటుంది. అయితే, మెటా నుంచి వస్తున్న అసాధారణ స్థాయి డిమాండ్‌ను గూగుల్ తన వద్ద ఉన్న వనరులతో తట్టుకోలేకపోతోంది.

**మెటా ప్రాజెక్టులపై ప్రభావం**
ఈ కంప్యూటింగ్ సామర్థ్య కొరత వల్ల మెటా చేపట్టిన పలు అంతర్గత ఏఐ ప్రాజెక్టుల పురోగతి కుంటుపడింది. కొన్ని ప్రాజెక్టులు వాయిదా పడగా, మరికొన్నింటికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని అర్థం చేసుకున్న మెటా, తమ ఉద్యోగులను అప్రమత్తం చేసింది. ఏఐ వాడకాన్ని కొలిచే 'ఏఐ టోకెన్ల' వినియోగాన్ని సాధ్యమైనంత మేరకు తగ్గించుకోవాలని, అందుబాటులో ఉన్న వనరులను అత్యంత సమర్థవంతంగా వినియోగించుకోవాలని యాజమాన్యం సూచించింది. కేవలం మెటాకే కాకుండా, గూగుల్ క్లౌడ్ వాడుతున్న మరికొన్ని కంపెనీలకు కూడా ఇటువంటి పరిమితులే ఎదురవుతున్నప్పటికీ, మెటాపై పడిన ప్రభావం అత్యధికంగా ఉందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

**మౌలిక వసతుల**
**కొరతే అసలు చిక్కు**
ప్రస్తుతం టెక్ కంపెనీలన్నీ ఏఐ సామర్థ్యాలను పెంచుకునేందుకు డేటా సెంటర్లు, అధునాతన చిప్‌ల కోసం బిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తున్నాయి. అయినప్పటికీ, ఏఐ కంప్యూటింగ్ శక్తికి పెరుగుతున్న భారీ డిమాండ్‌ను అందుకోవడంలో సరఫరా వ్యవస్థ వెనుకబడిపోతోంది. ఈ విషయాన్ని స్వయంగా గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ సైతం అంగీకరించారు. కంప్యూటింగ్ సామర్థ్య పరిమితుల కారణంగా క్లౌడ్ విభాగంలో వృద్ధి ఆశించిన స్థాయిలో నమోదు కాలేదని, దీనివల్ల క్లౌడ్ విభాగం బ్యాక్‌లాగ్ గణనీయంగా పెరిగిందని ఆయన వివరించారు. జనరేటివ్ ఏఐ రంగంలో కంపెనీలు వేగంగా దూసుకుపోతున్న తరుణంలో, అందుకు కావాల్సిన మౌలిక వసతుల కొరత పరిశ్రమకు అతిపెద్ద అవరోధంగా మారుతోంది. ఈ పరిణామం టెక్ ప్రపంచంలో ఏఐ వనరుల కోసం జరుగుతున్న తీవ్రమైన పోటీని, అలాగే సరఫరాకు, డిమాండ్‌కు మధ్య ఉన్న అంతరాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ఈ సమస్య రాబోయే కాలంలో ఏఐ అభివృద్ధిని ఏ మేరకు ప్రభావితం చేస్తుందో చూడాలి.

## పుణె వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసు
# లోహగడ్ కోటలో క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్

**పుణె,మహా:** పుణెకు చెందిన ప్రముఖ యువ వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ దారుణ హత్య కేసులో దర్యాప్తు వేగవంతమైంది. ఈ సంచలన ఘటన జరిగి పది రోజులు గడుస్తున్న నేపథ్యంలో, కేసును అన్ని కోణాల్లో ఛేదించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా ప్రధాన నిందితులైన సియా గోయల్, చేతన్ చౌదరీలను హత్య జరిగిన లోహగడ్ కోట వద్దకు తీసుకెళ్లి క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించారు.

కేసు దర్యాప్తులో అత్యంత కీలకంగా మారిన ఈ ప్రక్రియపై పుణె రూరల్ ఎస్పీ సందీప్ సింగ్ గిల్ మాట్లాడుతూ వివరణ ఇచ్చారు. హత్య జరిగిన ప్రదేశంలో నిందితుల సమక్షంలోనే ఘటన ఎలా జరిగిందో పూర్తి వివరాలను వారు పోలీసులకు వివరించారు. ఈ క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ ద్వారా ఘటన జరిగిన రోజున నిందితులు కోట వద్దకు ఎలా చేరుకున్నారు, ఏయే సమయాల్లో వారు ఎక్కడ ఉన్నారు, అసలు హత్యకు ముందు మరియు ఆ సమయంలో వారి కదలికలు ఏ విధంగా ఉన్నాయి అనే అంశాలను దర్యాప్తు అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.

సంఘటన జరిగిన రోజున వరుస క్రమంలో జరిగిన ప్రతి చిన్న విషయాన్ని పోలీసులు పునఃసృష్టించారు. ఈ మొత్తం ప్రక్రియను పోలీసులు వీడియో రికార్డింగ్ చేశారు. కోర్టు విచారణలో ఈ వీడియోలు కీలక సాక్ష్యాలుగా ఉపయోగపడతాయని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు, క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ తర్వాత పోలీసులు నిందితురాలు సియాను అక్కడి నుంచి తరలిస్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నిందితులు నేరాన్ని అంగీకరించిన నేపథ్యంలో, పూర్తిస్థాయిలో ఆధారాలను సేకరించి నిందితులకు త్వరగా శిక్ష పడేలా చూస్తామని పోలీసులు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు దర్యాప్తు ముగిసిన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

## బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై అసెంబ్లీ వేదికగా
# బహిరంగ చర్చకు సిద్ధమా?



**( మొదటి పేజీ తరువాయి )**
చర్చకు సిద్ధమా అని సంచలన సవాల్ విసిరారు.

**నల్లగొండలో రూ.13 వేల కోట్ల**
**అభివృద్ధి పనుల జాతర**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్లగొండ జిల్లాలో విస్తృతంగా పర్యటించి రికార్డు స్థాయి నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో చేపట్టనున్న సుమారు రూ.13 వేల కోట్ల హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. కనగల్ వేదికగా హ్యామ్ రోడ్ల పైలాన్‌ను ఆవిష్కరించిన సీఎం.. నల్గొండ కార్పొరేషన్‌లో తొలిదశ తాగునీటి ప్రాజెక్టు పనులకు, రూ.83 కోట్లతో తొలిదశ తాగునీటి శుద్ధి కేంద్రం పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఎన్‌జీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు హాజరై మాట్లాడారు.

***త్యాగం అంటే బీఆర్ఎస్‌కు**
**ఎలక్షన్, సెలక్షన్, కలెక్షన్***
మాట్లాడితే తాము త్యాగాలు చేశామని చెప్పుకునే బీఆర్ఎస్ నేతల అసలు రంగును సీఎం రేవంత్ రెడ్డి ఎండగట్టారు. బీఆర్ఎస్ నిఘంటువులో త్యాగం అంటే కేవలం రాజీనామాలు చేయడం, ఎలక్షన్స్ తేవడం, సెలక్షన్లు చూసుకోవడం, చివరికి వేల కోట్లు కలెక్షన్లు చేయడమేనని ఎద్దేవా చేశారు. వందల మంది ప్రాణ త్యాగాలు చేసి తెలంగాణ సాధిస్తే.. ఆ క్రెడిట్ మొత్తాన్ని కేసీఆర్ ఫ్యామిలీ తమ సొంత ఖాతాలో వేసుకుని పదేళ్ల పాటు పదవులు అనుభవించిందని, రాష్ట్రాన్ని నిలువునా దోచుకుందని ధ్వజమెత్తారు.

**నిజమైన త్యాగం కొండా లక్ష్మణ్**
**బాపూజీది, కోమటిరెడ్డిది**
త్యాగానికి అసలైన నిర్వచనం చెప్పాలంటే కాంగ్రెస్ నేతలను, ఉద్యమకారులను చూసి నేర్చుకోవాలని రేవంత్ రెడ్డి అన్నారు. 1969 తొలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకున్న మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. ఆయన తర్వాత మలిదశ ఉద్యమంలో రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవిని త్యాగం చేసి, నల్లగొండ జిల్లా ప్రజలు గర్వపడేలా దీక్ష చేసిన ఏకైక వ్యక్తి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అని, అది అసలైన త్యాగమని స్పష్టం చేశారు.

***అగ్గిపెట్టె రావులవి త్యాగాలు కావు..**
**హరీశ్ రావుపై ఘాటు వ్యాఖ్యలు***
తెలంగాణ కోసం పెట్రోల్ పోసుకుని ప్రాణార్పణ చేసిన శ్రీకాంతా చారి లాంటి ఎందరో అమరవీరుల త్యాగాలను బీఆర్ఎస్ విస్మరించిందని సీఎం మండిపడ్డారు. ఏ పదవులు ఆశించకుండా ప్రాణాలర్పించిన వారిని కాదని, వంద రూపాయల పెట్రోల్ ఒంటిపై పోసుకుని జేబులో అగ్గిపెట్టె దాచుకున్న 'అగ్గిపెట్టె రావులవి' త్యాగాలు కావంటూ పరోక్షంగా హరీశ్ రావుపై అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు. అగ్గిపెట్టె తెచ్చుకోని వాళ్లు ఈ రోజు త్యాగాల గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు.

**బావబామ్మర్దులు తోడేళ్లలా**
**తెలంగాణ మీద పడ్డారు**
కల్వకుంట్ల కుటుంబంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో వందేళ్ల విధ్వంసం సృష్టించిన చరిత్ర కల్వకుంట్ల ఫ్యామిలీదేనని కామెంట్ చేశారు. అధికారం కోల్పోయామనే అక్కసుతో కేటీఆర్, హరీశ్ రావులను ఉద్దేశించి మాట్లాడుతూ.. బావబామ్మర్దులు ఇద్దరూ తోడేళ్ల లెక్క తెలంగాణ మీద పడ్డారని, రాష్ట్రంపై కడుపులో విషం నింపుకుని తిరుగుతున్నారని ఫైర్ అయ్యారు. కల్వకుంట్ల కుటుంబ అవినీతిని చూసే తెలంగాణ ప్రజలు ఆ కుటుంబాన్ని శాశ్వతంగా బహిష్కరించారని, మళ్లీ వారికి పదవులు ఇచ్చేందుకు ప్రజలు ఏమాత్రం సిద్ధంగా లేరని స్పష్టం చేశారు.

**పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తుంటే కడుపు మంట**
బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏనాడూ పేదల ఇళ్ల గురించి పట్టించుకోలేదని, వాళ్లు మాత్రం పెద్ద పెద్ద ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ తన పదేళ్ల మంత్రివర్గంలో కనీసం ఒక్క మహిళకు కూడా చోటు ఇవ్వలేదని ఆరోపించారు. తాము ఇప్పుడు ప్రతి గ్రామంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తుంటే బీఆర్ఎస్ నాయకుల కడుపు మండుతోందని, అందుకే ఓర్వలేక ఏడుస్తున్నారని మండిపడ్డారు. తమ 30 నెలల కాలంలోనే పేదల సంక్షేమం కోసం లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశామని, కేవలం రైతుల ఖాతాల్లోనే రూ.1.56 లక్షల కోట్లు జమ చేసి అన్నదాతలకు దన్నుగా నిలిచామని వెల్లడించారు.

**అసెంబ్లీ వేదికగా బహిరంగ**
**చర్చకు సిద్ధమా? సీఎం సవాల్**
పాలనపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను తిప్పికొడుతూ సీఎం రేవంత్ రెడ్డి సంచలన సవాలు విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన.. ముప్పై నెలల తమ కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా అని నిలదీశారు. "స్పీకర్‌కు లేఖ రాయండి.. ఇరు పార్టీల మేనిఫెస్టోలపై అడిగినన్ని రోజులు అసెంబ్లీ వేదికగానే ముఖాముఖి చర్చిద్దాం" అని సవాల్ విసిరారు. మూసీ కాలుష్యం కంటే బీఆర్ఎస్ నేతల కడుపులోనే ఎక్కువ విషం నిండి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఎస్ఎల్‌బీసీని పడావ్ పెట్టిన దుర్మార్గులు..**
**సూర్యాపేట వ్యక్తికీ ఓటమి తప్పదు***
నల్లగొండ జిల్లా ప్రాజెక్టులను బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిందని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పదేళ్ల పాటు పడావ్ పెట్టిన దుర్మార్గులు బీఆర్ఎస్ నేతలేనని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్‌కు గతమే కానీ భవిష్యత్తు లేదని, ఆ పార్టీకి ప్రజలే ఉప్పుపాతర వేశారని, మళ్లీ అక్కడ మొక్క కూడా మొలవనీయరని అన్నారు. తులసి వనంలో గంజాయి మొక్కలాగా సూర్యాపేటలో ఒక జానెడు ఉన్న వ్యక్తి (జగదీష్ రెడ్డిని ఉద్దేశించి) మాత్రమే మిగిలాడని, వచ్చే ఎన్నికల్లో ఆయనను కూడా గెలవనియ్యబోమని సీఎం రేవంత్ రెడ్డి ఓపెన్ ఛాలెంజ్ చేశారు.

**ప్రాజెక్టులు పూర్తి చేస్తాం: డిప్యూటీ సీఎం భట్టి**
**విక్రమార్క**
ఈ బహిరంగ సభలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలనకు నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆశీర్వాదం పూర్తిగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లాకు ఎన్ని నిధులైనా ఇచ్చేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఎస్ఎల్‌బీసీ , డిండి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు.

**కేసీఆర్ తినే సన్నబియ్యమే**
**నా పేదోళ్లూ తింటున్నారు**
కాంగ్రెస్ ప్రజా పాలనలో పేదల సంక్షేమానికి పెద్దపీట వేశామని సీఎం రేవంత్ రెడ్డి గర్వంగా ప్రకటించారు. తాము అధికారంలోకి వచ్చాక ఏటా రూ.16 వేల కోట్లు ఖర్చు చేస్తూ నిరుపేదలందరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. "నేడు ఫామ్‌హౌస్‌లో కూర్చుని కేసీఆర్ తింటున్న సన్న బియ్యమే.. తెలంగాణలోని తండాల్లో ఉన్న నా పేద ప్రజలు తింటున్నారు" అని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో ఏమైనా అనుమానం ఉంటే కేటీఆర్ స్వయంగా తండాలకు వెళ్లి చూసుకోవచ్చని హితవు పలికారు. అలాగే మహిళల కష్టాలు తీరుస్తూ కేవలం రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు.

# అమరావతిలో పొలిటికల్ హీట్



**అమరావతి, మహా:** రాజధాని అమరావతి పరిధిలోని ఉండవల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల పర్యటన తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. పచ్చని రాజధాని గ్రామాల్లో ఉద్దేశపూర్వకంగానే చిచ్చుపెట్టేలా జరిగిన ఈ పరిణామాలు పోలీసుల దర్యాప్తులో సంచలన విషయాలను వెలుగులోకి తెస్తున్నాయి. ఒకవైపు మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నానిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు కాగా, మరోవైపు సాక్షాత్తూ పోలీసులపైనే దౌర్జన్యానికి దిగడంతో అంబటిపై సెక్షన్ 30 కింద కేసు నమోదైంది. గతంలో టీడీపీ ఆఫీసుపై దాడి చేసిన నిందితుడు కూడా ఈ అల్లర్లలో వైసీపీ నేతల వెంటే ఉన్నట్లు పోలీసులు గుర్తించడం ఈ కుట్ర కోణాన్ని మరింత స్పష్టం చేస్తోంది. అల్లర్లకు పాల్పడిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని పోలీసులు వార్నింగ్ ఇస్తుండటంతో రాజధాని రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

**రాజధానిలో రగిలిన ఉద్రిక్తతల మంటలు**
రాజధాని అమరావతి పరిధిలోని ఉండవల్లి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బృందం పర్యటన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన సంగతి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రశాంతంగా ఉండే రాజధాని గ్రామాల్లో ఒక్కసారిగా రాజకీయ సెగలు రగులుకున్నాయి. నేతల రాకతో ఇరు వర్గాల మధ్య తీవ్ర స్థాయి ఘర్షణలు చోటుచేసుకోవడంతో ఆ ప్రాంతమంతా రణరంగాన్ని తలపించింది. ఈ పరిణామాలతో స్థానికంగా భారీ భద్రత నడుమ హైటెన్షన్ వాతావరణం నెలకొంది.

**తాడేపల్లి పోలీసుల యాక్షన్..**
**మూడు కేసులు నమోదు**
ఉండవల్లి ఘర్షణల నేపథ్యంలో తాడేపల్లి పోలీసులు అత్యంత సీరియస్ యాక్షన్ తీసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన ఈ వ్యవహారంపై అందిన వేర్వేరు ఫిర్యాదుల మేరకు పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. మొత్తం మూడు వేర్వేరు కేసులను నమోదు చేసి లోతైన దర్యాప్తును వేగవంతం చేశారు. ఇరు పక్షాల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్న పోలీసులు విచారణను ముమ్మరం చేసి అసలు దోషులను పట్టుకునే పనిలో పడ్డారు.

**అంబటి, పేర్ని నానిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ**
వైసీపీ బృందం పర్యటనలో చోటుచేసుకున్న పరిణామాలపై పెనుమాక గ్రామానికి చెందిన మాణిక్యం అనే వ్యక్తి పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు అగ్ర నేతలపై తీవ్రమైన కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని సహా పలువురు కీలక వైసీపీ నాయకులపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

**ఖాకీలపైనే ప్రతాపం.. అంబటిపై సీఐ ఫిర్యాదు**
చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులపైనే నేతలు దౌర్జన్యానికి దిగడం విస్మయానికి గురిచేసింది. వైసీపీ నేతల పర్యటన సమయంలో విధుల్లో ఉన్న ఒక పోలీస్ అధికారిని మాజీ మంత్రి అంబటి రాంబాబు నెట్టివేశారు. ఈ దౌర్జన్యకాండపై సీఐ వీరేంద్రబాబు స్వయంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విధులకు ఆటంకం కలిగించినందుకు గాను అంబటి రాంబాబుపై పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 కింద మరో కేసు నమోదైంది.

**కానిస్టేబుల్‌పై దాడి చేసిన బ్యాచ్‌పై నజర్**
ఈ మొత్తం ఎపిసోడ్‌లో పర్యటన విధుల్లో ఉండి బందోబస్తు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్‌పై కొందరు దారుణంగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడి చేసిన ప్రత్యేక బ్యాచ్ పైనే పోలీసులకు ఇప్పుడు అనుమానాలు బలంగా ఉన్నాయి. చట్టాన్ని రక్షించే ఖాకీలపైనే చేయి చేసుకున్న ఆ గుంపును గుర్తించి, వారి వెనుక ఉండి నడిపిస్తున్న అసలు సూత్రధారులు ఎవరన్న దానిపై పోలీసులు ప్రధానంగా దృష్టి సారించారు.


**ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు.. పోలీసుల వార్నింగ్**
రాజధాని ప్రాంతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై ఉక్కుపాదం మోపుతామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ఈ ఉద్రిక్తతలకు కారణమైన వారు ఎంతటి వారైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పూర్తిస్థాయి ఆధారాలతో దర్యాప్తును ముమ్మరం చేశామని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఘర్షణలకు దిగిన వారందరికీ కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని పోలీస్ ఉన్నతాధికారులు హెచ్చరించారు.

**వైసీపీ నేత కారు అద్దాల ధ్వంసం.. కౌంటర్ కేసు**
మరోవైపు ఈ ఘర్షణలో వైసీపీ వర్గం కూడా పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ పర్యటనను అడ్డుకునే క్రమంలో వైసీపీ నేత నారాయణమూర్తి కారు అద్దాలను పగలగొట్టారంటూ ఆయన పోలీసులను ఆశ్రయించారు. నారాయణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్పందించిన పోలీసులు.. ఆ ఘటనకు కారణమైన రైతులు, కొందరు టీడీపీ నేతలపై కూడా కౌంటర్ కేసు నమోదు చేసినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది.

**లోతైన దర్యాప్తులో పోలీసుల స్పీడ్**
ఉండవల్లిలో అకస్మాత్తుగా తలెత్తిన ఈ ఉద్రిక్త పరిస్థితులపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. కేవలం రాజకీయ పర్యటనగా మొదలైన ఈ కార్యక్రమం ఇంతటి హింసాత్మక ఘర్షణకు ఎలా దారితీసిందన్న దానిపై కూపీ లాగుతున్నారు. సీసీ ఫుటేజీలు, స్థానికులు తీసిన వీడియోల ఆధారంగా అల్లర్లకు పాల్పడిన ప్రతి ఒక్కరినీ గుర్తించేందుకు పోలీసులు పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు.

**పక్కా స్కెచ్‌తో రైతులను రెచ్చగొట్టారా?**
ఈ ఘర్షణలు యాదృచ్ఛికంగా జరిగినవి కావని, దీని వెనుక ఒక పక్కా స్కెచ్ ఉందన్న కోణంలో విచారణ సాగుతోంది. తొలుత కొందరు వ్యక్తులు పనికట్టుకుని రాళ్లదాడి చేసి.. ఉద్దేశపూర్వకంగానే రాజధాని రైతులను రెచ్చగొట్టారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శాంతియుతంగా ఉన్న రైతులను రెచ్చగొట్టి ఉద్రిక్తతలు సృష్టించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనే కుట్ర జరిగిందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**సీన్‌లోకి టీడీపీ ఆఫీస్**
**దాడి నిందితుడు చైతన్య**
పోలీసుల దర్యాప్తులో ఒక సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. గతంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి ఘటనలో ప్రధాన నిందితుడిగా ఉన్న చైతన్య అనే వ్యక్తి ఈ అల్లర్లలో ప్రత్యక్షమయ్యాడు. నిన్నటి గొడవలో వైసీపీ నేతల వెంటే చైతన్య ఉన్నట్లు పోలీసులు ఆధారాలతో సహా గుర్తించారు. పాత నేరస్థుడు ఇలాంటి పర్యటనలో ముందుండటం పోలీసుల అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది.



## ఇకపై ఇరాన్ అనే దేశమే ఉండదు

**ట్రంప్ బిగ్ వార్నింగ్**

**మహా :** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరోసారి పతాక స్థాయికి చేరాయి. ఒకవేళ వాషింగ్టన్ సైనిక చర్యకు దిగాల్సి వస్తే గనుక ఇకపై ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ అనే దేశమే ఉనికిలో ఉండదు అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ లక్ష్యాలపై అమెరికా వరుసగా రెండో రోజు కూడా వైమానిక దాడులు నిర్వహించిన అనంతరం ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని టెహ్రాన్ పదే పదే ఉల్లంఘిస్తోందని ఆరోపించిన ట్రంప్.. అమెరికా యుద్ధ విమానాలు ఇరాన్‌కు చెందిన క్షిపణులు, డ్రోన్ నిల్వ కేంద్రాలతో పాటు తీరప్రాంత రాడార్ స్థావరాలపై మెరుపు దాడులు జరిపినట్లు ప్రకటించారు. ఒకానొక దశలో తాము శాంతియుతంగా ఉండలేమని, ఈ ఏడాది ఆరంభంలో తాము విజయవంతంగా ప్రారంభించిన పనిని సైనిక పరంగా పూర్తిగా ముగించాల్సి వస్తుందని, అదే గనుక జరిగితే ఇరాన్ అనే దేశమే అంతమైపోతుందని ఘాటుగా హెచ్చరించారు.



## "నరకం చూపిస్తాం"

**.. అమెరికా, గల్ఫ్ దేశాలకు**
**ఇరాన్ తీవ్ర హెచ్చరిక**

**మహా :** మధ్యప్రాచ్యం మరోసారి యుద్ధ జ్వాలల్లో రగులుతోంది. తమ దేశ భూభాగంపై అమెరికా శనివారం జరిపిన వైమానిక దాడులకు ప్రతీకారంగా.. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఆదివారం తెల్లవారుజామున రంగంలోకి దిగింది. కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ నౌకాదళం, ఏరోస్పేస్ బలగాలు సంయుక్తంగా భారీ ఎత్తున క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. సిరిక్ ప్రాంతంపై అమెరికా జరిపిన దాడుల వల్ల హర్మూజ్ జలసంధిపై తమకున్న పట్టు ఏమాత్రం తగ్గదని, నిబంధనలను ఉల్లంఘించే వారికి తగిన బుద్ధి చెప్తామని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. అంతేకాకుండా, రాబోయే రోజుల్లో ఈ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలు నరకాన్ని చవిచూస్తాయంటూ అత్యంత భయానక హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్ శనివారం రాత్రి కువైట్, బహ్రెయిన్‌లపై క్షిపణి వర్షం కురిపించగా.. తమ వైమానిక రక్షణ వ్యవస్థలు శత్రువుల డ్రోన్లు, క్షిపణులను విజయవంతంగా అడ్డుకుంటున్నట్లు కువైట్ సైన్యం ధృవీకరించింది.

**ఉమ్మడి కుటుంబ వ్యవస్థలోనే**
## పిల్లల భవిత

**( మొదటి పేజీ తరువాయి )**

ఉమ్మడి కుటుంబ వ్యవస్థలోని గొప్పతనాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. "నాడు ఉమ్మడి కుటుంబాలలో అమ్మమ్మలు, తాతయ్యలు, ఇతర కుటుంబ సభ్యుల సమక్షంలో పిల్లలు ఎంతో బాధ్యతాయుతమైన విలువలతో పెరిగేవారు. నేటి పరిస్థితుల్లో పిల్లల పెంపకం భారంగా కాకుండా, ఆనందాన్ని ఇచ్చే సంపదగా చూడాలి" అని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మళ్లీ బలపడాల్సిన అవసరం ఉందని, అది సమాజానికి ఎంతో అవసరమని ఆయన ఆకాంక్షించారు. మారిన కాలంతో పాటు సంతానం పెంపకంలో తండ్రి బాధ్యత పెరగాలని ఆయన హితవు పలికారు. అంతేకాకుండా, ప్రభుత్వం ఇప్పటికే ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు కలిగిన కుటుంబాలను ప్రోత్సహిస్తోందని, ఈ దిశగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని చంద్రబాబు వివరించారు. కుటుంబ వ్యవస్థ బలంగా ఉన్నప్పుడే భావి భారత పౌరులు ఉత్తమ సంస్కారాలతో ఎదిగే అవకాశం ఉంటుందని ఆయన ఉద్ఘాటించారు.



# నల్గొండలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు భారీ స్పందన

**యాదాద్రి భువనగిరి జూన్ 28 మహా న్యూస్:**ఆదివారం నల్లగొండలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్ హెలిప్యాడ్ నుంచి ఎన్జీ కళాశాల సభా ప్రాంగణానికి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం.మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ రఘువీర్‌తో కలిసి ర్యాంప్‌వాక్ చేసిన సీఎం భారీ బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు.సీఎం ప్రసంగంలో నల్గొండకు ఎలాంటి వరాలు ప్రకటిస్తారోనని ఉత్కంఠ.కనగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భారీ రోడ్ల అభివృద్ధి పనులకు శ్రీకారం.నల్గొండ-దేవరకొండ రహదారిపై మార్కెట్ యార్డ్ సమీపంలో రూ.13,006.27 కోట్ల వ్యయంతో 441 HAM రహదారుల విస్తరణ, పటిష్టీకరణ పనులకు శంకుస్థాపన.పైలాన్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి.సీఎం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు జిల్లా మంత్రులు, కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధుల ఘన స్వాగతం.రాష్ట్ర రహదారుల అభివృద్ధిలో ఇది కీలక మైలురాయిగా నిలవనుందని అధికార వర్గాల అభిప్రాయం.

## కరంచంద్ కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్

**మొయినాబాద్ మహా:** యెన్కెపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా ఉపాధ్యక్షుడు డప్పు కరంచంద్ మృతిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కరంచంద్ చిత్రపటానికి నివాళులర్పించిన కేటీఆర్, కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, ముగ్గురు పిల్లల భవిష్యత్తుకు ఆర్థిక సహాయం అందిస్తామని, ఆయన భార్యకు ఉద్యోగం కల్పించేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఆర్.



ఎస్. ప్రవీణ్ కుమార్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఇడుపు కాయితం' అర్థం పవన్ కళ్యాణ్‌ను అడగండి

- తెలంగాణ భాషపై ట్రోలింగ్‌కు కవిత స్ట్రాంగ్ కౌంటర్.
- బీఆర్ఎస్‌లో ఉన్నది గుంటనక్కే .. కార్పొరేట్ శక్తులకు పాలుపోసి పెంచుతోంది ఆయనే.
- జులై 2న ఉప్పల్ భగాయత్‌లో మహా భూపోరాటం.
- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లపై తెలంగాణ రక్షణ సేన సమరశంఖం.
- లాఠీలు, రబ్బరు తూటాలు నన్ను దాటుకుని రావాలి.
- ఉప్పల్ గడ్డపై కల్వకుంట్ల కవిత గర్జన.



జులై 2న ఉప్పల్ భగాయత్‌లో మహా భూపోరాటం

**హైదరాబాద్,మహా :** తెలంగాణ అస్తిత్వంపై దాడులు జరుగుతుంటే రాష్ట్రంలోని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు గప్‌చుప్ అయ్యాయని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆనాడు తెలంగాణను అడ్డుకున్న అనకొండలు, కార్పొరేట్ శక్తులకు బీఆర్ఎస్‌లో ఉన్న ఒక గుంటనక్కే పాలు పోసి పెంచుతోందని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. ఉప్పల్‌లో పార్టీ జెండా ఆవిష్కరణ సందర్భంగా మాట్లాడిన ఆమె.. 'ఇడుపు కాయితం' అనే పదానికి అర్థం పవన్ కళ్యాణ్‌ను అడిగితే బాగా చెబుతాడంటూ తెలంగాణ భాషను అవహేళన చేసేవారికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల సాధన కోసం జులై 2న ఉప్పల్ భగాయత్‌లో మహా భూపోరాటం చేయనున్నట్లు ప్రకటించిన కవిత.. తెలంగాణ కోసం ఇకపై పోరాడేది ఒక్క టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) మాత్రమేనని స్పష్టం చేశారు.

**ఉప్పల్ ఉద్యమానికి అడ్డా.. ఇక్కడే మా తొలి అడుగు**

ఉప్పల్ ప్రాంతం అంటేనే తెలంగాణ ఉద్యమానికి అడ్డా అని, అలాంటి చారిత్రక ప్రాంతంలో తమ పార్టీ జెండా ఎగురవేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఎంతో పోరాడి తెలంగాణ సాధించుకున్నప్పటికీ, ఉద్యమ సమయంలో మనం కన్న కలలను, అనుకున్న లక్ష్యాలను రాష్ట్రం వచ్చాక కూడా సాధించుకోలేకపోయామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రజల పక్షాన నిలబడేందుకు మరోసారి ఉద్యమకారులందరినీ ఏకం చేస్తున్నామని తెలిపారు.

ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇస్తామన్న 250 గజాల భూమి హామీ కోసం ప్రత్యక్ష పోరాటానికి దిగుతున్నట్లు కవిత ప్రకటించారు. ఇందులో భాగంగా జులై 2వ తేదీన ఉప్పల్ భగాయత్‌లో పెద్ద ఎత్తున భూపోరాటం చేయబోతున్నామని స్పష్టం చేశారు. ఈ పోరాటానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులంతా పెద్ద ఎత్తున తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న ఉద్యమకారులు, మహిళలు, విద్యార్థుల హక్కుల సాధన కోసం తెలంగాణ రక్షణ సేన నిరంతరం పోరాటం చేస్తుందని భరోసా ఇచ్చారు.

**'ఇడుపు కాగితం' అర్థం పవన్ కళ్యాణ్‌కు బాగా తెలుసు**

తెలంగాణ భాషను అవహేళన చేసే వారిపై కవిత తీవ్రంగా మండిపడ్డారు. 'ఇడుపు కాగితం' అనే పేరును ఒక సినిమాకు పెడితే, అది అర్థం కాలేదంటూ కొందరు ట్రోలింగ్ చేస్తున్నారని విమర్శించారు. ఇడుపు కాగితం అంటే అర్థం ఏమిటో మీ పవన్ కళ్యాణ్‌ను అడిగితే బాగా చెబుతాడని ఆమె ఘాటుగా బదులిచ్చారు. ఒకరి భాషను మరొకరు గౌరవించుకుందామని, కానీ తెలంగాణ భాషను అవమానిస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. నాడు ఇలాగే మన భాషను, సంస్కృతిని అవహేళన చేస్తేనే పోరాటం చేసి తెలంగాణ సాధించుకున్నామని గుర్తుచేశారు.

**ఆ మూడు పార్టీలు గప్‌చుప్..**
**సీఎంకు ఉద్యమంతో సంబంధమే లేదు**

తెలంగాణ అస్తిత్వంపై, భాషపై దాడి జరుగుతుంటే ప్రధాన పార్టీలన్నీ మౌనం వహిస్తున్నాయని కవిత విమర్శించారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రికి అసలు తెలంగాణ ఉద్యమంతోనే సంబంధం లేదని, అందుకే ఆయన ఏమీ మాట్లాడటం లేదన్నారు. ఇక బీజేపీకి 'దేశం' జపం తప్ప మన రాష్ట్రం పట్ల ఎలాంటి పట్టింపు లేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ కూడా తెలంగాణ ప్రయోజనాల గురించి మాట్లాడటం మానేసిందని, ఆ పార్టీకి తెలంగాణతో పేగు బంధం పూర్తిగా తెగిపోయిందని దుయ్యబట్టారు.

**అవాకులు, చెవాకులు పేలిన వాళ్లే మళ్లీ కుట్రలు చేస్తున్నారు**

ఉద్యమ కాలంలో తెలంగాణను వ్యతిరేకిస్తూ అవాకులు, చెవాకులు పేలిన నాయకులు, శక్తులంతా ఇప్పుడు మళ్లీ పేట్రేగిపోతున్నారని, తెలంగాణపై కుట్రలు చేస్తున్నారని కవిత హెచ్చరించారు. అలాంటి శక్తుల ఆటలు సాగనివ్వబోమని, తెలంగాణ ప్రజల కోసం, ఉద్యమకారుల కోసం తాను ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు.

**లాఠీలు, రబ్బరు తూటాలు నన్ను దాటుకునే రావాలి**

ప్రజల పక్షాన నిలబడే పోరాటంలో తాను వెనకడుగు వేసే ప్రసక్తే లేదని కవిత తేల్చిచెప్పారు. లాఠీలు దెబ్బలైనా, రబ్బరు తూటాలైనా ముందుగా నన్ను దాటుకొనే మీ వద్దకు రావాలి అని కార్యకర్తలకు ధైర్యం నూరిపోశారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక కచ్చితంగా రాష్ట్రంలో ఉచిత విద్య, వైద్యం అందిస్తుందని ఆమె హామీ ఇచ్చారు.

**దోచుకుంటున్న కార్పొరేట్ స్కూళ్లు..**
**ఫీజులు తగ్గించని సీఎం**

కార్పొరేట్ స్కూళ్లు, ఆసుపత్రుల దోపిడీపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో రోజుల నుంచి కార్పొరేట్ స్కూళ్ల ఫీజులు తగ్గించాలని డిమాండ్ వస్తున్నా ఈ ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదన్నారు. నారాయణ, చైతన్య సహా పెద్ద కార్పొరేట్ స్కూళ్లు, హాస్పిటల్స్‌లో స్థానిక సంస్థలైన మదర్ డెయిరీ, ముల్కనూరు, విజయ డెయిరీల నుంచే పాలు కొనుగోలు చేసేలా ప్రభుత్వం తక్షణమే జీవో తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు.

**బీఆర్ఎస్‌లో ఉన్న ఆ గుంటనక్కే**
**కార్పొరేట్లకు పాలుపోస్తోంది**

బీఆర్ఎస్ మౌనం వెనుక ఉన్న వ్యాపార కోణాన్ని కవిత ఎండగట్టారు. ఆ పార్టీలో ఉండే ఒక గుంటనక్క.... నారాయణ, చైతన్య విద్యాసంస్థలతో పాల వ్యాపారం చేస్తున్నాడని ఆరోపించారు. ఆంధ్రా వాళ్లతో వ్యాపారాలు చేస్తున్నందుకే బీఆర్ఎస్ నేతలు కనీసం నోరు మెదపడం లేదన్నారు. నాడు తెలంగాణను అడ్డుకునేందుకు ఏ అనకొండలు, ఏ కార్పొరేట్ శక్తులు ప్రయత్నించాయో.. నేడు ఆ శక్తులకే బీఆర్ఎస్‌లోని ఆ గుంటనక్క పాలు పోసి పెంచుతున్నారని తీవ్ర విమర్శలు చేశారు.

**ఉద్యోగాలన్నీ పరాయి వాళ్లకేనా? కనీసం బాత్రూమ్‌లు కడిగే పని కూడా ఇవ్వరా?**

కార్పొరేట్ సంస్థల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకపోవడంపై కవిత మండిపడ్డారు. ఆయా స్కూళ్లలో కటింగ్, బట్టలు ఉతకటం, ఫర్నీచర్ వంటి చిన్న పనులకు కూడా మన వాళ్లకు అవకాశం ఇవ్వడం లేదన్నారు. టీచర్లను సైతం 80 శాతం కేరళ, ఆంధ్రా నుంచే తీసుకొస్తున్నారని, ఇప్పుడు నార్త్ ఇండియా నుంచి వస్తున్న స్కూళ్లలో బాత్రూమ్‌లు కడిగేందుకు కూడా అక్కడి వాళ్లనే తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో మన హక్కుల కోసం కేవలం తమ టీఆర్ఎస్ మాత్రమే మాట్లాడుతోందని స్పష్టం చేశారు

**ఉప్పల్ ఎమ్మెల్యే సీటు మాదే.. ప్రజాసేవ అంటే చూపిస్తాం**

భవిష్యత్ రాజకీయ కార్యాచరణను ప్రకటిస్తూ.. రాబోయే రోజుల్లో ఉప్పల్‌లోని అన్ని డివిజన్లలో తమ పార్టీ పోటీ చేస్తుందని కవిత వెల్లడించారు. భవిష్యత్తులో ఉప్పల్ ఎమ్మెల్యే సీటును కూడా కచ్చితంగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఒక రాజకీయ పార్టీ అంటే ఎలా సేవ చేయాలి, ప్రజల కోసం ఎలా పనిచేయాలో తాము చేసి చూపిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీల సాధన కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



## ఎమ్మెల్యే చొరవతో మాదారంలో ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు

**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం మాదారం గ్రామపంచాయతీలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చొరవతో లోవోల్టేజ్ సమస్య పరిష్కారం అయింది. మాదారం గ్రామపంచాయతీలో లోవోల్టేజ్ సమస్యను సర్పంచ్ అజ్మీర ఉమానరేష్ ఇటీవల అభివృద్ధి పనులు ప్రారంభించటానికి వచ్చిన ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గ్రామపంచాయతి కి 4 ట్రాన్స్ఫార్మ్ మంజూరు చేయించారు. వాటిని ఆదివారం మాదారం గ్రామంలో డిఈ రమేష్ కుమార్ ,ఎడిఈ యాసీన్,ఏఈ వెంకన్నల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ట్రాన్స్ ఫార్మర్లు మంజూరు చేసి లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్యే, విద్యుత్ శాఖ అధికారులకు సర్పంచ్, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అజ్మీర నరేష్, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు బాగం నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మహిళ సంఘాలకు రైస్ మిల్లులు

- నేలకొండపల్లి లో లాంచనంగా ప్రారంభిస్తాం.
- ఇందిరమ్మ ఇళ్లు...మూడు, నాల్గోవ విడత కూడ ఇస్తాం.
- రాష్ట్ర రెవిన్యూ,గృహా నిర్మాణ, సమాచార శాఖ మంత్రి శ్రీనివాసరెడ్డి



**నేలకొండపల్లి, జూన్ 28 మహా:**రాష్ట్రంలోని మహిళలను కోటేశ్వరులను చేసే భాగంగా మహిళలకు రైస్ మిల్లులు కూడ అందించే ప్రక్రియ ను చేపడుతున్నట్లు రాష్ట్ర రెవిన్యూ, గృహా నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కోన్నారు. మండలం లోని అప్పలనరసింహాపురం, రాజారాంపేట, కోరట్లగూడెం గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంఖుస్థాపన చేశారు: ఈ సందర్భంగా జరిగిన సభలలో ఆయన మాట్లాడారు...రాష్ట్రంలోని మహిళలను కోటేశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. మహిళ సంఘాల వారికి రైస్ మిల్లుల ను అందించటం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధిస్తారన్నారు. సీఎం రేవంత్రెడ్డి ఆలోచన తోనే రాష్ట్రంలోనే నేలకొండపల్లి మహిళ సంఘం కు అందించి పథకం ను ప్రారంభించేందుకు కార్యచరణ ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు అందించినట్లు పేర్కోన్నారు. స్వయం సహాయక సంఘాల వారికి రూ.63 వేల కోట్ల రుణాలను అందించామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం దూసుకపోతుందని అన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజ తో పాటు తడిసిన గింజ ను కూడ కొనుగోలు చేయటంతో పాటు, వారంలోపే వారి ఖాతాలలో జమ చేసినట్లు తెలిపారు. రైతుల కు గతంలో ఎన్నాడూ లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు ను త్వరలోనే రెండో విడత, మూడు, నాలుగు విడతలుగా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి మంజూరు చేస్తామన్నారు. ఎల్నినో ప్రభావంతో రైతులు నీటి వినియోగం ను దృష్టిలో పెట్టుకుని వర్షాధార పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. అనంతరం రాజారాంపేట పంచాయతీ లో సర్పంచ్ రాయపూడి రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలను వేసి కార్యక్రమం ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఎమ్మేల్యేలు కోరం కనకయ్య, జారే ఆదినారాయణ; పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బచ్చలకూరి నాగరాజు, పాకనాటి కన్నా రెడ్డి, చెరుకుపల్లి రాజేష్, మేకల వెంకటేశ్వర్లు, జెర్రిపూతల సత్యనారాయణ కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బంగ్లా రాజకీయాల్లో షేక్ హసీనా సంచలన ప్రకటన

* ఈ ఏడాదే స్వదేశానికి తిరుగు ప్రయాణం!

ఢాకా:మహా.

బంగ్లాదేశ్ రాజకీయాల్లో పెను సంచలనం చోటుచేసుకుంది. దేశాన్ని వీడి సుదూర ప్రాంతాల్లో తలదాచుకుంటున్న మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా తన స్వదేశీ ప్రయాణంపై కీలక ప్రకటన చేశారు. రెండేళ్ల క్రితం ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాల ఉధృతిలో దేశం విడిచి వెళ్లాల్సి వచ్చినప్పటికీ, ఇప్పుడు తలెత్తిన గడ్డు పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటానని ఆమె స్పష్టం చేశారు. అవామీ లీగ్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ మీడియాతో ఆమె మాట్లాడుతూ, ఈ ఏడాది తాము ఏ పరిస్థితుల్లోనైనా బంగ్లాదేశ్‌లో అడుగుపెడతానని తేల్చిచెప్పారు.

అవామీ లీగ్ అనేది కేవలం ఒక సాధారణ రాజకీయ పార్టీ కాదని, అది దేశ గతిని మార్చగల ఒక మహా శక్తి అని ఆమె అభివర్ణించారు. దేశంలో మైనారిటీలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించిన హసీనా, ఇవి కేవలం ఒక వర్గంపై దాడులు కావని, దేశ స్వాతంత్ర్యంపై జరుగుతున్న కుట్రలని మండిపడ్డారు. తాను అధికారం కోసం ప్రాకులాడటం లేదని, ప్రజల రాజకీయ హక్కులను కాపాడటమే తన ప్రధాన లక్ష్యమని ఆమె ఉద్ఘాటించారు. తన స్వదేశీ ప్రయాణం కేవలం వ్యక్తిగత అజెండా కాదని, ప్రజల ఆశయాల సాధనలో భాగమని ఆమె పేర్కొన్నారు.

తనకు కోర్టు విధించిన మరణశిక్ష పట్ల షేక్ హసీనా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆ తీర్పు పూర్తిగా రాజకీయ దురుద్దేశాలతో కూడుకున్నదని, రాజ్యాంగ విరుద్ధమని ఆమె కొట్టిపారేశారు. రాజకీయ ప్రతీకారాలను తీర్చుకోవడానికి న్యాయవ్యవస్థను అస్త్రంగా వాడుకుంటున్నారని ఆరోపించారు. తన జీవితంలో ఎన్నోసార్లు మరణం అంచు వరకు వెళ్లి తిరిగొచ్చానని, కుటుంబాన్ని మొత్తం కోల్పోయిన కఠిన పరిస్థితులను కూడా ఎదుర్కొన్నానని గుర్తు చేస్తూ.. మరణం అంటే తనకు భయం లేదని ధీమా వ్యక్తం చేశారు.

బంగ్లాదేశ్ మట్టిలోనే అవామీ లీగ్ పురుడు పోసుకుందని, ఈ దేశ ప్రజల గుండెల్లో తమ పార్టీకి చెరగని స్థానం ఉందని ఆమె వ్యాఖ్యానించారు. దేశవ్యతిరేక శక్తులు కుట్రలు పన్ని తమను అధికారానికి దూరం చేసినా, ప్రజల మద్దతు తమ వెంటే ఉందని హసీనా నమ్మకం వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో పార్టీ శ్రేణులు ఏమాత్రం అధైర్యపడకుండా ఐకమత్యంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు.

మరోవైపు, ప్రభుత్వం విధించిన కఠిన ఆంక్షలను సైతం లెక్కచేయకుండా జూన్ 23న అవామీ లీగ్ కార్యకర్తలు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఆందోళనల నేపథ్యంలో బంగ్లాదేశ్ పోలీసులు పలువురు కార్యకర్తలను, అభిమానులను అరెస్టు చేసినప్పటికీ, పార్టీ శ్రేణుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. దేశంలో అస్థిర పరిస్థితుల మధ్య షేక్ హసీనా చేసిన ఈ ప్రకటన ఇప్పుడు బంగ్లాదేశ్ రాజకీయాల్లో ఎలాంటి మలుపులకు దారితీస్తుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## పాక్ ఆరోపణలను తిప్పికొట్టిన భారత్

**ఢిల్లీ, మహా :** కరాచీలోని మిలిటరీ స్థావరంపై జరిగిన ఉగ్రదాడి ఘటనలో భారత్‌పై పాకిస్థాన్ చేసిన నిరాధారమైన ఆరోపణలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. ఇతరులను వేలెత్తి చూపడం మానేసి, ముందుగా పాకిస్థాన్ తన దేశంలోనే పాతుకుపోయిన ఉగ్రవాద మూకలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఘాటుగా హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని ఒక విదేశాంగ విధానంగా వాడుకోవడం మానుకోవాలని ఆయన పాక్‌కు హితవు పలికారు.

**దాడి ఘటన నేపథ్యం**

శనివారం కరాచీలోని సింధ్ రేంజర్స్ మిలిటరీ కాంపౌండ్‌లోకి సాయుధులు వాహనంతో గేటు బద్దలు కొట్టుకుని లోపలకు దూసుకెళ్లారు. గ్రెనేడ్లు, తుపాకులతో విరుచుకుపడిన ఈ ముష్కరుల దాడిలో నలుగురు పాక్ పారా మిలిటరీ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 90 నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో స్పెషల్ సెక్యూరిటీ యూనిట్ కమాండోలు ఆరుగురు మిలిటెంట్లను అంతమొందించగా, మరొకరిని బంధించారు.



## పోలియో రహిత సమాజం కోసం కృషి చేయాలి

**బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్**

**బెల్లంపల్లి ,మహా:** పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పిలుపునిచ్చారు. ఆదివారం రోజు బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా తో పాటు బూడిదిగడ్డ బస్తీల లో ఏర్పాటుచేసిన పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు ,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలను వేయించి కుటుంబాల్లో ఆనందాన్ని నింపుకోవాలని నిర్లక్ష్యం చేస్తే కుటుంబం చిన్నాభిన్నమై తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని ఆయన పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం ఏర్పాటు చేస్తున్న పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రజలందరూ స్వాగతించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్ దావస్వాతి రమేష్‌బాబు పాల్గొన్నారు.

# కొత్త సీఎస్ సంజయ్ జాజుకు మెగాస్టార్ అభినందనలు

( మొదటి పేజీ తరువాయి )

ప్రాధాన్యత సంతరించుకుంది.

**సాన్నిహిత్యం.. పాత జ్ఞాపకాల నెమరువేత***

ఈ అభినందనల సందర్భంగా నూతన సీఎస్ సంజయ్ జాజుతో తనకున్న సుదీర్ఘ వ్యక్తిగత సాన్నిహిత్యాన్ని చిరంజీవి గుర్తుచేసుకున్నారు. గతంలో ఆయనతో కలిసి పనిచేసిన, కలిసినప్పటి పాత జ్ఞాపకాలను ఈ సందర్భంగా మెగాస్టార్ నెమరువేసుకున్నారు. వారిద్దరి మధ్య ఉన్న ఆత్మీయ బంధం ఎంత బలమైనదో తన పోస్ట్ ద్వారా స్పష్టం చేశారు.

**నిజాయితీ, దార్శనికత కలిగిన నాయకుడు**

సంజయ్ జాజు పనితీరుపై చిరంజీవి ప్రశంసల వర్షం కురిపించారు. ఆయనొక నిజాయితీ, స్పష్టమైన దార్శనికత కలిగిన నాయకుడని కితాబిచ్చారు. అపారమైన పరిపాలనా అనుభవం ఉన్న అధికారికి ఇలాంటి అత్యున్నత బాధ్యతలు దక్కడం ఎంతో సంతోషకరమని, ఈ పదవికి ఆయన అత్యంత యోగ్యుడని చిరంజీవి కొనియాడారు.

**తెలంగాణ ప్రగతికి ఆ అనుభవం వరం**

సుదీర్ఘ కాలంగా వివిధ హోదాల్లో పనిచేసిన సంజయ్ జాజు పరిపాలనా అనుభవం తెలంగాణ రాష్ట్ర ప్రగతికి ఎంతగానో ఉపయోగపడుతుందని చిరంజీవి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన సమర్థవంతమైన నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకుంటుందని తాను గట్టిగా నమ్ముతున్నట్లు చిరంజీవి తన సందేశంలో పేర్కొన్నారు.

**స్నేహితుడే కాదు.. నాకు సోదరుడు**

సంజయ్ జాజుతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ చిరంజీవి అత్యంత భావోద్వేగానికి గురయ్యారు. సంజయ్ జాజు తనకు కేవలం ఒక మంచి స్నేహితుడు మాత్రమే కాదని, అంతకంటే ఎక్కువగా ఒక సొంత సోదరుడితో సమానం అని చిరంజీవి ఆత్మీయంగా పేర్కొన్నారు.

**పూర్తి మద్దతు..**
**వెల్లువెత్తుతున్న అభినందనలు**

అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ నూతన బాధ్యతల్లో సంజయ్ జాజు ఘన విజయం సాధించాలని చిరంజీవి ఆకాంక్షించారు. తన మద్దతు, శుభాకాంక్షలు ఆయనకు ఎల్లప్పుడూ ఉంటాయని ముగించారు. మరోవైపు, తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు నియమితులైన నేపథ్యంలో కేవలం సినీ రంగం నుంచే కాకుండా రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు సైతం ఆయనకు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు భారీగా జన సమీకరణ చేయాలి

**తల్లాడ మండల కాంగ్రెస్ నేతలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపు..**

**తల్లాడ జూన్, 28, (మహా ):** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డితో పాటు సీనియర్ నాయకులు, మంత్రి ప్రధాన అనుచరులు కలిశారు. ఆదివారం ఖమ్మం వచ్చిన సందర్భంగా ఆయనను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన తల్లాడ మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డిని ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనలు విజయవంతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, తుమ్మలపల్లి రమేష్, ఎర్రి నరసింహారావు, సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, పగడాల లచ్చిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మహా పత్రిక
తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 29-06-2026



# సేవలు నిలిపి వేయబడ్డాయి

ఎన్నిసార్లు ఫోన్ చేసినా
అటు నుంచి వచ్చేది అవుటాఫ్ సర్వీస్ అనే
సేవా ఉపలబ్ద్ నహీ హై అనే
సమయానికి
రాలేదని ఎన్ని సార్లు
అరిచినా
మౌనంగా కదిలే ఓడ లా పని చేసుకుంటూ
వెళ్ళేది
గంపెడు
గిన్నెలు వేసినా కసురు కోకుండా
కడిగేది
ఇష్టంగా దోశలు తిని
నూనె జిడ్డు పెనంను వేసినా
నసగక
శుభ్రంగా తొమి పెట్టేది

ఇల్లంతా
ఊడ్చి పేరుకున్న దుమ్మును
చాటకెత్తితే
కింద రాలిన పేపర్ ముక్కలను
చూస్తుమి
తడి గుడ్డతో
పాలరాతి బుగ్గలను
నిగ నిగ లాడేలా చేసినా
కాసింత నగుమోమును
కనిపించకుండా
ముఖాన్నీ పొట్లం చేస్తిమి
చేజారిన పింగాణీ కప్పును
చూసీ చిర్రెత్తి పోతిమి
వణుకుతున్న ఆమె గుండెలయను
వినక పోతిమి
లోపల విరిగి పడుతున్న
మంచు కొండలను గమనించమాయె
గాజు గ్లాస్ బుగ్గలను
తళతళ మెరిసేటట్లు చేసినా
పెదవులపై నెలవంక నైనా
పూయించమాయే!
గాజు పెంకులను లెక్క పెడితిమి
పిల్లల పాత బట్టలనూ
ప్రేమగా కానుకలా నైనా ఇవ్వక పోతిమి
పండగ పూట పంచభక్ష్యాలను
తింటున్నా
కాసిన్ని ఇవ్వలేని వాళ్ళము
ఇనాం అడిగినా కొసిరీ కొసిరి
కట్ చేసి ఇస్తిమి కదా!

పూలు పూయని తోటలో
సీతాకోక చిలుకలు తిరగవు
ఈ పూట

ఎన్ని తలుపులు తెరిచి ఉంచినా గాలిరాదు _
_ కోరుకున్నప్పుడు

డా.సుంకర రమేశ్
9492180764

## అమాయకపు విత్తనం

రాయి తన కఠినత్వాన్నే చూపుతుంది,
విత్తనం చీకటినే నమ్ముతుంది.
తాళం తన బలాన్ని గొప్పగా చెప్పుకుంటుంది,
తలుపు మాత్రం గాలికి తెరుచుకుంటుంది.
నది పటాన్ని చదవదు,
వంపులనే అనుసరించి సముద్రమవుతుంది.
సీతాకోకచిలుకకు
తన రెక్కల రంగు తెలియదు;
అందుకే పూలు దానిని గుర్తిస్తాయి.
ఆకాశం ఎప్పుడూ గెలవదు,
ప్రతి సాయంత్రం నేల ఒడిలో ఓడిపోతుంది.
చివరికి
పసిపాప నవ్వులా మిగిలిందే జీవితం
నిర్మలత్వమే కాలాన్ని దాటే ఏకైక జ్ఞానం.

డాక్టర్ పెరుగు రామకృష్ణ
9849230443

## సీవీ కృష్ణారావు గారి శతజయంతి సభ

నెల నెలా వెన్నెల పేరుతో కవులందరినీ చేరదీసిన కవిత్వ పిపాసి సీవీ కృష్ణారావు గారి శతజయంతి సభ జులై 4 వ తేదీ మధ్యాహ్నం 1:30 నిమిషాల కు రవీంద్ర భారతి మినీ హాల్ లో జరుగుతుంది. కృష్ణారావు గారి కుమార్తె పార్వతి మోహన్ జ్యోతి ప్రజ్వలన చేస్తారు. ముఖ్య వక్త వాడ్రేవు చిన వీర భద్రుడు. నాళేశ్వరం శంకరం, ఏనుగు నరసింహా రెడ్డి ఆత్మీయ ప్రసంగం చేస్తారు. కృష్ణారావు గారితో ఉన్న అనుబంధాన్ని క్లుప్తంగా పంచుకోవలసిందిగా అందరినీ ఆహ్వానిస్తున్నాం.

శేషభట్టర్ రఘు

2025 కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు వచ్చిన కవి


# ఈ ప్రపంచమొక కాక్టస్ బేతాబ్ కవిత్వమొక గులాబ్

"కాలం అనే ఎండ మనుషుల ముఖాల మీదున్న ముసుగులను మార్చేసింది,
మనం ఎవరినైతే పువ్వులని అనుకున్నామో, వారు ముళ్ల కంటే ఘోరంగా మారారు."
"బేతాబ్! చేతులు కలపడానికి ఊరంతా ముందుకు వచ్చింది,
కానీ హృదయాలను కలపమనే సరికి అందరూ వెనక్కి తగ్గారు."
"వసంతం వస్తుందనే ఆశతో మనం శరదృతువుతో పోరాడుతూనే ఉన్నాం,
కానీ మన సొంత నీడను చూసి మనమెందుకు భయపడుతున్నామో తెలియదు"

ఇలాంటి షేర్లు లేదా ద్విపదలు చదివినప్పుడు ఈ ద్విపదల సృష్టి కర్త ఎవరా అన్న ఆసక్తి కలగడం సహజం. ఆ సహజమైన ఆసక్తి తోనే ఈ కవి ఎవరు? అని లోలోపలికి వెళితే నాకొక గొప్ప మానవతావాది అయిన ప్రీతిపాల్ సింగ్ బేతాబ్ కనిపించారు. ఆయన మంచి కవే కాదు అంతకు మించిన మంచి పరిపాలనాదక్షుడు.లోకం లో మనవవతా దీపం కొండెక్కిపోకుండా తన కవిత్వచేతులను అడ్డుపెడుతున్నవాడు.

2025 వ సంవత్సరానికి ఉర్దూ భాష నుండి కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం పొందిన ప్రీతిపాల్ సింగ్ బేతాబ్ పంజాబ్ లోని పూంఛ్ ప్రాంతానికి చెందిన ప్రముఖ కవి. మాజీ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి. మాతృభాష పంజాబీ అయినా ఉర్దూ కవిత్వం లోనారసి చదువుకుని ఉర్దూలో కవిగా పేరుతెచ్చుకున్నారు
"నా గొంతులో పంజాబీ తీపి ఉన్నా,
నా కలం ఉర్దూ శైలిని ఎంచుకుంది.
ఎందుకంటే, ప్రేమని పంచడానికి
భాష కేవలం ఒక మాధ్యమం మాత్రమే.
మనుషులంతా ఒక్కటే అయినప్పుడు,
ఈ లిపుల మధ్య గోడలు ఎందుకు?"

అనే ప్రీతిపాల్ సింగ్ బేతాబ్ 1949 జులై 26 న సరిహద్దు జిల్లా పూంఛ్ దగ్గర 'ఖర్హి శర్మసాల్' గ్రామంలో జన్మించారు.ప్రీతిపాల్ సింగ్ ఆయన పేరు. బేతాబ్ అయన కవిత్వం రాయడం కోసం పెట్టుకున్న పేరు. జమ్మూలోని ప్రభుత్వ గాంధీ మెమోరియల్ సైన్స్ కాలేజీ నుండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన బేతాబ్, జమ్మూ విశ్వవిద్యాలయం నుండి పొలిటికల్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ ఎల్ఎల్‌బి పట్టా పొందారు. ఆ తర్వాత 1977లో కె.ఎ.ఎస్. (K.A.S.) అధికారిగా జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వంలో దిగువ స్థాయి కార్యదర్శిగా చేరారు. ఆధునిక ఉర్దూ కవిత్వానికి ప్రతినిధిగా నిలిచిన బేతాబ్, 1980లో "పేష్‌ఖైమా" పేరుతో తన మొదటి గజల్స్ , నజ్మ్‌ల సంకలనాన్ని ప్రచురించారు. ఈ పుస్తకానికి 198182 సంవత్సరానికి గాను జమ్మూ కాశ్మీర్ కల్చరల్ అకాడమీ నుండి "ఉత్తమ పుస్తక పురస్కారం" లభించింది. బేతాబ్ తన రెండవ కవితా సంకలనం "సరాబ్‌దర్‌సరాబ్" ను 1984లో మూడవ సంకలనం "ఖుద్ రంగ్"ను 1995లో ప్రచురించారు. బేతాబ్ రాసిన ఉర్దూ నజ్మ్‌ల ఆంగ్ల అనువాదం ది థర్డ్ స్ట్రాండ్, ను 1999లో కోల్‌కతాకు చెందిన "రైటర్స్ వర్క్‌షాప్" ప్రచురించింది.ఎంత కవిత్వం రాసినా బేతాబ్ పేరు చెప్పగానే కవిత్వ ప్రియాయులకు గుర్తుకు వచ్చేది మాత్రం కాక్టస్ఔర్‌గులాబ్. ఆయన కవిత్వంలో ఒకవైపు కఠినమైన సామాజిక పరిస్థితులు (కాక్టస్), మరోవైపు మానవతా విలువలు, ప్రేమ (గులాబ్) పక్కపక్కనే కనిపిస్తాయి
"తుపాకీ గుళ్లకు భాష తెలియదు,
అవి మనుషులను మాత్రమే గుర్తిస్తాయి.
కానీ కవిత్వానికి సరిహద్దులు లేవు,
అది హృదయాలను కలుపుతుంది.
ఈ వైరాగ్యపు సరిహద్దుల మధ్య,
శాంతి అనే పక్షి ఎప్పుడు స్వేచ్ఛగా ఎగురుతుందో కదా!"
అని సరిహద్దు ఉద్రిక్తల మధ్య తన కవిత్వానికి తాత్విక భూమికలు ఏర్పరచుకున్న బేతాబ్ సాంప్రదాయ ఉర్దూ గజల్స్ వుండే ప్రేమ, విరహాల స్థానం లో సమాజంలోని రాజకీయ, ఆర్థిక ఆందోళనలను తీసుకుని వచ్చారు.
బేతాబ్ గజల్స్ మనిషి అంతరంగంలో సాగుతున్న తీవ్రమైన సంఘర్షణను, అస్తిత్వ వేదనను అత్యంత లోతుగా, తాత్వికంగా ఆవిష్కరిస్తాయి . సూఫీ తత్వపు ఛాయ, పైపై మెరుగుల వెనుక దాగున్న అసలైన సత్యాన్ని వెలికితీసే ప్రయత్నం చేస్తాయి .
నిజాయితీ (ఈమాన్) గురించి అడిగితే, నాలోని బేఈమానీ (అపనమ్మకం/కపటం) పోవడం లేదు,
నేను కాఫిర్‌గా (నాస్తికుడిగా) మారినా, నాలోని ముసల్మానీ (ఆ సంస్కారం/భక్తి) దూరం కావడం లేదు
ఈ షేర్‌లో బేతాబ్ తన నమ్మకానికి, అవిశ్వాసానికి మధ్య నలిగిపోతున్న మానసిక స్థితిని అద్భుతంగా చిత్రించారు. సమాజం అడిగినప్పుడు నిజాయితీని, ఈమాన్‌ను ప్రదర్శించాలనుకున్నా, లోపల ఎక్కడో ఒక తెలియని కపటం లేదా అపనమ్మకం పీడిస్తూనే ఉంది. సరే, విసిగిపోయి దేవుడిని నమ్మని నాస్తికుడిగా (కాఫిర్‌గా) మారిపోదామా అంటే... తరతరాలుగా జీర్ణించుకుపోయిన ఆ




ముసల్మానీ సంస్కారం, ఆ దైవభక్తి లోపలి నుండి దూరం కావడం లేదు. ఇది ఒక సంక్లిష్టమైన మానసిక స్థితి—ఇటు పూర్తిగా భక్తుడిగా కాలేక, అటు పూర్తిగా నాస్తికుడిగా మిగలలేక రెండింటికీ మధ్య ఊగిసలాడే ఒక సగటు మనిషి అంతర్మథనానికి ఇది ప్రతీక.నిజానికి ప్రతి మనిషిలోనూ ఒక రాముడు ఒక రాక్షసుడు ఉంటాడు. రాక్షసుడు తల ఎత్తకుండా రాముడు అడ్డుపడుతూ ఉంటాడు.జేకిల్ అండ్ హైడ్ అన్నా, ఇగో సూపర్ ఈగో అన్నా శీర్షికలు వేరు వేరుకానీ లోపల వున్న వేదనంతా ఒకటే. ఆ ఘర్షణ. ఆ ఘర్షణ వెనుక తత్వ చింతనా బేతాబ్ ద్విపదల సారాంశం
పైకి చూడటానికి ఎలాంటి దుఃఖమూ లేదు, ఏ కష్టమూ లేదు,
అసలైన సమస్యేమిటంటే... కారణం లేని ఈ ఆందోళన అస్సలు వదలడం లేదు
పైకి చూస్తే జీవితంలో ఎలాంటి లోటూ లేదు, ఏ దుఃఖమూ లేదు, అనుభవించడానికి అన్ని సుఖాలూ ఉన్నాయి. కానీ, అంతా బాగుంది అనుకుంటున్న సమయంలోనే లోపల ఒక అకారణమైన ఆందోళన, ఒక తెలియని వెలితి వెంటాడుతూనే ఉంది. కంటికి కనిపించే కష్టానికైతే కారణం వెతికి పరిష్కరించుకోవచ్చు, కానీ ఏ కారణమూ లేని ఈ నిరంతర ఆందోళన అస్సలు వదలడం లేదు అనడంలోనే మనిషి అనుభవించే ఒంటరితనం, మానసిక అలజడి వ్యక్తమవుతున్నాయి. ఇది భౌతిక సుఖాలు ఇవ్వలేని ఆత్మసంతృప్తి గురించిన తాత్విక ప్రశ్న.
బయటి ప్రపంచంలో ఉన్న ప్రతి అణువు గురించి నాకు అన్నీ తెలుసు,
కానీ నా లోపల ఏముందో... దాన్నే నేను తెలుసుకోలేక పోతున్నాను
బాహ్య ప్రపంచంలో ఉన్న ప్రతి అణువు గురించి, ప్రకృతి రహస్యాల గురించి, ప్రాపంచిక విషయాల గురించి మనిషికి అన్నీ తెలుసు. తను సర్వజ్ఞుడినని విర్రవీగుతాడు. కానీ, అసలైన విచిత్రమేమిటంటే... తన లోపల ఏముందో, తన అసలు నైజం ఏమిటో తెలుసుకోలేక అజ్ఞానంలో ఉండిపోతాడు లోకాన్ని గెలిచినా తనని తాను గెలవలేని, లోకాన్ని చదివినా తనని తాను చదువుకోలేని మనిషి అసమర్థతను ఈ ద్విపద లో బేతాబ్ కరతలామలకం చేస్తున్నాడు
ఫకీరీ నా నైజం, నా వస్త్రధారణ కూడా ఫకీరు లాంటిదే,
కానీ ఇది అల్లాహ్ మహిమ కాబోలు... నాలోని ఆ రాజసం మాత్రం పోవడం లేదు.
ఈ ద్విపద లో ఒక విరాగి హృదయం కనిపిస్తుంది. ఫకీరి నైజం, అంటే లోకంలోని ఆడంబరాలకు దూరంగా, ఒక సన్యాసిలా బతకడమే తన స్వభావమని కవి అంటారు. వస్త్రధారణ కూడా అలాగే పేదరికంగా, సామాన్యంగానే ఉంది. కానీ, అది అల్లాహ్ మహిమ అనుకోవాలో లేక అహకారం అనుకోవాలో తెలియదు గానీ—తన లోపల ఉన్న ఆ 'రాజసం',అహంకారం, గర్వం మాత్రం పోవడం లేదు. పైకి ఎంత వినయాన్ని ప్రదర్శించినా, అంతరంగంలో రాజులా బతకాలనే కోరిక లేదా ఒక ఉన్నతమైన అహం ఇంకా సజీవంగానే ఉందనే నిజాన్ని ఇక్కడ కవి నిష్కపటంగా ఒప్పుకున్నారు.
ఈ ద్విపద ఆధునిక నగర జీవితంలోని శూన్యతను ఎలా ఆవిష్కరిస్తున్నదో చూడండి
నేను నిస్సందేహంగా ఈ కిక్కిరిసిన నగరంలో వచ్చి స్థిరపడ్డాను,
కానీ నా హృదయంలోని ఆ నిర్జనారణ్యం మాత్రం పోవడం లేదు.
. మనుషులతో, వాహనాలతో కిక్కిరిసిపోయిన ఒక పెద్ద నగరంలోకి వచ్చి కవి స్థిరపడ్డారు. చుట్టూ వేల మంది జనం ఉన్నా, తన హృదయంలోని ఆ 'నిర్జనారణ్యం' (ఎడారి లాంటి ఒంటరితనం) మాత్రం పోవడం లేదు. సమాజంలో బతుకుతున్నా, అంతరంగంలో ఒంటరిగా మిగిలిపోయే ఆధునిక మానవుడి 'అస్తిత్వ వేదన'కు ఈ షేర్ ఒక అద్దం పడుతుంది.నిజానికి వ్యక్తుల వయక్తిక మానసిక ఒంటరితనం ఇప్పుడు ప్రపంచాన్ని వేధిస్తున్న అసలైన సమస్య
మనమంతా మంచి బ్రాండెడ్ వస్తువులు ధరించి, అందంగా అలంకరించుకుని తిరుగుతూ ఉంటాము. కానీ నిజంగా మనందరం ఆత్మలో అంత అందంగా వున్నామా? లోలోపలికి తరచి చూసుకుంటే కానీ మన అందమైన బట్టలమీద తళ తళ మెరిసిపోయే రాక్షసత్వం కానరాదు. ఆ విషయాన్నే బేతాబ్ విశదపరుస్తున్నాడు ఈ ద్విపదలో
నాకు బట్టల కొరత ఏమీ లేదు, తల నుండి కాళ్ళ వరకు పూర్తిగా కప్పుకునే ఉంటాను,
కానీ శరీరం ఎలాంటి వస్తువంటే... నాలోని ఆ దిగంబరత్వం అస్సలు పోవడం లేదు.
తల నుండి కాళ్ళ వరకు బట్టలతో పూర్తిగా కప్పుకుని, సమాజం మెచ్చేలా నాగరికంగానే తిరుగుతున్నారు. బట్టల కొరత ఏమీ లేదు. కానీ, ఈ శరీరం ఎలాంటి విచిత్రమైన వస్తువంటే... బాహ్యంగా ఎన్ని వస్త్రాలు కప్పినా, లోపల ఉన్న ఆ దిగంబరత్వం (వాసనలు, కోరికలు, నగ్న సత్యాలు) అస్సలు మాయం కావడం లేదు. మనిషి తన నైజాన్ని బాహ్య ఆడంబరాలతో కప్పిపుచ్చలేడనే సత్యాన్ని ఇది చెప్తుంది.
అద్దం ఎప్పుడూ అబద్దం చెప్పదు అంటారు. అలా అని నిజం కూడా చెప్పదు అంటున్నాడు బేతాబ్. అద్దం నిజంగా నిజం చెపితే అద్దం లో మనలని చూసుకుని మనమే ఒక్కొక్కసారి ఎందుకు వేదన పడతాము?
అద్దంలో కనిపిస్తున్నది నా ప్రతిబింబమే అని నాకు ఖచ్చితంగా తెలుసు,
అయినప్పటికీ, నా కళ్ళలోని ఆ ఆశ్చర్యం మాత్రం పోవడం లేదు
అద్దంలో కనిపిస్తున్నది తన ప్రతిబింబమే అని కవికి ఖచ్చితంగా తెలుసు. భౌతికంగా అది తానే అని బుద్ధి చెప్తున్నా, ఆ అద్దాన్ని చూస్తున్న తన కళ్ళలోని ఆశ్చర్యం (విస్మయం) మాత్రం పోవడం లేదు. 'నేను' అని పిలుచుకుంటున్న ఈ శరీరం నిజంగా నాదేనా, లేక దీని వెనుక మరేదైనా శక్తి ఉందా అనే ఒక ఆధ్యాత్మిక ఆశ్చర్యం ఆ కళ్ళల్లో కనిపిస్తోంది.
అప్పుడెప్పుడో చూసిన పిక్చర్ ఆఫ్ ది డోరియన్ గ్రే గుర్తుకు వస్తున్నది ఈ ద్విపద చదివితే . ఏమంటున్నాడు బేతాబ్
నిన్నటి వరకు ఈ లోకంలో నాకుంటూ ఒక గుర్తింపు ఉండేది ఓ 'బేతాబ్'
కానీ ఇప్పుడు అద్దంలో చూసుకుంటే నా సొంత ముఖమే గుర్తుపట్టలేనంతగా మారిపోయిం



**ప్రీతిపాల్ సింగ్ బేతాబ్**


ప్రీతిపాల్ సింగ్ తన మకుటం 'బేతాబ్' (అశాంతి/ఆరాటం ఉన్నవాడు) ని వాడుతూ నిన్నటి వరకు ఈ లోకంలో తనకంటూ ఒక గుర్తింపు, ఒక ప్రత్యేక స్థానం ఉండేవి. కానీ, కాలప్రవాహంలో, ఈ నిరంతర అంతర్మథనంలో ఇప్పుడు అద్దంలో చూసుకుంటే తన సొంత ముఖమే గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. ఇన్నాళ్లూ తను అనుకున్న 'నేను' కరిగిపోయి, ఒక కొత్త శూన్యమో లేదా ఒక కొత్త సత్యమో అక్కడ కనిపిస్తోంది. తన ఉనికిని తానే కోల్పోయిన ఒక విలక్షణమైన వేదన ఈ ద్విపద లోనే కాదు బేతాబ్ కవిత్వం అంతా కనిపిస్తుంది.
ప్రీతిపాల్ సింగ్ 'బేతాబ్' కవిత్వం కేవలం పదాల కూర్పు కాదు, అది గాయపడిన ఆధునిక మానవుడి ఆత్మ ఘోష. శతాబ్దాలుగా వస్తున్న సాంప్రదాయ ఉర్దూ గజల్స్ కేవలం ప్రేమికుల విరహ వేదనలకే పరిమితమవగా, బేతాబ్ ఆ చట్రాన్ని బద్దలు కొట్టి, అందులోకి సామాజిక ఆందోళనలను, అస్తిత్వ సంక్షోభాన్ని తీసుకువచ్చారు. 'ది పిక్చర్ ఆఫ్ డోరియన్ గ్రే' నవలలో అంతరంగంలోని వికృత రూపం చిత్రంలో కనిపిస్తే, బేతాబ్ షేర్లలో మాత్రం కాలప్రవాహంలో మనిషి తన పవిత్రతను, సొంత ఉనికిని కోల్పోతున్న వేదన అద్దంలో కనిపిస్తుంది. ఆయన కవిత్వంలో సూఫీ తత్వానికి సంబంధించిన ఒక అంతర్లీన ప్రశాంతత ఉన్నప్పటికీ, సమాజంలోని ద్వంద్వ ప్రవృత్తిపై తిరుగుబాటు కూడా అంతే బలంగా వినిపిస్తుంది. భౌతిక జగత్తులో అన్ని సుఖాలు ఉండి కూడా మనిషి ఎందుకు ఒంటరిగా మిగిలిపోతున్నాడో?, చుట్టూ వేల మంది ఉన్నా హృదయం ఎందుకు నిర్జనారణ్యంలా మారుతుందో? తెలుసుకోవడానికి ఆయన చేసిన ప్రయత్నం ఆయన కవిత్వం గా రూపుదిద్దుకుంది.
సరిహద్దుల మధ్య తుపాకీ గుళ్లు సృష్టిస్తున్న విధ్వంసాన్ని చూసి చలించిపోయిన ఈ కవి, కవిత్వమే హృదయాలను కలిపే నిజమైన వారధి అని నమ్మారు. మాతృభాష పంజాబీ అయినా, ఉర్దూ లిపిని ఆశ్రయించి మానవత్వాన్ని చాటిన బేతాబ్, నిఖార్సైన అంతర్మథనానికి ప్రతిరూపం. అందుకే కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం ఆయన కవిత్వానికి దక్కిన గౌరవం మాత్రమే కాదు, ఆధునిక సమాజంలో కొండెక్కిపోతున్న మానవతా దీపాన్ని కాపాడుతున్న ఆయన అక్షర తపస్సుకు లభించిన నిజమైన నీరాజనం. లోపలి రాక్షసత్వాన్ని గెలిచి, ప్రతి మనిషిలోని దైవత్వాన్ని మేల్కొలిపే శక్తి బేతాబ్ రాసిన ప్రతి ద్విపదలోనూ సజీవంగా ప్రవహిస్తూనే ఉంటుంది.



- వంశీకృష్ణ
95734 27422

# "ఇహలోక రాజ్యం" లోనేమానవ ఘనత

అలెహోకార్పెంటియా (190480) క్యూబన్ నవలాకారుడు ,వ్యాస, నాటక, ఒపెరా, లిబ్రెట్రె సృష్టికర్తగా, సంగీత శాస్త్రజ్ఞుడుగా విఖ్యాతి చెందాడు. తాను ఒక ఫ్రెంచ్ వాస్తుశిల్పి జూలియన్ జార్జ్ కార్పెంటియా కి , రష్యన్ భాషఉపాధ్యాయురాలు లేనా వెల్మోంట్ కు స్విట్జర్లాండ్ లోనీ లోజాన్ లో జన్మించాడు. తర్వాత కుటుంబంతో అంతా తరలిపోయిన క్యూబా రాజధాని హవానాలో పెరిగాడు.ఫ్రాన్స్, దక్షిణ అమెరికా, హైతీ, వెనిజులా,మెక్సికోల్లో విస్తృతంగా పర్యటించాడు. క్యూబన్ సంగీతం,ఆఫ్రోక్యూబనిజంపైవిస్తృత అధ్యయనం చేశాడు. నియంత మొరాలెస్ పై వ్యతిరేకత వల్ల 1927లో జైలు పాలయ్యాడు.1959 లో జరిగిన క్యూబా విప్లవానికి, ఫిడెల్ కాస్ట్రోకుమద్దతు ఇచ్చాడు. 1966లోక్యూబా రాయబారిగా ఫ్రాన్స్ లో ఉన్నాడు కార్పెంటియా పారిస్ లో ఉన్నపుడు సర్రియలిజం ప్రభావంలో పడ్డాడు. కార్పెంటియా రచనల్లో మ్యూజిక్ ఇన్ క్యూబా,దికింగ్డమ్ ఆఫ్ దిస్ వర్ల్డ్, దిలాస్ట్ స్టెప్స్, ఎక్స్ప్లోజన్ ఇన్ దిక్యాతెడల్, రీజన్స్ ఆఫ్ దిస్టేట్, దిహార్ప్ అండ్ ది షాడోముఖ్యమైనవి. ఆయన రచనాశైలి ప్రభావం గాబ్రియేల్ గార్సియా మార్క్వెజ్, మారియో వర్గాస్ లోసా, కార్లోస్ ఫ్యూంటెస్, ఇసాబెల్ అల్లెండ్ తదితరులపైకూడా ఉంది. కార్పెంటియా తన రచనల్లో 'బరోక్' (క్లిష్టమైన భాష, సంస్కృతుల సమ్మేళనం,నాటకీయ, అలంకారిక ) శైలి ఉపయోగించాడు. స్థానిక యాసలను కవితాత్మకంగా, ఐరోపా,ఆఫ్రికా, క్యూబా సంగీత మిశ్రమాన్ని ఉపయోగించాడు. అతని రచనలో "రియల్ మార్వలిసో" తర్వాత మ్యాజిక్ రియలిజం ధోరణికి దారివేసింది. గెరార్డ్ మార్టిన్ రాసినట్లు తాను నల్లజాతి అనుభవాన్ని క్యూబా జాతీయవాద వ్యక్తీకరణలో భాగంగా చేయ యత్నించాడు. హైతీ కరేబియన్ సముదంరలో నేడు దాదాపు కోటిమందిప్రజలు ఉన్న దేశం. దాని రాజధానీ పోర్ట్ ఓ ప్రిన్స్ . దానిపేరు పర్వత ప్రాంత భూమి అనేఅర్థం ఉన్న ఆదిమ ఆరాక్ పదమైన "అయితి" నుంచి వచ్చింది. దాని సంస్కృతి లోఆఫ్రికన్, స్థానిక టైనో తెగల తో పాటు ఫ్రెంచ్, స్పానిష్ మిశ్రమ ప్రభావం ఉంది. స్వాతంత్ర్యం ముందు సెయింట్ డొమినిగ్ పేరుతో ఫ్రెంచ్ వలస గా ఉంది. ఇక్కడ 1791 1804 ల మధ్య లూవెర్త్యూర్, డెస్సాలీన్ ల నేతృత్వంలో బానిసలుగా బాధ పడేహైతియన్లు, మిశ్రమ జాతులు కలిసి ఫ్రెంచ్ వలస వ్యతిరేక పోరాటం చేశారు. 1804 లో దేశం విముక్తి పొందింది. గత శతాబ్దిలో అమెరికా సైనిక జోక్యానికివ్యతిరేకంగా 191534ల మధ్య పెరాల్ట్, తర్వాత బాట్రావిల్ ల నాయకత్వంలో గెరిల్లా యుద్ధాలు జరిగాయి. అమెరికా కుట్రల వల్లనేతలు అమర వీరులై ప్రజల దేశభక్తిపెరిగింది. 1929 లో పెద్దఎత్తున విద్యా వ్యవస్థలో అమెరికా శైలికివ్యతిరేక పోరు సాగింది. అమెరికా దన్ను తో అధికారం చేపట్టిన ఫ్రాంకోయిస్ డువాలియర్ ప్రజలను క్రూరంగా అణచివేసాడు. ఎన్నికల లేమి, ముఠా హింస,ఆకలి కేకలు, మానవతా




సంక్షోభం తో హైతీ బాధ పడుతోంది.ఈ నాటికీఅమెరికా రాజకీయ, ఆర్థిక పెత్తనం పైప్రజలు పోరాడుతున్నారు విమర్శకుడు పాబ్లో మెడినా ఈ నవల "దికింగ్డమ్ ఆఫ్ దిస్ వర్ల్డ్" లో "చరిత్ర,గమ్యం,ప్రకృతిలో పాత్రల ఆలోచనలను తీర్చిదిద్దుతాయ"ని చెప్పారు.ఈ నవల ప్రధానంగా హైతీ, కొంత క్యూబా నేపథ్యం లో సాగింది.ఈ నవల ప్రారంభం లో బానిస టినోయెల్ తన యజమాని లెనోర్మాన్ డేమేజ్ తో కలిసిఒక మంగలి షాపుకు వెళ్తాడు. అక్కడిమైనపు తలలు, పక్కన కసాయి అంగడి లోని చర్మం వలచిన దూడల తలలసన్ని వేశాలు చూసిన బానిసలోని తిరుగుబాటు భావాల సంచలనం. టినోయెల్ తన తోటిబానిస, పశ్చిమ ఆఫ్రికాకు చెందిన మండింగో జాతీయుడు అయిన మకాండల్ చెప్పే కథలు, వలసలు, యుద్ధాలు,ఆఫ్రికా రాజుల వీరోచిత గాథలు తోప్రభావితం అవుతాడు. మకాండల్ ఒక ప్రమాదంలో తన చేయి కోల్పోగా యజమాని అతనిని పశువుల కాపరిగా పంపుతాడు.టినోయెల్ అతడ్ని రోజు కలుస్తూ ఎంతో నేర్చుకుంటాడు. యజమాని నుంచి పారిపోయిన మకాండల్ తన అనుచర గణాన్ని తయారు చేసుకొని విప్లవానికిసిద్ధమవుతాడు. విషము తయారుచేసిటినోయెల్ సాయంతో అంతటా వ్యాపింప చేస్తాడు. ఫలితంగా జంతువులు మనుషులు అందరూ మరణిస్తుంటారు. వెర్రెత్తిన ప్లాంటేషన్ యజమానులు బానిసలను చిత్రహింసలు పెడతారు. మకాండల్ ఒక బల్లి, శీతాకోకచిలుక ఊర కుక్క, కీటకం ఇలా బహురూపధారణతో చాలా కాలం తప్పించుకుంటాడు. చివరకు యజమానులు అతన్ని పట్టుకొని సజీవ దహనం చేస్తారు. లెనోర్మాన్ భార్య చనిపోగా విచారం లేకుండా పారిస్ లో విలాసాలు సాగిస్తూ ఒక నటి ఫ్లోరిడార్ ను తన ప్లాంటేషన్ కు తీసుకుని వస్తాడు. అతని కామ వాంఛలుకు, బానిసలను శిక్షించడానికి హద్దులు ఉండవు.
టినోయెల్ తన పిల్లలకు మకాండల్ కథలు, అతని కీర్తిపాటలు వినిపిస్తాడు .ఏదోనాటికిఅతను తిరిగివస్తాడనిఅనుకుంటూ ఉంటాడు. ఇదిలా ఉండగా బౌక్మాన్ నేతృత్వంలో బ్వా కేయిమాన్ అడవుల్లో అగ్గిరాజుకుంటుంది.అనామక బానిసలు పోరాటం సాగిస్తామని ప్రతిజ్ఞచేస్తారు. వారికిఒక వోల్టేర్ వాది, మరో ప్రీస్ట్ సాయం చేస్తారు.నల్లజాతి తిరుగుబాటులో యజమాని వర్గం లో వారు అంతం అవుతారు. టినోయెల్ మేడం ఫ్లోరిడార్ను బలాత్కరించడానికి పరిగెత్తుతాడు. యజమాని లెనోర్మాన్ నల్లబానిస తిరుగుబాటుదారుల నిర్మూలనకు గవర్నర్ సాయం కోరుతాడు. లెనోర్మాన్ తన సమయాన్ని పేకాట లో గడుపుతూ తన బానిసలని ఒకరొకర్ని అమ్మేసిజూదం, వ్యభిచారంలో మునుగుతాడు. నల్లజాతి తిరుగుబాటు నేత బౌక్మాన్ తెగిన తల ముందు నిలిచి తిట్టిపోసిఒక సతం కివెళ్తాడు.అతనితో మిగిలింది టినోయల్ ఒక్కడే.
ఇదిలా ఉండగా వంటవాడు హెన్రీ క్రిసిటోఫేతన వ్యాపారం మాని సైన్యంలో చేరిచివరకు నల్లజాతి రాజుగా మారతాడు. తిరుగుబాటు సమయంలో యజమాని వర్గం విలాసాలలో మునిగితేలుతుంది. కొందరు న్యూ ఓర్లీన్స్ ,క్యూబా లోప్లాంటేషన్ యజమానులుగా పోతారు. పారిస్ యువతి పాలిన్ క్యాప్ సిటీ, ప్లెయిన్ దు నార్డ్ వస్తుంది. తన వొళ్ళు పట్టే బానిస సోలిమాన్ ను కనికరించినట్టు తన కాళ్ళను ముద్దాడేలా చేయటం ఆమెకు సరదా. ఇంతలో మహమ్మారి. ఆమె భర్తలీక్లర్క్ మరణంతో ఆమెహేతువును మరిచి ఆఫ్రికన్ దేవతలను పూజిస్తూ, సోలిమాన్ తో కలిసిఆదిమ నృత్యాలు చేస్తుంది.
పాలిన్ నిష్క్రమణ తర్వాత ప్లాంటేషన్ యజమానులు స్వైర విహారం చేస్తారు. నల్లవారిపైకుక్కల్ని, మార్టినిక్ నుంచి తెచ్చిన పాముల్ని వదులుతారు. నల్లజాతీయులు వారిదేవత వోగన్ బదాగ్రీ సాయంతో హేతువు పైపోరాటం చేస్తారు. టినోయెల్ స్వేచ్ఛను సంపాదించి తిరుగుతూ మీలో పట్నం చేరినల్లజాతీయుల సామ్రాజ్యాన్ని చూస్తాడు. తాను రాజభవనం సాన్స్ సౌసి చేరానని గ్ర. తనకు రాజుహెన్రీ తెలుసని అన్నా ఎవరూ పట్టించుకోరు .తాను ముందుఖైదీగా తరువాత ఇటుకలు మోసేబానిసగా మారుతాడు.నల్లబానిసల ప్రాణాలకు లెక్కలేదు. పన్నెండు ఏళ్లపాటు బానిసలతో రాజు కొండమీద ప్రసిద్ధకోట నిర్మాణం చేస్తాడు. నిర్మాణం పూర్తయేసమయానికిటినోయల్ని విడిచిపెడతారు. అతడు తన పాత యజమాని శిథిల గృహంలో నెలలపాటు దాక్కుని బయటికివస్తేమరల బానిస అవుతానని భయపడతాడు. రాజు హెన్రీ క్రిసిటోఫే కార్నెర్ బ్రేవిరేల్ వ్యక్తిని సజీవ సమాధిచేస్తాడు. చివరకు తిరుగుబాటులో తన పరివారం అంతా పారిపోతే, ఆఫ్రికా నుంచి సేవకులుగా తెచ్చి న ఐదుగురు నల్లజాతీయులు మాత్రమే మిగులుతారు. హైతీ కి స్వాతంతంరరాగానేఆఫ్రికన్ మార్మిక వాదాన్ని కాదని యూరోపియన్ తరహాలో తన ఆస్థానం ఉండాలని చూసిన హెన్రీ ఆత్మహత్యకు పాల్పడతాడు. అంతిమగడియలో సత్య దర్శనం అవుతుంది. టినోయెల్ పాత యజమాని ఇంటిని మృత రాజు హెన్రీ క్రిసిటోఫేసౌధం నుంచి దోచుకున్న వస్తువులతో అలంకరించి తానేరాజు లాగా భావిస్తాడు.ఒకరోజు ఫ్రెంచ్ మాట్లాడేసర్వేయర్లు వచ్చి అతన్ని, అతని ఆజ్ఞలను తీసివేసిఆ ప్రాంతమంతా కొలతలు తీస్తారు. రిపబ్లికన్ మూలట్టోల చేతిలోకికొరడా వచ్చింది. ముసలి టినోయెల్ రూపాలు మార్చి చివరికిబాతుగా మారుతాడు. అయితేఆ బాతుల సమాజంలో ఎవరూ ఎవరిని గొప్పగా చూడరు. ఆ బాతులు ఇతడ్ని తన గుంపులో చేర్చుకోవు ఇదితన పిరికితనానికిశిక్ష అని టినోయెల్ భావిస్తాడు.టినోయెల్ లేచి బల్లమీద నిలబడి మూలట్టోల పైతిరుగుబాటుకు ఆదేశాలిస్తాడు.ఇంతలోవచ్చిన పెనుగాలి. అతడిజాడ రాబందుకు మాత్రమేతెలిసింది. బానిసగా బతికిన టినోయెల్ కు మనిషిఎవరికోసం బాధపడతాడు అనేదితెలియదని, ఎప్పుడు అతను ఆనందానికివెంపర్లాడతాడని సత్యం తెలిసివచ్చింది. అయితే శ్రమించి అభివృద్ధిచేయడంలోనేగొప్పతనం ఉంది.మనిషిఅంతా బాగా స్పష్టత , ఆనందం ఉండేస్వర్గంలో కాక ఈతి బాధలు, శ్రమ ఉన్న ఇహలోక రాజ్యంలోనేగొప్పతనం కనుగొనగలడు.

—డా.జె. రవీందనాథ్
8978131585

## పచ్చని రక్తస్రావం

అడవి గుండెలో గొడ్డలి కోరలు దిగితే
ఆకుల కన్నుల్లో ఆక్రందన మొలిచింది
వేలేళ్ళ నీడను నిముషాల్లో నరికేసి
అభివృద్ధి పేరుతో శవయాత్ర సాగింది
పక్షుల పాటలు పగిలిన వీణలై
గూళ్ళ జ్ఞాపకాలు గాలిలో చెదిరిపోయాయి
చెట్టు కేవలం కట్టె కాదనీ
భూమి ఊపిరని మట్టి ఏడ్చింది
నదులు తమ జడలు విప్పుకుని
ఎండిన పెదవులతో దాహం చెప్పుకున్నాయి
మేఘాలు దారితప్పిన యాత్రికులై
దిక్కుల వెతుకులాటలో తచ్చాడుతున్నాయి
గొడ్డలి గెలిచినట్లు కనిపించినా
గాయం మాత్రం కాలానికే మిగులుతుంది
పడిపోయిన ప్రతిచెట్టు వెనుక
భూమి భవిష్యత్తు రక్తమోడుతుంది .

మండాది గోపీనాథ్ ,
సెల్ ; 98850 45344

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు,
రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad.
Telangana- 500034.



# విశ్వహిందూ పరిషత్ఆధ్వర్యంలో యజ్ఞం

**వేములవాడ,మహా** : గత కొన్ని రోజులుగా నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, లోక కళ్యాణం, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ భగవంతు రావు నగర్‌లోని గాయత్రి మాత ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రత్యేక యజ్ఞం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య హోమాన్ని నిర్వహించగా, విశ్వహిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ వేములవాడ పట్టణ అధ్యక్షులు పల్లె శ్యాంసుందర్ రెడ్డి, పట్టణ కార్యదర్శి గోపాల్, చందనము రాజేష్, ఉపాధ్యక్షులు చేకుర్తి నవీన్,అజయ్ విశాల్, సహ కార్యదర్శి పుల్లూరిఆంజనేయులు, సామాజిక సమరసత ప్రముక్ జక్కం శివప్రసాద్, బజరంగ్దళ్ సహ సంయోజక్ హరచారి శ్రీరామ్ శర్మ,సాయి కృష్ణ, జిల్లా సహ కార్యదర్శిలు గడప కిషోర్ రావు, నాగులరాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సకాలంలో వర్షాలు కురిసి రైతులు పంటలు సమృద్ధిగా పండించి సుఖసంతోషాలతో జీవించాలని, ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం,ఆరోగ్యం,ఆయురారోగ్యాలుకలగాలనిగాయత్రిమాతను ప్రార్థించినట్లు తెలిపారు.

# పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్



**యాదాద్రి భువనగిరి జూన్ 28 మహా** : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ పాల్గొని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలియో వ్యాధి నిర్మూలనకు తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించకుండా మిగిలిపోకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తిచేశారు.ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి అండగా సీఎం

**యాదాద్రి భువనగిరి జూన్ 28 మహా** : యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జూలూరు గ్రామానికి చెందిన చిన్నారి ఆర్యాన్ష్ అరుదైన వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న నేపథ్యంలో వైద్య సహాయం కోసం ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోషల్ మీడియా (ట్విట్టర్) ద్వారా విజ్ఞప్తి చేయగా, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి, అవసరమైన వైద్య ఖర్చులకు ప్రభుత్వం తరపున సహాయం అందించాలని అధికారులను సూచించారు.ఈ విషయమై ఆదివారం భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు సీఎంఓ అధికారులతో మాట్లాడి, చిన్నారి ఆర్యాన్ష్‌కు అవసరమైన వైద్య&ఆర్థిక సహాయం అందజేశారు..చిన్నారి ఆర్యాన్ష్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించినట్లు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు




# ఎస్ఐఆర్ ప్రక్రియ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- బిఎల్ఎ ల పాత్ర అత్యంత కీలకం
- డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**హనుమకొండ మహా**: హనుమకొండ ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై ప్రతి కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్ బిఎల్ఎ లు పూర్తి అవగాహనతో, అత్యంత అప్రమత్తంగా ఉంటూ పనిచేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. మడికొండ లోని సత్య సాయి గార్డెన్ లో వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ బిఎల్ ఎ ల కోసం స్థానిక ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ అత్యంత కీలకమైనదని, ఇందులో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర ఎంతో బాధ్యతాయుతమైనదని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చూడాలని, అదే సమయంలో అక్రమ, తప్పుడు ఓట్ల తొలగింపు పై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. పార్టీ విజయానికి పోలింగ్ బూత్ స్థాయి నుంచే బలమైన పునాది వేయాలని పిలుపునిచ్చారు. సదస్సుకు అధ్యక్షత వహించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి, ఎన్నికల నిర్వహణలో పారదర్శకతను కాపాడడానికి బిఎల్ఏ లు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పై ప్రతి ఒక్కరూ పూర్తి సాంకేతిక, చట్టపరమైన అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఈ అవగాహన సదస్సులో టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ జెనరల్ సెక్రెటరీ దుద్దిల్ల శ్రీను బాబు, హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ పింగిలి వెంకట్రామ్ నరసింహా రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు మరియు నియోజకవర్గ పరిధిలోని పెద్ద సంఖ్యలో బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# చిన్నారుల ఆరోగ్యానికి రక్షణ పోలియో చుక్కలు



**జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ఆదివారం జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా పాల్వంచ మండలం ఇందిరా నగర్ కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి ఆరోగ్యంగా ఉండే విధంగా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. జిల్లాలో ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించకుండా మిగిలిపోకుండా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన చిన్నారులకు ఈ నెల 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లే ఆరోగ్య సిబ్బంది ద్వారా పోలియో చుక్కలు వేయిస్తామని తెలిపారు. ప్రయాణాల్లో ఉన్న కుటుంబాలు బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ఇటుక బట్టీలు, వ్యవసాయ పనులు, నిర్మాణ ప్రదేశాలు, ఇతర పని ప్రదేశాల్లో ఉన్న చిన్నారులకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి ప్రభుత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బరితెగించిన మొక్కజొన్న సీడ్ ఆర్గనైజర్లు.

- నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను ముంచుతున్నవైనం.
- నష్టపరిహారాన్ని ఇస్తామంటూ తప్పించుకున్న ఆర్గనైజర్లు.
- నకిలీ శ్రీకర విత్తనాలతో మునిగిన రైతు ఆవేదన .






**దమ్మపేట ,మహా** : మొక్కజొన్న సీడ్ ఆర్గనైజర్లు కొందరు బరితెగించి మరీ నకిలీ విత్తనాలను రైతులకు అంటగడుతూ నట్టేట ముంచుతున్నారు. అన్నదాత శ్రమను అడ్డంగా దోచుకుంటూ నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నారు కొందరు కేటుగాళ్ళు. అటువంటి కేటుగాళ్ళ ఉచ్చులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,దమ్మపేట మండలం గట్టుగూడెం గ్రామానికి చెందిన దారా ప్రసాద్ అనే రైతు చిక్కుకున్నాడు. కొంతమంది సీడ్ ఆర్గనైజర్లు చెప్పే మాటలకు ,ఇచ్చే విత్తనాలకు అసలు పొంతన లేకుండా పోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఎకరానికి టన్నులకొద్ది దిగుబడి వస్తుందని నమ్మబలికి మాయమాటలతో నకిలీ విత్తనాలను అంటకడుతూ తీరా పంట చేతికి వచ్చేసరికి దిగుబడి రాకపోవడంతో తమకేమీ సంబంధం లేదంటూ చేతులెత్తేస్తున్న ఉదంతం .

**అధికారుల వత్తాసు...?**

నకిలీ విత్తనాల దందాకు ఈ ప్రాంత వ్యవసాయ శాఖ ,ఉద్యానవన శాఖ , విత్తన ఇన్స్పెక్టర్ వంటి అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఈ ప్రాంత నకిలీ సీడ్ ఆర్గనైజర్లకు ఆడిందే ఆట ,పాడిందే పాటగా వారి వ్యాపార లావాదేవీలు మూడు విత్తనాలు ఆరు కాయలు గా విరాజిల్లుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నకిలీ విత్తనాలతో తన పంటను సర్వస్వం కోల్పోయి ఆర్థికంగా నష్టపోయిన రైతు వివిద పర్యాయాలు అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకువెళ్ళినప్పటికీ స్పందించకపోవడం దురదృష్టకరమని రైతు ఆందోళన చెందాడు.

**అసలేం జరిగింది...రైతు మాటల్లో :**

దమ్మపేట మండలం మొద్దులగూడెం ,నాచారం గ్రామాలకు చెందిన ఓ ఇద్దరి సీడ్ ఆర్గనైజర్లు శ్రీకర కంపెనీకి చెందిన మొక్కజొన్న సీడ్ ను ,ఇదే మండలానికి చెందిన గట్టుగూడెం రైతు దారా ప్రసాద్ కు విక్రయించారు. 4ఎకరాల 50 సెంట్ల వ్యవసాయ భూమి లో రైతు శ్రీకర మొక్కజొన్న సీడ్ ను వేసి సాగు చేశారు. మద్య మద్య లో సీడ్ ఆర్గనైజర్లు పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ,తగు సూచనలు సలహాలు ఇవ్వక పోయినా మొక్కజొన్న సాగును ఎటువంటి ఆటంకాలు లేకుండా రైతు ప్రసాద్ పరిపూర్ణత తో సాగు చేసినట్లు తెలిపారు. తీరా వెన్ను తీసే సమయంలో ఆర్గనైజర్లు పంటలో దాదాపుగా ఒక ఎకరం వరకు పంటను తొక్కేశారని రైతు పేర్కొన్నారు. ఎందుకు ఇలా త్రొక్కేస్తున్నారని ప్రశ్నించగా , అక్కడ నకిలీ విత్తనాలు వచ్చాయని ,అందువల్ల దాదాపుగా ఒక ఎకరం వరకు పంట దిగుబడి లేదని సమాదానం ఇచ్చినట్లు బాదిత రైతు వివరించారు. అంతేకాదు అట్టి నష్టపోయిన పంటకు సీడ్ యాజమాన్యం తో మాట్లాడి ,తగిన ఆర్థిక నష్ట పరిహారాన్ని అందిస్తామని నమ్మబలికినట్లు బాదిత రైతు పేర్కొన్నారు. దీంతో నష్టపరిహారం వస్తుందనే ఆశతో రైతు ఎదురు చూస్తుండగా , సీడ్ ఆర్గనైజర్ల వద్దకు వెళ్ళి నష్టపోయిన ఎకరానికి పరిహారం ఇవ్వాలని కోరాడు. అందుకు సమాదానం గా నష్టపరిహారం ఇవ్వబోమని ,నీ దిక్కున్నచోట చెప్పకోమంటూ దుర్భాషలాడటంతో చేసేదేమీ లేక మీడియా ను ఆశ్రయించినట్లు బాదిత రైతు తెలిపారు. ఇదంతా జరిగి దాదాపుగా నెల రోజులు దాటినా పరిష్కారం కాకపోవడంతో రైతు లబోదిబోమంటున్నారు. తీరా బాదిత రైతు ఆరాతీయడంతో ఇట్టి విషయం బాహ్యప్రపంచానికి తెలియకుండా ఉండేందుకు అధికారులకు ,మీడియా కు కొంత మేరకు నజరానాలు ముట్టజెప్పి ,సీడ్ ఆర్గనైజర్లకు అనుకూలంగా కొన్ని వార్తా పత్రికలు ద్వారా ప్రకటనలు వేయించారని బాదితుడు పేర్కొన్నారు.ఈ విషయమై శ్రీకర ఆర్గనైజర్లను వివరణ కోరగా ధీమాగా సమాదానం ఇచ్చారు. మండలంలో ఎంతోమంది రైతులకు సీడ్స్ ఇచ్చామని ,ఎవరికీ రాని నకిలీ విత్తనాలు ఈ ఒక్కరైతుకే ఎలా వస్తాయని ధీమాగా సమాదానం ఇచ్చారు. తమ దగ్గర నుండి డబ్బులు వసూలు చేయడానికి తప్పుడు ప్రచారం చేస్తున్నాడని తమకుతాము సమర్థించుకున్నారు.

# పీజీ కళాశాల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి చేతుల మీదుగా...
- ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ అధ్యక్షతన కార్యక్రమం
- హాజరైన ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, కళాశాల సిబ్బంది



**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో నూతనంగా మంజూరైన పీజీ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం రెండు కోట్ల రూపాయలను కేటాయించగా సంబంధిత శంకుస్థాపన కార్యక్రమంను ఆదివారం నాడు జరిగింది. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి చేతుల మీదుగా కార్యక్రమంను నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంతో బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలకు కొత్త భవన నిర్మాణం కోసం శ్రీకారం చుట్టినట్లయ్యింది. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల అన్ని రకాలుగా అభివృద్ధి చెందేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ మాట్లాడుతూ బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అద్భుతమైన కోర్సులు అందుబాటులో ఉన్నాయని, నియోజకవర్గంలోని విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి మాట్లాడుతూ, విద్యార్థిని విద్యార్థులు అందివస్తున్న అద్భుతమైన విద్యా అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, వైస్ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సూపరింటెండెంట్, కార్యాలయ ఉద్యోగులు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ బెల్లంపల్లి స్టడీ సెంటర్ కౌన్సిలర్లు, ఉద్యోగులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# పిల్లల నిండు జీవితానికి పల్స్ పోలియో చుక్కలు

వలిగొండ జూన్ 28 మహా న్యూస్ : వలిగొండ మండలంలోని వర్కట్ పల్లి లో ఆదివారం డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో పల్స్ పోలియో చుక్కలు వేశారు ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ పిల్లల నిండు జీవితానికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చు అని ఆమె అన్నారు



# ప్రహరీ గోడ నిర్మాణానికి సర్పంచ్ శంకుస్థాపన...

**కారేపల్లి, మహా:** కారేపల్లి మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామపంచాయతీ కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఏర్పాటు చేయనున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఆదివారం సర్పంచ్ ఇస్లావత్ రాజు శంకుస్థాపన చేశారు. 10 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఈ ప్రహరీ గోడ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు బొగ్గారపు ముఖర్జీ, చిన్ననాయక్, సుజాత, తాత ఉపేందర్ రావు, గ్రామస్తులు సూరపురెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, వల్లభనేని ప్రభాకర్ రావు, వెంకట్, బొల్లు శ్రీను, కొత్త భద్రయ్య, పంచాయతీ సిబ్బంది హుస్సేన్, జాను తదితరులు పాల్గొన్నారు.



# పోలియో రహిత సమాజమే మనందరి లక్ష్యం: డాక్టర్ భరత్ కుమార్

**మహా వరంగల్ పోచమ్మ మైదాన్ :** పోలియో రహిత సమాజమే మనందరి లక్ష్యమని పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని దేశాయిపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భరత్ కుమార్ అన్నారు. ఆదివారం డాక్టర్స్ కాలనీలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ భరత్ కుమార్ మాట్లాడుతూ యూపీహెచ్‌ఎస్సి పరిధిలో 05 పిల్లలు 3,193 పిల్లలకు 13 బూతులు ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేయించనున్నట్లు పేర్కొన్నారు. అదనంగా ఒక మొబైల్ బూతులు కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ జ్యోత్స్న సూపర్వైజర్ జన్ను కోర్నెలు ఫార్మసీ ఆఫీసర్ సంఘ అనిల్ కుమార్ ఏఎన్ఎం అమృత కుమార్ అంగన్వాడి టీచర్ ఇస్రారాత్ ఆశా వర్కర్ పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పోలియోను అంతం చేద్దాం కలెక్టర్, మున్సిపల్ చైర్ పర్సన్



**ఆదిలాబాదు మహా** :ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు. ఆదివారం పట్టణంలోని హమాలీవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రభుత్వ ఆరోగ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన 'పల్స్ పోలియో' కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు.పోలియో రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమాజంలో పోలియో మహమ్మారిని పూర్తిగా నివారించి, రాబోయే తరాలకు అంగవైకల్యం లేని ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడమే ధ్యేయంగా ఈ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 0 నుండి 5 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలందరికీ తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్ వేయించాలని స్పష్టం చేశారు. గతంలో పోలియో చుక్కలు వేయించామనే కారణంతో ఈ విడతను నిర్లక్ష్యం చేయవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమ పిల్లల ఉజ్వల, ఆరోగ్యకరమైన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పోలియో చుక్కలు వేయించాలని కోరారు. జిల్లాలోని ఐదేళ్లలోపు పిల్లలందరికీ వంద శాతం పోలియో చుక్కలు అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ కోరారు.ఇందులో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రాకేష్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.సాధన, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ప్రోగ్రామ్ అధికారి శ్రీనివాస్, సుమలత, కాలనీ వసూలు, చిన్నారులతో పాటు తల్లిదండ్రులు, ఇతర అధికారులు, వైద్య శాఖ సిబ్బంది, పాల్గొన్నారు.



## రెండు చుక్కల తో పోలియో దూరం...

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్...**

**రాజేంద్రనగర్ మహా ;** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమం లో భాగంగా కాటేదాన్ డివిజన్ పరిధిలోని గణేష్ నగర్ లోని మండల పరిషత్ పాఠశాలలో చిన్నారులకు రెండు చుక్కలు పోలియో డ్రాప్స్ ను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆదివారం వేశారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు పోలియో డ్రాప్స్ తప్పనిసరిగా వెయ్యాలన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ తల్లి దండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. రెండు చుక్కల పోలియో డ్రాప్స్ తో పోలియో మహమ్మారిని తరిమి కొట్టాలన్నారు.

**శంషాబాద్ బస్టాండ్ లో ట్రాన్సిట్ పాయింట్లు.**

ప్రయాణాల నేపథ్యంలో పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం మర్చిపోకుండా దూర ప్రాంతాలకు వెళ్లే తల్లిదండ్రుల సౌకర్యార్థం శంషాబాద్ బస్టాండ్ లో ఈ ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు.




## ఓటు హక్కు పరిరక్షణకు ముందుకు రావాలి

**బీఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మండల్ యూత్ ఉపాధ్యక్షులు వడ్ల కాళిదాస్ చారి**

**మొయినాబాద్ మహా:** ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైన రాజ్యాంగబద్ధమైన హక్కు అని, దానిని పరిరక్షించుకోవడానికి ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని బీఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మండల యూత్ ఉపాధ్యక్షులు కాళిదాస్ చారి విజ్ఞప్తి చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం ద్వారా ఎన్నికల సంఘం ఓటరు జాబితాలను సమగ్రంగా పరిశీలిస్తున్న నేపథ్యంలో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఓటరు జాబితాలో పేర్లు చిరునామాలు వయస్సు తదితర వివరాల్లో ఏవైనా పొరపాట్లు ఉన్నట్లయితే వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఓటరు జాబితాలో పేరు లేని...





# సవార్లను దర్శించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం సందర్భంగా ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పలు గ్రామాలను సందర్శించి సవార్లను దర్శించుకొన్నారు.జైనథ్ , భోరజ్ మండలకేంద్రాలతో పాటు తన స్వగ్రామం తాంసి మండలం హస్నాపూర్, తలమడుగు మండలం లోని ప్రసిద్ధ రుయ్యాడి హస్సేన్ హుస్సేన్ దేవస్థానాన్ని సందర్శించారు. ఆయా గ్రామాల నిర్వాహకులు స్థానికులు కాంగ్రెస్ శ్రేణులు కంది శ్రీనివాస రెడ్డికి డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు.పీరీలను దర్శించి దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు వాయిస్తూ దరువేసి ఉత్సాహపరిచారు. అనంతరం స్థానికులతో కలిసి గుండం చుట్టూ లయబద్ధంగా నృత్యాలు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికి తాను ఎప్పుడూ ముందుంటానని అన్నారు. అంతా కలిసి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. గ్రామాలకు మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు తీసుకువచ్చేలా కృషి చేస్తానన్నారు.



ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచి మరింత ఎక్కువగా నియోజకవర్గాన్నిఅభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు,శాంతన్ రావు, సుధాకర్ గౌడ్ , అశోక్,రాంరెడ్డి,ఖయ్యూం ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈ నెల 29న ఓరుగల్లుకు కేటీఆర్ రాక

- **భద్రకాళి చెరువు పూడికతీత పనుల జాప్యం పై బిఆర్ఎస్ గరం**
- **అభివృద్ధిని మరిచి కమిషన్ల పైనే పాలకుల శ్రద్ధ**
- **మాజీ ఎమ్మెల్యేలు దాస్యం, నన్నపునేని.. ఫైర్**



**మహా వరంగల్, హన్మకొండ;** ఈనెల 29 న బిఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీమంత్రి కేటీఆర్ వరంగల్ నగర పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా హనుమకొండ లోని బిఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షతన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. వరంగల్ తూర్పు నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు హాజరవుతున్నారని అదేవిధంగాఈ సమావేశానికి తూర్పు పరిధిలోని 3500 మంది గులాబీ కార్యకర్తలు పాల్గొంటారని నరేందర్ తెలిపారు. పేదలకు పంపిణీ చేసిన పట్టాల పై అవగాహన లేని కొంతమంది కాంగ్రెస్ నేతలు ఏది పడితే అది మాట్లాడు తున్నారని నేటి కాంగ్రెస్ పాలకులు గతంలో వారి ప్రభుత్వాలు పేదలకు ఇండ్ల పట్టాలు ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. గత బిఆర్ ఎస్ పాలనలో వరంగల్ తూర్పు నియోజకవర్గం లో 3500 పట్టాలు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు, మేయర్గా ఉన్నప్పుడు మా సోదరులు వినయ్ భాస్కర్ 5000 పైగా పట్టాలు పంపిణీ చేశారని గుర్తు చేశారు. జీవో నెంబర్ 58, 59కి తేడా తెలియని వారు కూడా ఈ రోజు మాట్లాడుతుండటం విడ్డూరమన్నారు. పేదలకు అన్యాయం చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. ముఖ్యంగా పాలకులు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల భద్రకాళి చెరువు పనుల జాప్యానికి ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. వరదల వల్ల భద్రకాళి చెరువు పూడికతీత పనుల అలసత్వం కారణంగా పలువురు చనిపోయారని ప్రజల ఆరోపిస్తున్నారు.సమావేశంలో భాగంగా ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే, దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ వరంగల్ నగర ప్రజల జీవనాడి గా ఉన్న భద్రకాళి చెరువు పూడికతీత పనులు నెలల తరబడి కొనసాగుతున్నప్పటికీ ఇప్పటికీ పూర్తి కాకపోవడం పట్ల మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, సమన్వయ లోపం కారణంగానే పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆయన విమర్శించారు. భద్రకాళి చెరువు పూడికతీత పనుల్లో తీవ్ర జాప్యం భద్రకాళి చెరువు పూడికతీత పనులు ప్రారంభమై చాలా నెలలు గడిచినా ఇప్పటికీ పూర్తి కాలేదని వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగా పనులు ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదన్నారు. గత ఏడాది భారీ వర్షాలు, వరదల కారణంగా పనులు నిలిచిపోయాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వర్షాకాలం ముగిసిన తర్వాత కూడా పనులను వేగవంతం చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పూడిక మట్టిని తరలించడంలో సాంకేతిక సమస్యలు, వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం, స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం వల్ల పనులు తీవ్రంగా ఆలస్యమయ్యాయని అన్నారు. వరద నీరు బయటకు వెళ్లక నగరంలోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయకపోతే గత ఏడాది పరిస్థితులే మళ్లీ పునరావృతమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భద్రకాళి చెరువులో వరుసగా జరుగుతున్న మునక ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని వినయ్ భాస్కర్ అన్నారు. తాజాగా మరో యువకుడు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, గతంలో కూడా ఇలాంటి ఘటనలు ఎన్నో చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అమాయకుల ప్రాణాలు బలవుతున్నాయని విమర్శించారు. కాంట్రాక్టర్లను కమిషన్ లు తీసుకుంటున్న ప్రజాప్రతినిధులు పనుల పూర్తి పై చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తున్నారని బిల్లులు చెల్లించక పోవడంతో కొంతమంది కాంట్రాక్టర్లు పనులు ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. భద్రకాళి మత్తడి గేట్లు బిగించని కారణంగా, 100 ఫీట్ల రోడ్డు అండర్ డ్రైయిన్ గేట్లు ఎత్తని కారణంగా గత ఏడాది నగరం ముంపుకు గురైందని విమర్శించారు. ఈ ఏడాదైనా పాలకులు ముందస్తు చర్యలు చేపట్టి నగరం మునగకుండా జాగ్రత్త వహించాలని ఈ సందర్భంగా కోరారు. కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి మాట్లాడుతూ... వరంగల్ తూర్పు నియోజకవర్గ గులాబీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం నింపేందుకు కేటీఆర్ పర్యటన దోహదపడుతుందని అన్నారు. వరంగల్ తూర్పు పరిధిలోని 24 డివిజన్ల నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రానున్నారని వచ్చిన కార్యకర్తలకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని నరేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు దిడ్డి కుమారస్వామి, రమేష్ బాబు, మాజీ ఆర్టీఏ మెంబర్ గోరంట్ల మనోహర్, మాజీ డివిజన్ అధ్యక్షులు పొగాకు సందీప్ బజ్జూరి వాసు, తుమ్మలపల్లి రమేష్,జూపాక అనిల్, రాజ పటేల్ చిమ్మని సంతోష్, సుమిత్ మాజీ కార్పొరేటర్ ఉడతల సారంగపాణి, సీనియర్ నాయకులు పులి రజినీకాంత్, నయీమొద్దీన్, కుడా మాజీ డైరెక్టర్ మోడం ప్రవీణ్, నాయకులు నర్సింహరావు, గౌస్ ఖాన్, మూటిక రాజు యాదవ్, మనోహర్, సందీప్, వాసు, రమేష్, సంతోష్, రాజు పటేల్, సుమిత్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



## బాసర అమ్మవారి సేవలో మంత్రి జూపల్లి కృష్ణారావు

- **ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష**
- **టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశం**

**భైంసా, మహా :** తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం ఉదయం నిర్మల్ జిల్లా బాసర లోని శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు మంగళవాయిద్యాలు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఇటీవల చోరీ జరిగిన మహంకాళి అమ్మవారి ఆలయాన్ని మంత్రి సందర్శించి ఘటనపై ఆరా తీశారు. ఆలయ భద్రతా ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.అంతకుముందు ఇంద్రప్రస్థ గెస్ట్ హౌస్‌లో బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులు, టెండర్ల ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి, ఆలయ ఈవో అంజనాదేవితో మంత్రి సమీక్ష నిర్వహించారు. టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, బాసర సర్పంచ్ వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్

- **ప్రజలు విజయవంతం చేయాలని సూచన**
- **అనవసర అపోహలు వద్దని వెల్లడి**

**ఆదిలాబాదు మహా :** పౌరులందరూ బాధ్యతగా జూలై 24 లోగా తమ వివరాలను నమోదు చేసుకుని ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని హామలీవాడ, భాగ్యనగర్ కాలనీల్లో ఎస్.ఐ.ఆర్. పక్రియను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీలో పర్యటిస్తూ ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఎన్యూమరేషన్ ఫారం ను ఓటర్లకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం జూన్ 25 నుండి ప్రారంభమై జూలై 24 వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కాలవ్యవధిలో ఓటర్ల వివరాల సేకరణ, సవరణలు, అనుసంధాన ప్రక్రియను ముమ్మరంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో పోలింగ్ చిట్టీలు అందజేసే బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శిస్తారనీ, వారు ప్రతి కుటుంబానికి రెండు జతల ఎన్యూమరేషన్ ఫారాలను అందిస్తారని తెలిపారు. ప్రజలు ఈ ఫారాలను సక్రమంగా పూరించి, తమ ప్రస్తుత ఓటు వివరాలను 2002 ఓటర్ల జాబితాతో తమ పేరు లేదా తమ కుటుంబ సభ్యులైన తల్లి, తండ్రి, తాత, నానమ్మ/అమ్మమ్మ తదితరుల వివరాలు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని, లింక్ చేయాల్సి ఉంటుందని సూచించారు. ఆ వివరాలను ప్రస్తుతం పూరిస్తున్న ఎన్యూమరేషన్ ఫారంలో పొందుపరచాల్సి ఉంటుందనీ, ఆ తర్వాత పూర్తిగా నింపిన ఫారంపై సంతకం చేసి, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను జతపరిచి సంబంధిత బీఎల్ఓకి అందజేయాలన్నారు. ఇందులో ఒక కాపీని బీఎల్ఓ తీసుకుంటారని, మరో కాపీని ఓటరు తమ వద్ద భద్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు.

ఓటర్లు తమ ఓటు వివరాలను తెలుసుకోవడానికి బీఎల్ఓలను సంప్రదించవచ్చని, లేదా సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవారు సొంతంగా వోటర్స్ ఈసీఐ వెబ్ సైట్ ను సందర్శించి, సర్చ్ బై ఎలక్టోరల్ ఆప్షన్ ద్వారా తమ సమాచారాన్ని ఉచితంగా తెలుసుకోవచ్చని సూచించారు. 2002 ఓటర్ల జాబితాతో ప్రస్తుత ఓటును లింక్ చేయడం వల్ల ఓటు కట్ అవుతుందనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, అటువంటి అపోహలను ఎవరూ నమ్మవద్దని స్పష్టం చేశారు. ఎన్యూమరేషన్ ఫారం సమర్పించిన ప్రతి ఒక్కరి ఓటు ఖచ్చితంగా భద్రంగా ఉంటుందని, ఈ ఫారాలు ఇవ్వని వారి ఓట్లు మాత్రమే భవిష్యత్తులో తొలగించబడే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఈ ఎన్నికల ఓటర్ల సవరణ ప్రక్రియలో పాల్గొనడం ప్రతి పౌరుని యొక్క ప్రాథమిక బాధ్యత అని కలెక్టర్ గుర్తుచేశారు. కాబట్టి జిల్లాలోని పౌరులందరూ బాధ్యతగా వ్యవహరించి, జూలై 24 లోగా తమ వివరాలను నమోదు చేసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జగదీశ్వర్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, పట్టణ తహసిల్దార్ శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ పద్మావార్ రాకేష్, గంట జీవన్, సూపర్ వైజర్లు, బిఎల్ఓలు, కాలనీ వాసులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఏఐటీయూసీ కార్మిక సంఘాల నాయకులు బిఆర్ఎస్ పార్టీలోకి..

- **పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి..**

రాజేంద్రనగర్ మహా; ఏఐటీయూసీ కార్మిక సంఘాల నాయకులు బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి సమక్షంలో ఆదివారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి సిపిఐ అనుబంధ సంఘాల నాయకులు బిఆర్ఎస్ పార్టీ పోరాట పటిమపై నమ్మకంతో పార్టీలో చేరారు. బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి స్వాగతిస్తున్నాం. ఏఐటియుసి జిల్లా నాయకులు అనే ప్రభు ముదిరాజ్, అరుణ్ ముదిరాజ్, లింగం యాదవ్, చాంద్ పాషా, శ్రీనివాస్ చారి, శ్రీధర్, దేవేందర్ నాయక్, సతీష్ ముదిరాజ్, రాజు గౌడ్, లోకేష్ నాయక్, మనిషి పటేల్ ఈచేరికలతో బిఆర్ఎస్ పార్టీ శంషాబాద్ లో మరింత బలపడిందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి స్థానిక నేతల మోకాలడ్డు.. ఒంటరి మహిళ ఆవేదన...

**రాజేంద్రనగర్ మహా ;** ఒంటరి మహిళకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి స్థానిక రాజకీయ నాయకులు ఆటంకాలు సృష్టిస్తున్నారని మేకల లక్ష్మమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. శంషాబాద్ సర్కిల్ పరిధిలోని తోండుపల్లి ఇందిరమ్మ గృహాలలో 13 సంవత్సరాల క్రితం 60 గజాల ఇందిరమ్మ ఇంటి పట్టాను మేకల లక్ష్మమ్మ తనకు ఉన్న భూమిని అమ్మి, తన సొంత కూతురు అల్లుడు ఉండే తోండుపల్లి ఇందిరమ్మ గృహాల్లో స్థలాన్ని తహెరా బేగంతో కొనుగోలు చేసింది. చేసిన 60 గజాల స్థలంలో ఇంటి నిర్మాణానికి సంబంధించిన అనుమతులు పొందింది. ఇందిరమ్మ ఇంటి పథకంలో చేరి లబ్ధిదారులుగా లక్ష రూపాయల డబ్బులు లక్ష్మమ్మ ఖాతాలు పడ్డాయి. నిర్మాణం స్లాబ్ వరకు వచ్చాక స్థానిక రాజకీయ నాయకులు 60 గజాల స్థలాన్ని ఆమె కొనుగోలు చేసింది. లక్ష్మమ్మకు 60 గజాల పట్టా లేదంటూ ఎమ్మార్వో, కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదు చేస్తున్నారని మేకల లక్ష్మమ్మ ఆరోపించింది. ఒంటరి మహిళ అయిన తనకు సొంత కూతురు ఊర్లో గృహ నిర్మాణానికి కావాలనే పనిగట్టుకుని నాయకులు అడ్డు తగులుతున్నారని అసహనం వ్యక్తం చేసింది. తోండుపల్లి ఇందిరమ్మ గృహాల్లో 90 శాతం 60 గజాల పట్టాలను కొనుక్కొని నిర్మాణాలు చేసుకుని నివసిస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని లక్ష్మమ్మ అధికారులను వేడుకుంది.



## ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి

- **పోలియో రహిత భారతమే లక్ష్యం: బొంతు శ్రీదేవి యాదవ్**

**కుషాయిగూడ, మహా:** పోలియో రహిత భారత నిర్మాణమే అందరి లక్ష్యమని, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అని పెద్ద చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో జాతీయ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం, ఐదేళ్లలోపు చిన్నారులకు స్వయంగా రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్ వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలియో వ్యాధి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ఒక్క చిన్నారి కూడా వ్యాక్సిన్‌కు దూరం కాకుండా తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో వ్యాక్సినేషన్ నిర్వహించి ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమానికి తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభించింది.



# నిండు జీవితానికి రెండు చుక్కలు

**కౌన్సిలర్ పల్లగోల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్**

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ లోని హిమాయత్ నగర్ వార్డు లో నిర్వహించిన పోలియో కార్యక్రమంలో పాల్గొన 10వ వార్డు కౌన్సిలర్ పల్లగోల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్ మాట్లాడుతూ 5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో తల్లిదండ్రులందరూ తప్పనిసరిగా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. అప్పుడే పుట్టిన శిశువు నుండి 5 సంవత్సరాల లోపు వయసు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పల్స్ పోలియో చుక్కలు చిన్నారులకు జీవితాంతం రక్షణ కవచంలా నిలుస్తాయని, చిన్నారుల ఆరోగ్యవంతమైన జీవితానికి, బంగారు భవిష్యత్తుకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ కోసం, పోలియోరహిత భారతదేశం కోసం.. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని కోరారు

# రాజకీయాలకు అతీతంగా మురికివాడల అభివృద్దే లక్ష్యం

- **ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**
- **ప్రత్యేక నిధులతో మురికివాడలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం:**
- **మాజీ మేయర్ బొంతు రామ్మోహన్**

**కుషాయిగూడ, మహా**: రాజకీయాలకు అతీతంగా అన్ని కాలనీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ముఖ్యంగా మురికివాడలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అన్నారు. బిఎల్ఆర్ ట్రస్ట్ పేద విద్యార్థులకు ఒక వరం లాంటిదని ఉప్పల్ నియోజకవర్గంలో ప్రతి విద్యార్థికి తన సొంత నిధులతో మెడికల్ విద్యను అందిస్తున్నానని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా వైద్య సంస్థలలో ఫీజులు తగ్గించేందుకు ఉప్పల్ ఎమ్మెల్యేగా ఎంతో కృషి చేస్తున్నానని బండారు లక్ష్మారెడ్డి వెల్లడించారు ఆదివారం సోనియా గాంధీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. మురికివాడల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని తెలిపారు. కాలనీల్లో ఎలాంటి సమస్య వచ్చినా తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఉప్పల్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పన కొనసాగుతోందని వివరించారు. హైదరాబాద్ నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ, తాను మేయర్‌గా ఉన్న సమయంలో ప్రత్యేక నిధుల ద్వారా సోనియా గాంధీనగర్, గాంధీనగర్, గణేష్‌నగర్, శుభోదయ కాలనీతో పాటు చర్లపల్లి డివిజన్ పరిధిలోని మురికివాడల అభివృద్ధికి కోట్లాది



రూపాయలు వెచ్చించినట్లు గుర్తు చేశారు. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసినప్పుడే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోగలమన్నారు. ప్రజల కోసం పనిచేసే నాయకులు మంచి పనులు చేసే ఎప్పుడూ ప్రజల హృదయాల్లో మెదిలిపోతారన్నారు మురికివాడల ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చిన ఎలాంటి విపత్తు వచ్చిన తాను నా సహచరినైనా బొంతు శ్రీదేవి యాదవ్ ఎప్పుడు ప్రజల మధ్యనే ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తుందని కొనియాడారు మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ, సోనియా గాంధీనగర్, గాంధీనగర్, గణేష్‌నగర్, శుభోదయ కాలనీలకు ప్రత్యేక రేషన్ షాపు, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు పూర్తయిందని, త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు కొత్త పెన్షన్లు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ సందర్భంగా సోనియా గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కుందనపల్లి సిద్దురాములను ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అభినందించారు. కాలనీ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నిస్వార్థ సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జి. రాములు యాదవ్, బీఆర్ఎస్ చర్లపల్లి డివిజన్ మాజీ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్, బుచ్చన్నగారి శ్రీకాంత్ రెడ్డి, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, గోపాల్ గౌడ్, ప్రభు గౌడ్, పరశురాములు గౌడ్, సోనియా గాంధీ నగర్ వ్యవస్థాపకుడు చిందం మల్లేష్, వంశరాజ్, మైలారం కన్నె మల్లేష్ కృష్ణ యాదవ్ మేడం రాజు శ్రీనివాస్ వెంకన్న సుమతి సూరిబాబు తాండ్ర యాదగిరి రాణి యాదవ్ న్యాయవాది మంజుల డేవిడ్ వెంకన్న బాలనరసింహ, బంకు శీను, గొల్ల కిట్టు తదితరులు పాల్గొన్నారు. సోనియా గాంధీ నగర్ కాలనీ గణేష్ నగర్ కాలనీ శుభోదయ కాలనీ ఈస్ట్ గాంధీనగర్ ఆయా కాలనీలకు ఇంటి నంబర్లు ఇంటి మీటర్లు ఇప్పించేందుకు ప్రత్యేక చొరవ చూపించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవుల దృష్టికి నూతన అధ్యక్షుడు కుందనపల్లి సిద్దురాములు సిద్ధ రాములు తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి బొంతు రామ్మోహన్ బొంతు శ్రీదేవి యాదవులు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



# చర్లపల్లిలో కమ్యూనిటీ హాల్, వాణిజ్య సముదాయం ప్రారంభం

- **ప్రజలకు అంకితం చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా** : చర్లపల్లి డివిజన్‌లో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్, వాణిజ్య సముదాయాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి భవనాలను ప్రజలకు అంకితం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కమ్యూనిటీ హాల్ స్థానిక ప్రజలకు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వాణిజ్య సముదాయం అందుబాటులోకి రావడం వల్ల స్థానిక వ్యాపారులకు మెరుగైన వాణిజ్య అవకాశాలు, ఉపాధి కల్పనకు దోహదపడుతుందని పేర్కొన్నారు.అనంతరం భవనాలను పరిశీలించి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మాకు ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదు..

- **ప్రభుత్వ భూముల్లో బడా బాబులు తిష్ట వేశారు, ముందు వాటిని స్వాధీనపరుచుకోండి**
- **మద్దతు తెలిపిన బీఎస్పీ సిపిఐ పార్టీలు**
- **మూడోరోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలు**

**మొయినాబాద్ మహా**: 19 ఏళ్ల క్రితం హిమాయత్ నగర్ లోని సర్వేనెంబర్ 151 లో 290 మంది పేదలకు 60 గజాల చొప్పున ఇంటి పట్టాలు అందజేసి ఇప్పుడు అదే స్థలాన్ని మార్కెట్ కు కేటాయించబడం ఏమిటని... మాకు ఇళ్ల స్థలాలు చూపించేంతవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని హిమాయత్ నగర్ గ్రామస్థులు స్పష్టం చేశారు. తమకు ఇచ్చిన పట్టాలకు అనుగుణంగా ఇళ్ల స్థలాలను చూపించాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న రిలే నిరాహార దీక్ష గురువారం మూడవ రోజుకు చేరింది. తమకు ఇళ్ల స్థలాలు చూపించేంతవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించి కూర్చున్నారు. మండలంలో అనేక ప్రభుత్వ స్థలాల్లో బడాబాబులు తిష్ట వేసి కబ్జాపై ఉన్నారని ముందుగా వారి నుంచి ప్రభుత్వ స్థలాలను స్వాధీన పరుచుకోవాలని డిమాండ్ చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఎంత మభ్యపెట్టిన తమకు ఇళ్ల స్థలాలు ముఖ్యమని ఇన్ని రోజులు పాలకుల మాట విన్నామని ఇప్పుడు మాత్రం వినేది లేదని స్పష్టం చేశారు. హిమాయత్ నగర్ గ్రామంలోని నాలుగు యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఆయా యువజన సంఘాల అధ్యక్షులు మాట్లాడుతూ తమకు 19 ఏళ్ల క్రితం హిమాయత్ నగర్ లోని సర్వే నెంబర్ 151 లో 290 మంది పేదలకు 60 గజాల ఇంటి పట్టాలను అందజేసిందని ఇప్పుడు అందులో ఇల్లు నిర్మించుకునేందుకు వెళ్తే అధికారులు అడ్డు చెబుతున్నారన్నారు. ఒక్కో కుటుంబంలో పదిమంది ఉన్న మా పేద బతుకులకు ఇల్లు కావాలని వేడుకుంటున్న కనీసం ఎవరు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగేంత వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తూనే ఉంటామని ప్రభుత్వ పెద్దలు దిగి వచ్చేవరకు ఇక్కడే కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్నామని స్పష్టం చేశారు. పోరాటానికి మద్దతుగా బీఎస్పీ మరియు సీపీఐ పార్టీలు మద్దతు తెలుపుతూ హిమాయత్ నగర్ లోని సర్వే నెంబర్ 151 లో పేదలకు స్థలాలు కేటాయించేవరకు వారికి మద్దతుగా ఉంటామని తెలిపారు ఈ దీక్షలో ఆయా యువజన సంఘాల అధ్యక్షులు కుమ్మరి విఠల్, కట్టమీది శ్రీను, కరీం, గోపాల్ నాయక్ లతో పాటు యువజన సంఘాల నాయకులు గ్రామస్థులు ఉన్నారు.



# తెలంగాణా లో డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా బిజెపి కార్యకర్తలు సిద్ధం కావాలి..

**బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ సిన్హా ...**

**రాజేంద్రనగర్ మహా ;** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ సిన్హా మూడు రోజుల తెలంగాణ పర్యటన నిమిత్తం న్యూఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికిరాగానే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ శంషాబాద్ ఎయిర్పోర్ట్ లో ఆయనకు స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా బిజెపి అధ్యక్షులు రంగారెడ్డి జిల్లా రూరల్ బిజెపి కార్యాలయాన్ని రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ తో కలిసి ప్రారంభించడంతోపాటు వివిధ జిల్లాల పార్టీ కార్యాలయాలను వర్చువల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా బిజెపి శ్రేణులు పనిచేయాలన్నారు. పశ్చిమ బెంగాల్ స్ఫూర్తితో తెలంగాణ లోనూ పోరాడాలని బిజెపి కార్యకర్తలకు జాతీయ అధ్యక్షులు పిలుపునిచ్చారు. తెలంగాణలో రానున్న రోజుల్లో డబుల్ ఇంజన్ సర్కార్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా బిజెపి కార్యకర్తలు ఆ దిశగా పని చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతికి పాల్పడి, వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న వారిని నిలువరించేందుకు బిజెపి కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి పోరాడాలి, తెలంగాణ అవినీతి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేదాకా బిజెపి శ్రేణులు కష్టపడాలన్నారు. కార్యక్రమంలో బిజెపి లోక్సభ సభ్యులు, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులు, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పల్స్ పోలియో సిబ్బందికి భోజన వసతి

- **కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**
- **కుషాయిగూడ పీహెచ్‌సీలో వైద్యులకు, ఆశా వర్కర్లకు విందు**

**కుషాయిగూడ, మహా** : పల్స్ పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం జమ్మిగడ్డ ప్రాంతంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు, నర్సింగ్ సిబ్బందికి మరియు ఆశా వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఏ ఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాకాల రాజ్ కుమార్, జిల్లా కార్యదర్శి అల్లూరయ్య, పెద్ది శ్రీనివాస్ ల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పోలియో రహిత సమాజం కోసం రోజంతా విరామం లేకుండా శ్రమిస్తున్న హెల్త్ క్యాంప్ సిబ్బందికి అండగా నిలవాలనే ఉద్దేశంతోనే ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. భోజన వసతి కల్పనకు సహకరించిన దాతలకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ తరఫున డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. పోలియో బూత్‌ల నిర్వహణలో నిరంతరం శ్రమిస్తున్న వైద్య సిబ్బంది, ఆశా వర్కర్ల కష్టాన్ని గుర్తించి, వారికి కాంగ్రెస్ పార్టీ నాయకులు భోజన వసతి కల్పించడం అభినందనీయమని కొనియాడారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపుతాయని పేర్కొంటూ, దాతలకు మరియు కాంగ్రెస్ నాయకత్వానికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు సింగం కిరణ్, మామిడి శ్రీనివాస్, ఉపేందర్ రెడ్డి, రహమతుల్లా, సలీం, సువాస్, ప్రకాష్, రాజేష్, సాయి, ఉమేష్, రామ్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి స్వాగతం

ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్లగొండకు వచ్చిన సందర్భంగా ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ఘన స్వాగతం పలికారు



# ఆరోగ్యవంతమైన బాల్యం... బంగారు భవిష్యత్తుకు సాఫల్యం

- **ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు**
- **కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి.రామలింగం.**

**కుషాయిగూడ, మహా** : ఆరోగ్యవంతమైన బాల్యం బంగారు భవిష్యత్తుకు సాఫల్యమని, ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రామలింగం పిలుపునిచ్చారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ వార్డులో ఆదివారం జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రామలింగం హాజరై మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో తల్లిదండ్రులందరూ తప్పనిసరిగా భాగస్వాములు కావాలని తెలిపారు. అప్పుడే పుట్టిన శిశువు నుండి ఐదు సంవత్సరాల లోపు వయసు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పల్స్ పోలియో చుక్కలు చిన్నారుల కు జీవితాంతం రక్షణ కవచంలా నిలుస్తాయని తెలిపారు. చిన్నారుల ఆరోగ్యంవంతమైన జీవితానికి బంగారు భవిష్యత్తుకు పల్స్ పోలియో చుక్కలు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ కోసం పోలియో రహిత భారతదేశం కోసం ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని కోరారు. జవహర్ నగర్ లో చిన్నారులకు ముఖ్యంగా ఆరోగ్యవంతమైన బాల్యం బంగారు భవిష్యత్తు మన బాధ్యత అన్నారు. అనంతరం పిల్లలకు పోలియో చుక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రెండు చుక్కలు జీవితాంతం రక్షణ

- **ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి**

**మొయినాబాద్ మహా**:పోలియో మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలించి పూర్తిగా నిర్మూలిద్దామని శాసన మండలి ప్రభుత్వం చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు.జాతీయ పల్స్ పోలియో సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో మహేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ రోజులపాటు పోలియో చుక్కలను వేసే కార్యక్రమం సాగుతుందనచేవెళ్ల నియోజకవర్గంలో 32,000 మంది ఐదేళ్ల లోపు వయస్సు గల పిల్లలకు పోలియో చుక్కలను వేస్తున్నట్లు వివరించారు. పోలియో నిర్మూలన కోసం ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, కార్యక్రమాలకు సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామెన భీం భరత్, మున్సిపల్ చైర్ పర్సన్ షాబాద్ సోనియా దర్శన్, మాజీ జడ్పీటీసీ కాలే శ్రీకాంత్, కంజర్ల భాస్కర్,జిల్లా వైద్యాధికారి స్వర్ణ కుమారి, మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్అహ్మద్,రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, మండల అధ్యక్షుడు మాణయ్య, సీనియర్ నాయకులు బొక్క బాలకృష్ణారెడ్డి, మర్రి రవీందర్ రెడ్డి, దేవరంపల్లి మహేందర్ రెడ్డి, హన్మంత్ యాదవ్, గడ్డం వెంకట్ రెడ్డి, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలియో రహిత భువనగిరి మన లక్ష్యం

**మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్**

**యాదాద్రి భువనగిరి జూన్ 28** మహా భువనగిరి పట్టణంలోని వివిధ వార్డుల్లో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ 35, 10, 18 వ తదితర వార్డుల్లో ఉన్న పోలియో వ్యాక్సినేషన్ కేంద్రాలను సందర్శించారు. ప్రతి కేంద్రంలోనూ 5 సంవత్సరాల లోపు చిన్నారులకు చైర్మన్ స్వయంగా పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ "పోలియో వ్యాధి శాశ్వత వైకల్యానికి కారణమవుతుంది. దీన్ని పూర్తిగా రూపుమాపడమే మనందరి ధ్యేయం. ప్రతి ఇంట్లోని 5 సంవత్సరాల లోపు బిడ్డకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి. ఏ ఒక్క పిల్లవాడు కూడా మిగిలిపోకూడదు. భువనగిరిని 100 శాతం పోలియో రహిత పట్టణంగా చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ కలిసికట్టుగా పనిచేయాలి"



అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ తంగళ్ళ పల్లి రవి కుమార్, స్థానిక కౌన్సిలర్లు పాశం అమర్, బింగి నరేష్, యాస్మిన్, స్థానిక నాయకులు పలువురు మహిళలు, చిన్నారులు, పోలియో నిర్వహణ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కౌన్సిలర్లు, స్థానిక నాయకులు కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చివరగా చైర్మన్ సిబ్బంది కృషిని అభినందించి, మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

# 134 కోట్లకు టెలికం చందాదారులు



కొత్త టెలికం కస్టమర్లను ఆకర్షించడంలో ఎప్పటి మాదిరే ఎయిర్‌టెల్ ముందుంది. మే నెలలో 29.8 లక్షల మంది కొత్త సబ్‌స్క్రయిబర్లను (చందాదారులు/కస్టమర్లు) సొంతం చేసుకుంది. ఇందులో 29.26 లక్షల మంది మొబైల్ విభాగం నుంచి రాగా, 53,809 మంది కస్టమర్లు ఫిక్స్‌డ్‌లైన్ వినియోగదారులుగా ఉన్నారు. రిలయన్స్ జియో నెట్‌వర్క్ కిందకు 22.55 లక్షల మంది కొత్తగా వచ్చి చేరారు. ఇందులో 21.54 లక్షల మంది మొబైల్ విభాగం నుంచి రాగా, మిగిలిన వారు ఫిక్స్‌డ్ లైన్ విభాగం నుంచి ఉన్నారు.

## 150 మంది సాఫ్ట్ వేర్ ఇంజినీర్లకు షాక్..
# అందరూ లేఆఫ్



అమెరికాకు చెందిన రిటైల్ టెక్నాలజీ సంస్థ హైవీ భారత్‌లోని తన ఇంజినీరింగ్ సెంటర్‌ను ఆకస్మికంగా మూసివేయడంతో సుమారు 150 మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఒక్కరాత్రిలోనే ఉద్యోగాలు కోల్పోయారు. ఉద్యోగులను రాత్రి 9 గంటలకు మైక్రోసాఫ్ట్ టీమ్స్ వీడియో కాల్‌కు ఆహ్వానించిన సంస్థ, రీస్ట్రక్చరింగ్‌లో భాగంగా భారత ఇంజినీరింగ్ కార్యకలాపాలను వెంటనే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఉద్యోగులకు ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే వారి కార్పొరేట్ యాక్సెస్ కూడా నిలిపివేయబడింది. ఈ ఘటనపై మాజీ ఉద్యోగి ఒకరు రెడ్డిట్‌లో చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఇంటర్న్‌గా చేరి దాదాపు రెండేళ్లలో పూర్తి స్థాయి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎదిగిన తాను, "ఒక్క సమావేశంతో అంతా ముగిసిపోయింది" అని ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాకుండా సంస్థ నుంచి సెవరెన్స్ ప్యాకేజీ లేదా ఎటువంటి ఆర్థిక పరిహారం కూడా అందలేదని పేర్కొన్నాడు. రియాక్ట్, నోడ్ జేఎస్, జావా స్క్రిప్ట్, టైప్ స్క్రిప్ట్ వంటి టెక్నాలజీల్లో పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ, ఒక్కసారిగా ఉద్యోగం కోల్పోవడం తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేసిందని తెలిపాడు. ఈ అకస్మాత్తు తొలగింపులపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరిగింది. ఉద్యోగులకు కనీస నోటీసు లేకుండా మొత్తం టీమ్‌ను తొలగించడం చట్టబద్ధమేనా? అనే ప్రశ్నలు నెటిజన్లు లేవనెత్తుతున్నారు. కొందరు ఉద్యోగుల ఆరోపణల ప్రకారం, తొలగింపుల అనంతరం సంస్థ భారత విభాగానికి సంబంధించిన లింక్డ్‌ఇన్ పేజీతో పాటు పలు పోస్టులను కూడా తొలగించినట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలపై సంస్థ అధికారికంగా స్పందించలేదు. ఇదిలా ఉండగా, హైవీ ఇండియా ఇంజినీరింగ్ డైరెక్టర్ అమిత్ గోయల్ లింక్డ్‌ఇన్‌లో స్పందిస్తూ, భారత ఇంజినీరింగ్ కేంద్రాన్ని మూసేసినట్లు ధ్రువీకరించారు. ప్రభావితమైన ఇంజినీర్లు అత్యుత్తమ ప్రతిభ కలిగినవారని, వారికి కొత్త ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సహకరించాలని తన పరిచయ వర్గాలను కోరారు. అయితే ఉద్యోగుల ఆరోపణల్లో పేర్కొన్న సెవరెన్స్ ప్యాకేజీ, నోటీసు వంటి అంశాలపై సంస్థ ఇప్పటివరకు అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

# ఆధార్, క్రెడిట్ కార్డులు.. జూలై 1 నుంచి కీలక మార్పులు



వచ్చే జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా పలు కీలక ఆర్థిక మార్పులు అమల్లోకి రానున్నాయి. ఇవి ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, ఆధార్ కార్డుదారులు, క్రెడిట్ కార్డు వినియోగదారులు, పాస్‌పోర్ట్ దరఖాస్తుదారులు, బ్యాంకు ఖాతాదారులపై ప్రత్యక్ష ప్రభావం చూపనున్నాయి. ముఖ్యంగా ఆధార్‌లో ఈమెయిల్ అప్‌డేట్‌కు ఉచిత అవకాశం, క్రెడిట్ కార్డుల రివార్డ్ పాయింట్లు, లాంజ్ యాక్సెస్ నిబంధనల్లో మార్పులు, పాస్‌పోర్ట్ ఫీజుల పెంపు, బ్యాంకుల మిస్‌సెల్లింగ్‌పై ఆర్‌బీఐ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తున్నాయి.

**ఐటీఆర్ దాఖలుకు జూలై 31 చివరి తేదీ**

202526 ఆర్థిక సంవత్సరానికి (అసెస్‌మెంట్ ఇయర్ 202627) సంబంధించిన ఐటీఆర్ 1, ఐటీఆర్ 2 రిటర్నులు దాఖలు చేయడానికి జూలై 31, 2026 చివరి గడువు. గడువు దాటితే ఆలస్య రుసుములు, కొన్ని పన్ను విధానాలను ఎంచుకునే అవకాశాలపై పరిమితులు, అర్హత ఉన్న నష్టాలను తదుపరి సంవత్సరాలకు క్యారీ ఫార్వర్డ్ చేయడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

**ఆధార్‌లో ఈమెయిల్ అప్‌డేట్**

యూఐడీఏఐ కీలక నిర్ణయం తీసుకుంది. జూలై 1 నుంచి డిసెంబర్ 31 వరకు ఆధార్ మొబైల్ యాప్ ద్వారా నమోదిత ఈమెయిల్ చిరునామాను అప్‌డేట్ చేసుకునే సేవను పూర్తిగా ఉచితంగా అందించనుంది. దీని కోసం ఇప్పటి వరకు రూ.75 రుసుము ఉండేది. అయితే ఈ రాయితీ కేవలం అధికారిక ఆధార్ మొబైల్ యాప్ ద్వారా చేసే అప్‌డేట్‌లకే వర్తిస్తుంది.

**ఎస్‌బీఐ కార్డుల రివార్డ్ నిబంధనల్లో మార్పులు**

ఫోన్‌పే ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు PURPLE, SELECT BLACK కార్డులకు సంబంధించిన రివార్డ్ పాయింట్ల విధానంలో మార్పులు అమల్లోకి రానున్నాయి. రివార్డ్ పాయింట్లు పొందే లావాదేవీలపై కొత్త పరిమితులు విధించడంతో పాటు, పాయింట్లు లభించని లావాదేవీల జాబితాను కూడా విస్తరించారు.

**హెచ్‌డీఎఫ్‌సీ లాంజ్ యాక్సెస్**

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు క్రెడిట్ కార్డుదారులు ప్రతి క్యాలెండర్ త్రైమాసికంలో మూడు ఉచిత దేశీయ విమానాశ్రయ లాంజ్ సందర్శనలను పొందాలంటే, అంతకుముందు త్రైమాసికంలో కనీసం రూ.60,000 ఖర్చు చేసి ఉండాలి. ఉదాహరణకు జూలైసెప్టెంబర్ త్రైమాసికానికి లాంజ్ సదుపాయం పొందాలంటే ఏప్రిల్ జూన్ మధ్య ఈ ఖర్చు పూర్తిచేయాల్సి ఉంటుంది.

**పాస్‌పోర్ట్ ఫీజుల పెంపు**

జూలై 1 నుంచి సాధారణ, తత్కాల్ పాస్‌పోర్ట్‌ల ఫీజులు పెరుగుతున్నాయి. తాజా నోటిఫికేషన్ ప్రకారం 36 పేజీల సాధారణ పాస్‌పోర్ట్ ఫీజు రూ.1,500 నుంచి రూ.2,500కు, తత్కాల్ ఫీజు రూ.3,500 నుంచి రూ.5,000కు పెరిగింది. ఇతర కేటగిరీల ఫీజులను కూడా కేంద్ర ప్రభుత్వం సవరించింది.

**బ్యాంకుల మిస్-సెల్లింగ్‌పై ఆర్‌బీఐ కఠిన చర్యలు**

బ్యాంకులు ఆర్థిక ఉత్పత్తులను తప్పుదోవ పట్టిస్తూ విక్రయించే ఘటనలను అరికట్టేందుకు రిజర్వ్ బ్యాంక్ కొత్త ఫ్రేమ్‌వర్క్‌ను అమల్లోకి తెస్తోంది. ఈ నిబంధనల ప్రకారం మిస్‌సెల్లింగ్‌కు గురైన వినియోగదారులు పూర్తి రీఫండ్‌తో పాటు జరిగిన నష్టానికి తగిన పరిహారం పొందే హక్కు కలిగి ఉంటారు. బ్యాంకులు ఉత్పత్తుల విక్రయంలో మరింత పారదర్శకత పాటించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు కూడా జూలై 1 నుంచే అమల్లోకి వస్తాయి.

# ఏఐ.. రూ.450 లక్షల కోట్లు

**వచ్చే పదేళ్లలో విస్తరించనున్న ఏఐ సామ్రాజ్యం.. అవకాశాలను అంచనా వేస్తూ దిగ్గజాల అడుగు**





ఏఐ. ఓ అనూహ్యమైన ఎకానమీని సృష్టిస్తోంది. ఈ రెండక్షరాల చుట్టూ అల్లుకున్న ఆర్థిక వ్యవస్థ... వచ్చే పదేళ్లలో ఏకంగా 5 ట్రిలియన్ డాలర్ల (రూ.450 లక్షల కోట్లు) వ్యాపార అవకాశాల్ని అందించబోతోంది. ఇక ఈ ఎకోసిస్టమ్‌లో ఎదిగే కంపెనీల విలువైతే దీనికి వందరెట్ల పైనే ఉంటుందన్నది ఇన్వెస్ట్‌మెంట్ నిపుణుల అంచనా. బహుశా! పారిశ్రామిక విప్లవం తరవాత ప్రపంచం చవిచూస్తున్న అతిపెద్ద మార్పు ఇదే కావచ్చు. ఏఐ ఎంతవేగంగా మారుతోందంటే... ఇపుడిది చాట్‌బోట్లకో, సాఫ్ట్‌వేర్ ఆటోమేషన్‌కో పరిమితం కాదు. తయారీ, విద్య, వైద్యం, ఫైనాన్స్, వ్యవసాయం, లాజిస్టిక్స్, డిఫెన్స్, శాస్త్రీయ పరిశోధన.. ఇలా అన్నిటికీ వెన్నెముకే. ఇపుడు పోటీ మెరుగైన ఏఐ మోడల్‌ను సృష్టించడానికి కాదు. మొత్తం ఏఐ వ్యవస్థను చేతుల్లో ఉంచుకోవటానికి. సెమీ కండక్టర్ల నుంచి డేటా సెంటర్లు, క్లౌడ్ ఇన్‌ఫ్రా, డిజిటల్ ట్విన్స్, అటానమస్ సిస్టమ్స్, పారిశ్రామిక ఏఐ, రోబోటిక్స్... ప్లస్ నైపుణ్యం ఎవరి చేతుల్లో ఎక్కువ ఉంటాయన్నదే నియంత్రణాధికారానికి నిదర్శనం. ఈ అధికారం కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, కార్పొరేట్లు బిలియన్ల డాలర్లను కుమ్మరిస్తున్నాయి. ప్రస్తుత పరిశ్రమల్ని మార్చటంతో పాటు కొత్త పరిశ్రమల్ని సృష్టించే ఏఐ వల్ల 2030 నాటికి ప్రపంచ జీడీపీ 15 ట్రిలియన్ డాలర్లు జతపడుతుందన్నది ఆర్థిక నిపుణుల అంచనా. ఈ నేపథ్యంలో అసలు ఏఐ ఎన్ని రకాలు? వీటి అవసరాలేంటి?

**ఇదీ.. ఏఐ సామ్రాజ్య స్వరూపం**

ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (సర్వర్లు, స్టోరేజీ, కూలింగ్, విద్యుత్తు). క్లౌడ్ అండ్ ప్లాట్‌ఫామ్స్ (కంప్యూటింగ్, క్లౌడ్, మెషీన్ లెర్నింగ్ ఆపరేషన్స్, హోస్టింగ్. ఫౌండేషన్ మోడల్స్ (లార్జ్ మోడల్స్, ట్రెయినింగ్, మరింత మెరుగుపరచటం. ఏఐ అప్లికేషన్లు (ఎంటర్‌ప్రైజ్ ఏఐ, వినియోగదారుల ఏఐ, పారిశ్రామిక ఏఐ తదితరాలు)

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL







# జపాన్‌లో మరోసారి భూ ప్రకంపనలు

**టోక్యో:** జపాన్‌లో మరోసారి భూ ప్రకంపనలు సంభవించాయి. రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 6.1గా నమోదైంది. ఈశాన్య జపాన్‌లోని ఇవాటే ప్రిఫెక్చర్ తీరంలో ఆదివారం తెల్లవారుజామున 6.1 తీవ్రతతో శక్తివంతమైన భూకంపం సంభవించిందని జపాన్ వాతావరణ సంస్థ (JMA) తెలిపింది. అయితే ఈ భూకంపం వల్ల సునామీ వచ్చే ప్రమాదం ఏమీ లేదని స్పష్టం చేసింది. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 5:21 గంటలకు భూమికి 41 కిలోమీటర్ల లోతులో ఈ భూకంపం సంభవించింది. మరోవైపు, జంట తుపానుల తాకిడితో జపాన్ అతలాకుతలమవుతోంది. భారీ వర్షాలతో ఇప్పటికే జపాన్ పశ్చిమ భాగంలోని పలు ప్రాంతాల్లో వరదలు ముంచెత్తుతుండగా గోరుచుట్టుపై రోకటి పోటు చందంగా తుపానులు చుట్టుముట్టాయి. మెఖాలా తుపాను జపాన్ దక్షిణ భాగం చివరలోని అమామీ ద్వీపం తీరం దాటి టోక్యో వైపు దూసుకొస్తుండగా.. హిగో తుపాను కూడా ఈ దిశగానే ప్రయాణిస్తున్నట్లు జపాన్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఫలితంగా టోక్యోకు భారీ వర్షం ముప్పు పొంచి ఉంది. క్యోటో, ఒసాకా తదితర పశ్చిమ ప్రాంతాల్లో ఇప్పటికే వరద ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. నారా ప్రాంతంలో ఒక వ్యక్తి జలప్రవాహంలో పడటంతో గాయాలైనట్లు ఎన్‌హెచ్‌కే పబ్లిక్ టీవీ తెలిపింది. నారా, హిరోషిమా ప్రాంతంలో సుమారు 30 ఇళ్లు వరద ముప్పునకు గురయ్యాయని, విపత్తుల నివారణ సంస్థ అధికారులు తెలిపారు.

# ట్రంప్ నిర్ణయానికి సవాల్.. మమ్దానీ సంచలన వ్యాఖ్యలు





**న్యూయార్క్:** అమెరికాలో వలసదారుల అంశంపై రాజకీయ వివాదం మరోసారి తీవ్రరూపం దాల్చింది. వలసదారుల డిపోర్టేషన్ అంశంపై కేంద్ర, స్థానిక ప్రభుత్వాల మధ్య ఉద్రిక్తత మళ్లీ పెరిగింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న కఠిన వలస విధానానికి సంబంధించి, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మమ్దానీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తీర్పును అమలు చేయబోమని మమ్దానీ ప్రకటించారు.వలస విధానాల విషయంలో ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించేలా అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ట్రంప్ సర్కార్‌కు అనుకూలంగా తీర్పును వెల్లడించింది. హైతీ, సిరియా దేశాలకు చెందిన లక్షలాది మంది వలసదారులకు ఇప్పటివరకు లభిస్తున్న టెంపరరీ ప్రొటెక్టెడ్ స్టేటస్ (TPS) రక్షణను రద్దు చేసేందుకు అనుమతి ఇచ్చింది. దీంతో అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తూ, ఉద్యోగాలు చేస్తున్న లక్షలాది మంది ఒక్కసారిగా డిపోర్టేషన్ ముప్పును ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. ఈ తీర్పును ట్రంప్ ప్రభుత్వం "చట్టానికి దక్కిన విజయం"గా అభివర్ణిస్తుండగా.. మానవ హక్కుల సంఘాలు మాత్రం "వేలాది మంది ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే నిర్ణయం" అంటూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ తీర్పు తర్వాత డిపోర్టేషన్ ప్రక్రియను వేగవంతం చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.ఈ పరిణామంపై న్యూయార్క్ మేమర్ మమ్దానీ తాజాగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యూయార్క్ నగరం సాంక్చువరీ సిటీ విధానాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. ఫెడరల్ డిపోర్టేషన్ చర్యలకు నగర యంత్రాంగం సహకరించబోదని స్పష్టం చేశారు. హైతీ మరియు సిరియా వలసదారుల రక్షణకు కట్టుబడి ఉన్నామని బాంబు పేల్చారు. అవసరమైతే చట్టపరమైన పోరాటం చేస్తామని పేర్కొన్నారు. దీంతో, ఫెడరల్ ప్రభుత్వం, స్థానిక ప్రభుత్వాల మధ్య విభేదాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

**సాంక్చువరీ సిటీ విధానం అంటే?**

అమెరికాలో వలసదారులపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో తరచుగా వినిపిస్తున్న పదం "సాంక్చువరీ సిటీ విధానం" . ఇది ఫెడరల్ వలస అమలు సంస్థలతో సహకారాన్ని పరిమితం చేసి, వలసదారులకు స్థానిక స్థాయిలో కొంత రక్షణ కల్పించే విధానం. స్థానిక నగర ప్రభుత్వాలు అమలు చేసే విధానం ఇది. ఇందులో భాగంగా స్థానిక పోలీసులు వలస స్థితిని అడగరు. చిన్న కేసుల్లో వలస ఆధారంగా డిటైన్ చేయరు. ఫెడరల్ డిపోర్టేషన్ అభ్యర్థనలకు పూర్తిగా సహకరించరు. అయితే తీవ్రమైన నేరాల కేసుల్లో మాత్రం ఫెడరల్ ఏజెన్సీలకు సమాచారం ఇవ్వవచ్చు.

**TPS అంటే ఏంటంటే..**

1990లో అమెరికా కాంగ్రెస్ తీసుకొచ్చిన చట్టం ప్రకారం.. యుద్ధాలు, అంతర్యుద్ధాలు, ప్రకృతి విపత్తులు, తీవ్ర రాజకీయ అస్థిరత లేదంటే మానవతా సంక్షోభం ఎదుర్కొంటున్న దేశాల పౌరులకు అమెరికా తాత్కాలిక రక్షణ (Temporary Protected Status.. TPS) కల్పిస్తుంది. ఈ హోదా పొందిన వ్యక్తులను వారి స్వదేశాలకు బలవంతంగా పంపించరు. అమెరికాలో చట్టబద్ధంగా ఉద్యోగాలు చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. అయితే ఇది గ్రీన్‌కార్డు లేదంటే పౌరసత్వానికి మార్గం కాదు. పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్న తర్వాత ప్రభుత్వం ఈ హోదాను రద్దు చేయవచ్చు. అయితే 2010లో సంభవించిన భారీ భూకంపం తర్వాత హైతీ పౌరులకు టీపీఎస్ ఇచ్చారు. 2012లో సిరియా అంతర్యుద్ధం ప్రారంభమైన తర్వాత అక్కడి ప్రజలకు కూడా ఈ రక్షణ కల్పించారు. అనంతరం ఆయా దేశాల్లో పరిస్థితులు పూర్తిగా మెరుగుపడకపోవడంతో వరుస ప్రభుత్వాలు ఈ గడువును పొడిగిస్తూ వచ్చాయి.

**ఎంతమందిపై ప్రభావమంటే..**

ఈ తీర్పు తక్షణ ప్రభావం.. సుమారు 3.5 లక్షల మంది హైతీ పౌరులు, 6,100 మంది సిరియా పౌరులపై పడనుంది. వీరంతా ప్రస్తుతం అమెరికాలో ఉద్యోగాలు చేస్తూ, కుటుంబాలతో కలిసి నివసిస్తున్నారు. అయితే దీని ప్రభావం ఇంతటితో ఆగే అవకాశం లేదు. ప్రస్తుతం 17 దేశాలకు చెందిన సుమారు 13 లక్షల మంది టీపీఎస్ కింద అమెరికాలో నివసిస్తున్నారు. ఇప్పుడు వచ్చిన తీర్పు ఆధారంగా.. భవిష్యత్తులో ఇతర దేశాల TPSలను కూడా రద్దు చేసే అవకాశాలు పెరిగాయని వలస నిపుణులు చెబుతున్నారు.

# ప్రధాని మోదీకి మరో అంతర్జాతీయ గౌరవం



**విక్టోరియా:** సముద్ర పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి రంగాలలో ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన నాయకత్వాన్ని ప్రదర్శిస్తున్న ప్రధాని మోదీకి మరో అంతర్జాతీయ గౌరవం దక్కింది. వాతావరణ మార్పుల నియంత్రణ, పర్యావరణ అనుకూల వృద్ధి (గ్రీన్ గ్రోత్), సముద్ర వనరుల బాధ్యతాయుత నిర్వహణలో ఆయన చేసిన విశేష కృషిని గుర్తిస్తూ సెషెల్స్ ప్రభుత్వం తమ దేశ అత్యున్నత పురస్కారమైన 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హరైజన్' అవార్డును ప్రధానికి ప్రదానం చేసింది. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రెసిడెన్షియల్ సైటేషన్‌లో ప్రధాని మోదీ సుస్థిర ఆర్థిక వృద్ధి, బ్లూ ఎకానమీ (సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థ) పట్ల చూపిన నిబద్ధతను సెషెల్స్ ప్రభుత్వం కొనియాడింది. ముఖ్యంగా చిన్న ద్వీప దేశాలకు భారత్ అందిస్తున్న మద్దతును, వాతావరణ ప్రతిఘటన శక్తిని పెంపొందించడంలో, అంతర్జాతీయ సహకారాన్ని విస్తరించడంలో మోదీ పోషించిన పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించింది.ఈ పురస్కారం భారత్‌సెషెల్స్ దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక, ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని సెషెల్స్ ప్రభుత్వం స్పష్టం చేసింది. తనకు లభించిన ఈ ప్రతిష్టాత్మక గౌరవంపై ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. సెషెల్స్ ప్రభుత్వ అత్యున్నత పురస్కారాన్ని అందుకోవడంపై గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొంటూ, పర్యావరణ పరిరక్షణను తమ భవిష్యత్ తరాల పట్ల బాధ్యతగా భావిస్తున్న ప్రపంచంలోని అన్ని దేశాలకు దీనిని అంకితం చేస్తున్నాను'అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పర్యావరణం, వ్యవసాయ రంగాలలో ప్రధాని మోదీ అంతర్జాతీయంగా అందుకున్న అవార్డుల పరంపరలో ఇది తాజా చేరింది. కాగా, ఈ ఏడాది మేలో ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ ప్రధానికి 'అగ్రికోలా మెడల్' అందజేసింది. దేశంలో ఆహార భద్రతను బలోపేతం చేయడం, ఆధునిక వ్యవసాయ మార్పులు తీసుకురావడం, సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించినందుకు గాను ఆయనకు ఈ పురస్కారం లభించింది.

# ముడి చమురుకు బై బై.. భారత్‌లోకి జపాన్ మిథేన్ పవర్



**న్యూఢిల్లీ:** క్లీన్ మొబిలిటీ (స్వచ్ఛమైన రవాణా) రంగంలో భారత్, జపాన్ దేశాలు ఒక భారీ విప్లవానికి తెరలేపాయి. పెరుగుతున్న ఇంధన అవసరాలను తీరుస్తూనే, కాలుష్యానికి అడ్డుకట్ట వేసేలా సుమారు 1,000 మిథేన్ ప్లాంట్ల ఏర్పాటుకు ఇరు దేశాలు ఉమ్మడి వ్యూహాన్ని రచిస్తున్నాయి. జపాన్ ప్రధాని సనాయే తకైచి మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా ఈ కీలక ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

**1,000 మిథేన్ ప్లాంట్లు – సరికొత్త రవాణా విప్లవం**

ఈ ప్రతిపాదిత భాగస్వామ్యం ద్వారా భారతదేశంలో మిథేన్ ఉత్పత్తి కేంద్రాలను భారీగా విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దేశవ్యాప్తంగా ప్లాంట్ల సంఖ్యను దాదాపు 1,000కి పెంచనున్నారు. ఈ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే బయోగాస్‌ను (మిథేన్) సీఎన్‌జీ వాహనాలకు ఇంధనంగా ఉపయోగిస్తారు. ఇది దేశంలో పర్యావరణహిత రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే కాకుండా, ముడి చమురు దిగుమతులపై భారత్ ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గిస్తుంది.

**రంగంలోకి సుజుకి – గ్లోబల్ సౌత్ అసిస్టెన్స్**

భారత ప్యాసింజర్ వాహన మార్కెట్లో అగ్రగామిగా ఉన్న జపనీస్ ఆటోమొబైల్ దిగ్గజం 'సుజుకి మోటార్' ఈ ప్రాజెక్టులో అత్యంత కీలక పాత్ర పోషించనుంది. జపాన్ ప్రభుత్వానికి చెందిన 'గ్లోబల్ సౌత్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్' మద్దతుతో సుజుకి ఇప్పటికే భారత్‌లో బయోగాస్ ఉత్పత్తి ప్రాజెక్టులను ప్రారంభించింది. ప్రస్తుతం భారతదేశంలో కొత్త ప్యాసింజర్ వాహనాల విక్రయాలలో సీఎన్‌జీ వాహనాల వాటా 20 శాతానికి పైగా ఉండటంతో, ఈ కొత్త ఇంధన లభ్యత సీఎన్‌జీ వాహనాల వినియోగాన్ని మరింత పెంచనుంది.

**మోదీ-తకైచి సదస్సు – వ్యూహాత్మక బంధం**


గత ఏడాది అక్టోబరులో బాధ్యతలు చేపట్టిన తర్వాత జపాన్ ప్రధాని సనాయే తకైచి భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో భాగంగా ఆమె ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఉన్నత స్థాయి ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఇరు దేశాల మధ్య ఉన్న సాంప్రదాయ దౌత్య సంబంధాలలో భాగంగా జరగనున్న ఈ భేటీలో ఆర్థిక భద్రత, స్వచ్ఛమైన ఇంధనం, ఆర్థిక వృద్ధి వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు.



# మహా పత్రిక







## వరలక్ష్మీ శరత్‌కుమార్.. భర్తను అలా చూపనుందా?

కోలీవుడ్ భామ వరలక్ష్మీ శరత్‌కుమార్ ఈ ఏడాది సరస్వతి మూవీతో అభిమానలను అలరించింది. అంతేకాకుండా ఈ సినిమాకు తానే స్వయంగా దర్శకత్వం వహించింది. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద అంతగా రాణించలేకపోయింది. వరలక్ష్మీ ఇటీవలే పోలీస్ కంప్లైంట్ అనే తెలుగు మూవీలో కనిపించింది. ఈ సినిమా రిలీజ్‌కు ముందుకు వివాదంలో నిలిచింది. వరలక్ష్మీ డబ్బులు తీసుకుని కూడా ప్రమోషన్లకు రావడం లేదని డైరెక్టర్ సంజీవ్ మేగోటి ఆమెను విమర్శించారు. మూవీ రిలీజ్ తర్వాత ఈ వివాదం సద్దుమణిగింది.ఇదిలా ఉండగా డైరెక్టర్‌గా ఎంట్రీ ఇచ్చిన వరలక్ష్మీ.. మరో సాహసానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. తన భర్త నికోలాయ్ సచ్‌దేవ్‌ను ఏకంగా విలన్‌గా పరిచయం చేసేందుకు ప్లాన్ చేస్తోందట. కోలీవుడ్‌లో ఆమె భర్త గ్రాండ్ ఎంట్రీ ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని లేటేస్ట్ టాక్. ఇప్పటికే సినిమాల్లో లేడీ విలన్‌గా మెప్పించిన వరలక్ష్మీ.. భర్తను కూడా నెగెటివ్ రోల్‌లోనే తీసుకురావడం ఆసక్తికరంగా మారింది.

### నికోలయ్ లుక్ వల్లే..

వరలక్ష్మీ భర్తను చూస్తే అచ్చం విలన్‌లాగే కనిపిస్తారు. భారీ దేహంతో పాటు విలన్‌కు ఏమాత్రం తీసిపోని విధంగా అతని లుక్ ఉంటుంది. అందువల్లే వరలక్ష్మీ శరత్‌కుమార్ కూడా భర్తను విలన్‌గా పరిచయం చేసేందుకు రెడీ అయినట్లు తెలుస్తోంది. అతని లుక్, పర్సనాలిటీ విలన్‌గా సెట్ అవుతుందని నెటిజన్స్ కూడా కామెంట్స్ చేస్తున్నారు. అయితే దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. రాబోయే రోజుల్లో ఈ విషయంపై క్లారిటీ రానుంది.



## 'అవును.. విడాకులు తీసుకుంటున్నాం': బుల్లితెర నటి

సినీ ఇండస్ట్రీలోనే విడాకులు పదం ఎక్కువగా వినిపిస్తోంది. ఇటీవల కోలీవుడ్ స్టార్స్ విజయ్, జయం రవి లాంటి వాళ్లు విడాకుల కేసులతో వార్తల్లో నిలిచారు. సినిమా రంగంలోనే ఎక్కువగా ఇలాంటి వార్తలొస్తున్నాయి. తాజాగా మరో స్టార్ జంట విడిపోతున్నట్లు ప్రకటించి షాకిచ్చింది. ప్రముఖ బాలీవుడ్ జంట గౌరవ్ ఖన్నా, ఆకాంక్ష చమోలా తమ బంధానికి గుడ్ బై చెప్పనున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని నటి ఆకాంక్ష తాజాగా లాక్ అప్ సీజన్2 ప్రీమియర్‌లో అఫీషియల్‌గా చెప్పేసింది. గతేడాదిగా తాము విడివిడిగా ఉంటున్నామని.. ఇప్పుడు తమ వివాహ బంధానికి ముగింపు పలుకుతున్నామని ఆమె వెల్లడించింది. ఈ విషయాన్ని 'లాక్ అప్ సీజన్ 2' ప్రీమియర్‌లో ఆకాంక్ష ధృవీకరించింది. గత ఏడాదిగా తాము విడివిడిగా ఉంటున్నామని, ఇప్పుడు తమ వివాహ బంధానికి ముగింపు పలుకుతున్నామని ఆమె అక్కడ వెల్లడించింది. దీంతో 10 ఏళ్ల వివాహ బంధం తర్వాత గౌరవ్ ఖన్నా, ఆకాంక్ష చమోలా విడాకులు తీసుకోబోతున్నారు. ఈ రియాలిటీ షోలో ఆకాంక్ష మాట్లాడుతూ.. "నేను, గౌరవ్ విడాకులు తీసుకుంటున్నాం. మేము గతేడాదిగా విడివిడిగానే ఉంటున్నాం. ఈ విషయం బయటికి చెప్పలేదు. మా మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవు. నాకు, గౌరవ్‌కు మధ్య పరిస్థితులు బాగానే ఉన్నాయి. మేము ఇప్పటికీ ఒకరితో ఒకరం మాట్లాడుకుంటాం. భాగస్వాములుగా మేము ఒకరికొకరు సెట్ కాలేదని అనుకుంటున్నాం., ఎందుకంటే మేమిద్దరం చాలా భిన్నమైన ఫ్యూచర్ ప్లాన్ చేస్తున్నాం. కానీ మేమిద్దరం కలిసి కాదు" అని విడాకులపై తేల్చేసింది.



## అనిరుధ్- కావ్య మారన్ పెళ్లి.. కన్‌ఫామ్ చేసిన నటుడు..!

గతేడాది నుంచి ఏదో వీరిద్దరిపై రూమర్స్ వినిపిస్తూనే ఉన్నాయి. ఓసారి ఎస్ఆర్‌హెచ్ ఓనర్ కావ్యమారన్ అనిరుధ్ రవిచందర్ న్యూయార్క్‌లో జంటగా కనిపించారు. అప్పటి నుంచే ఈ జంటపై డేటింగ్ రూమర్స్ మొదలయ్యాయి. ఆ తర్వాత కూడా చాలాసార్లు వీరి రిలేషన్‌షిప్ గురించే నెట్టింట చర్చ జరుగుతూ వస్తోంది. ఈ ఏడాదిలోనే ఈ జంట పెళ్లి పీటలెక్కనున్నారని టాక్ కూడా వినిపించింది. తాజాగా ఈ రూమర్స్‌పై ప్రముఖ నటుడు వైజీ మహేంద్రన్ స్పందించారు. వీరిద్దరు త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారా? అని ఆయను ప్రశ్నించగా.. అవుననే సమాధానమిచ్చారు. కావ్య మారన్ ప్రస్తుతం వ్యాపారవేత్తగా రాణిస్తున్నారని ఆయన అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్‌గా అనిరుధ్ ఇప్పటికే గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. వీరిద్దరు పెళ్లి చేసుకుంటే మ్యూజికల్ బిజినెస్ అవుతుందని సరదాగా మాట్లాడారు. కాగా.. వైజీ మహేంద్రన్..మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్‌కు వరుసకు పెద్దనాన్న కావడం విశేషం. వైజీ మహేంద్రన్ కామెంట్స్‌తో ఏడాదికి పైగా వస్తున్న రూమర్స్‌కు తెరపడనుంది.

## ఓజీ యూనివర్స్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్.. సుజీత్ ప్లాన్ తెలిస్తే మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే!



సోషల్ మీడియాలో 'ఓజీ' యూనివర్స్ చుట్టూ రోజుకో ఆసక్తికరమైన వార్త నెట్టింట తెగ హల్‌చల్ చేస్తోంది. సుజీత్ డైరెక్షన్‌లో గతంలో వచ్చిన ఓజీ సినిమా బాక్సాఫీస్ వద్ద అఖండ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పవన్ కళ్యాణ్ - సుజీత్ కాంబోలో రాబోతున్న ఓజీ 2 అప్డేట్స్ గురించి పవర్ స్టార్ ఫ్యాన్స్ చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా స్టోరీ గురించి స్వయంగా డైరెక్టర్ సుజీత్ హీరో పవన్ కళ్యాణ్‌ను కలిసి చర్చించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా కథకు సంబంధించి ఒక సెన్సేషనల్ లీక్ ఫిలిం నగర్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో కేవలం ముఠా రాజకీయాలే కాకుండా, దేశభక్తి బ్యాక్‌డ్రాప్‌తో కూడిన ఒక భారీ చారిత్రాత్మక అంశం కూడా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. ఓజీలో కథ 1940లలో మొదలై, 1973 ప్రాంతంలో సాగుతూ 1993లో ముగుస్తుంది. అయితే 'ఓజీ సీక్వెల్' లో 1940ల నాటి కాలానికి సంబంధించిన పూర్తి కథను చూపించబోతున్నారట. ఇక్కడే దర్శకుడు సుజీత్ ఒక ఊహించని ట్విస్ట్ ప్లాన్ చేసినట్లు టాక్. స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఎలిమెంట్‌ను ఈ స్టోరీకి ముడిపెట్టినట్లు తెలుస్తోంది. 1940లలో ఆజాద్ హింద్ ఫౌజ్ (INA) కోసం నేతాజీ దాచిన రహస్య నిధులు లేదా ఆ కాలం నాటి ఒక కీలకమైన మిస్టరీ చుట్టూనే హీరో 'ఓజీ' (పవన్ కళ్యాణ్) ప్రయాణం సాగుతుందని ఇండస్ట్రీ టాక్. ఈ చారిత్రాత్మక లింక్ సినిమా స్థాయిని, పవన్ కళ్యాణ్ క్యారెక్టరైజేషన్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్తుందని అంటున్నారు. దీనిపై చిత్ర బృందం నుంచి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.

## కుర్రకారు ఊపిరి పీల్చుకోండి..

### వరుస షూట్స్ తో దుమ్ములేపుతున్న రాశి సింగ్



రాశి సింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.. టాలీవుడ్‌కి ఇటీవల ఎంట్రీ ఇచ్చిన కొత్త హీరోయిన్లలో ఈ ముద్దుగుమ్మ ఒకరు. రాశి సింగ్ మొట్టమొదట "జెమ్" సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. అయితే ఈ ముద్దుగుమ్మ చిన్నప్పటి నుండి సీరియల్స్ చూసి యాక్టర్ కావాలని ఆసక్తి కలిగిందట.ఈ ముద్దుగుమ్మ 14 ఏళ్ల వయసులో ఓ కమర్షియల్ యాడ్ లో నటించింది ఈ ముద్దుగుమ్మ మొదటి లో ఎయిర్ హోస్ట్ గా కెరీర్‌ను ప్రారంభించింది. ఆ తర్వాత హైదరాబాద్ లో ఉద్యోగం చేసుకుంటూ నటన మీద ఉన్న మక్కువతో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టింది రాశి సింగ్.రాశీ సింగ్ లో జెమ్, పోస్టర్, శశి, ప్రేమ్ కుమార్ వంటి సినిమాల్లో అలరించింది. ఈ మధ్య కాలంలో భూతద్దం భాస్కర్ నారాయణ నటించి మెప్పించింది ఈ ముద్దుగుమ్మ.ఇది ఇలా ఉంటే రీసెంట్ గా సుహాస్ హీరోగా నటించిన 'ప్రసన్నవదనం'తో ఇటీవల ఆడియన్స్‌ను పలకరించింది రాశి సింగ్. సినిమాల్లో అంతగా అవకాశాలు రాకపోయిన సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్ గా ఉంటుంది. ప్పటికప్పుడు తన లేటెస్ట్ ఫోటోషూట్ లతో అలరిస్తూ ఉంటుంది.

## సమంత మా ఇంటి బంగారం.. వంద కొట్టేలా ఉందే..!



సమంత లీడ్ రోల్లో వచ్చిన లేటేస్ట్ మూవీ మా ఇంటి బంగారం. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఊహించని విధంగా దూసుకెళ్తోంది. అభిమానుల అంచనాలకు మించి ఇప్పటికే రూ.73 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది.రెండో వారంలోనూ ఏమాత్రం క్రేజ్ తగ్గడం లేదు. ముఖ్యంగా మహిళలు థియేటర్లకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలోనే సమంత మా ఇంటి బంగారం వంద కోట్లు వసూలు చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఎందుకంటే రెండో వారంలో సామ్ సినిమాకు పోటీగా సినిమాలేవీ లేకపోవడం మరింత కలిసి రానుంది.

### థియేటర్లకు మహిళల క్యూ..

మా ఇంటి బంగారం ఇంతలా హిట్ కావడానికి ప్రధాన కారణం లేడీ ఓరియంటేడ్ కథ కావడమే. ఎలాంటి సంప్రదాయాలు తెలియని ఒక మహిళ కోడలిగా వస్తే పరిస్థితి ఏంటనేది ఈ మూవీలో చాలా బాగా చూపించారు. బలమైన కథ, కథనం వల్లే ఈ సినిమాకు మహిళలు క్యూ కడుతున్నారు. ఫ్యామిలీతో కలిసి మా ఇంటి బంగారాన్ని థియేటర్లలో ఆస్వాదిస్తున్నారు. రెండో వారంలోనూ ఈ మూవీ టికెట్స్ బుకింగ్స్‌లో దూసుకెళ్తోంది. బుక్ మై షోలో ఏకంగా గంటకు ఎనిమిది వేలకు పైగా టికెట్స్ బుకింగ్ అవుతున్నాయి. దీన్ని బట్టి చూస్తుంటే సామ్ మూవీ వంద కోట్లు కొల్లగొట్టడం ఈజీనే అనిపిస్తోంది.

### వసూళ్లకు అదే ప్లస్..

ఈ శుక్రవారం కొత్త సినిమాలు రిలీజ్ కాకపోవడం సమంతకు మరింత కలిసొచ్చింది. పెద్ది మూవీ థియేటర్లలో ఉన్నప్పటికీ మా ఇంటి బంగారానికి ఫ్యామిలీ ఆడియన్స్ క్యూ కట్టేస్తున్నారు. ఇది వసూళ్ల పరంగా మా ఇంటి బంగారానికి బాగా ప్లస్ అయింది. అంతేకాకుండా ఈ మూవీతో ఒక మహిళ తన కుటుంబం కోసం ఏదైనా చేయగలదనే సందేశమిచ్చారు మేకర్స్. నందిని రెడ్డి డైరెక్షన్.. సమంత యాక్షన్ ఫైట్స్ మహిళలనే కాదు.. మాస్ ఆడియన్స్‌ను సైతం ఆకట్టుకుంటున్నాయి. రెండో వారంలో ఏ సినిమా పోటీ లేకపోవడం వల్ల మా ఇంటి బంగారం వంద కోట్లు కొల్లగొట్టిన ఆశ్చర్యపోనక్కర్లేదు.

## కల్కిలో ముందు ఆ రోల్ రిజెక్ట్ చేశా.. తర్వాతే బుజ్జి పాత్ర వచ్చింది..



ప్రపంచవ్యాప్తంగా అఖండ విజయాన్ని సాధించిన సైన్స్ ఫిక్షన్ విజువల్ వండర్ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ మూవీ సృష్టించిన ప్రభంజనం గురించి చెప్పక్కర్లేదు. దర్శకుడు నాగ్ అశ్విన్ అద్భుతమైన సృష్టిగా, రెబల్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కిన ఈ భారీ చిత్రం విడుదలై జూన్ 28తో విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకుంది.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ సినిమాలో అత్యంత ప్రజాదరణ పొందిన ఏఐ వెహికల్ 'బుజ్జి' పాత్రకు తన గొంతుతో ప్రాణం పోసిన స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ కీర్తి సురేష్ మాట్లాడుతూ, నాగ్ అశ్విన్ మొదట 'కల్కి' సినిమాలో తనను బుజ్జి పాత్ర కాకుండా వేరొక నటన ప్రాధాన్యత ఉన్న పాత్ర చేయమని అడిగారని వెల్లడించారు.అయితే, ఎందుకో ఆ పాత్రపై తనకు పూర్తి నమ్మకం కలగకపోవడంతో ఆమె దానిని సున్నితంగా తిరస్కరించారు. కానీ, మరుసటి రోజే నాగ్ అశ్విన్ మళ్లీ వచ్చి, "సినిమాలో మరో అద్భుతమైన పాత్ర ఉందికనీసం ఇదైనా చేస్తావా?" అని అడిగారట. నాగ్ అశ్విన్ విజన్‌పై ఉన్న నమ్మకంతో, ఆయన సినిమాలో ఎలాగైనా భాగం కావాలని కీర్తి భావించారు.తాను మొదటి పాత్రను తిరస్కరించడమే మంచిదయిందని, దానివల్లే తనకు ఎంతో గుర్తింపు తెచ్చిన 'బుజ్జి' పాత్ర లభించిందని కీర్తి సురేష్ సంతోషం వ్యక్తం చేశారు. షూటింగ్‌లో పాల్గొనాల్సిన అవసరం లేదా అని అడగగా, "నాకు కేవలం నీ వాయిస్ మాత్రమే కావాలి" అని దర్శకుడు స్పష్టం చేశారు. ఈ సరికొత్త ప్రయోగం నచ్చి ఆమె వెంటనే ఓకే చెప్పారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com